మాటల్
గత వారంరోజుల్లో జలకండ్
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM ఒంగోలు : fb.com/vaartha Digital

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

8-5-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 97 పేజీలు: 12 వెల: 6.50

## సువేందు పిఎ హత్య కేసుపై సిబిఐ దర్యాప్తు

## హర్మూజ్ తెరిచేందుకు ఇరాన్, అమెరికా ఒప్పందం

9లో



# ఇంకెంత దూరం?

### ఇంకా దోలాయమానంలోనే విజయ్ ప్రభుత్వం ఏర్పాటు

### మెజారిటీ ఎమ్మెల్యేల జాబితాతో రావాలన్న గవర్నర్

### తెరపైకి మళ్లీ రిసార్టు రాజకీయాలు

### 15 మంది అన్నాడిఎంకె ఎమ్మెల్యేలను పుదుచ్చేరి తరలించిన పళనిసామి

### తమిళనాట రసవత్తరంగా కోలీవుడ్ సస్పెన్స్ థ్రిల్లర్

**చెన్నై, మే 7:** తమిళనాట రాజకీయాలు ఇపుడు కోలీవుడ్ సస్పెన్స్‌థ్రిల్లర్ సినిమాను తలపిస్తున్నాయి. ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ మెజార్టీ మార్కును చేరుకోలేకపోవడంతో టివికె విజయ్ తన ప్రయత్నాలను ముమ్మరంచేసారు. రాష్ట్ర గవర్నర్ ఆర్లేకర్‌ను కలిసి ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాలని కోరిన విజయ్‌కు చుక్కెదురే అయింది. మెజార్టీ మార్కు కనిపించడంలేదని 118 మంది ఎమ్మెల్యేల జాబితాతో రావాలని అయితే అప్పటివరకూ మరో పార్టీని ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించబోమని కూడా గవర్నర్ విజయ్‌కు హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇప్పటికే రెండుపర్యాయాలు గవర్నర్‌ను కలిసిన టివికె విజయ్ ఆపార్టీనేతలకు అదే సమాధానం రావడంతో భవిష్యత్తు కార్యాచరణపై న్యాయనిపుణులను కూడా విజయ్ పార్టీ సీనియర్లు సంప్రదింపులు జరిపారు. మరోపక్క రెండేసి స్థానాలు గెలిచిన విసికె, సిపిఐ పార్టీలు తమ నిర్ణయాన్ని హైకమాండ్ వద్దచర్చించి చెపుతామని శుక్రవారానికి వాయిదావేసారు. ఇదిలా ఉంటే ఏకైక అతిపెద్ద పార్టీగా ఉన్న టివికెను ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయాలని ఆహ్వానించకపోవడం దురదృష్టకరమని బిజెపి చెప్పుచేతల్లో >>2

# సంక్షేమం సర్కార్ బాధ్యత

### బిజినెస్ రిఫార్మర్ పురస్కారం మన సమష్టి కృషికి నిదర్శనం

### విశాఖ స్టీల్ ప్లాంట్‌కు రూ. 11,440 కోట్లు కేంద్ర సాయం

### 100 సంక్షేమ పథకాలు నూరుశాతం అమలు

### కలెక్టర్ల సమావేశంలో వివరించిన సింఎం చంద్రబాబు




గురువారం సచివాలయంలో జరిగిన కలెక్టర్ల సమావేశంలో పాల్గొన్న సిఎం చంద్రబాబు, మంత్రులు అచ్చెన్నాయుడు, లోకేష్ తదితరులు

**విజయవాడ,మే7,ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజాస్వామ్యంలో సంక్షేమం ప్రభుత్వాల బాధ్యత అని సిఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. సచివాలయంలో గురువారం రెండు రోజుల పాటు జరిగే 7వ కలెక్టర్ల కాన్ఫరెన్స్ ప్రారంభమైంది..కాన్ఫరెన్సులో స్వాగతోపన్యాసం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజా ప్రతినిధులు అధికారుల కలయికే ప్రభుత్వం అన్నారు.ఆర్థిక అసమానతలు లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా అనేక విధానాలు తీసుకొచ్చామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. వాటిని సమర్థంగా అమలు చేయాల్సిన బాధ్యత యంత్రాంగానిదేనని స్పష్టం చేశారు. సంక్షేమ పథకాలను మనం ఖచ్చితంగా అమలు చేస్తున్నామన్నారు.గతంలో డెలివరీ లీకేజిలు ఎక్కువగా ఉండేవి. అన్నారు.ఇప్పుడు డిబిటి ద్వారా నేరుగా లబ్దిదారుల ఖాతాల్లోకి నిధులు వెళ్తున్నాయి.గత పాలకుల కారణంగా రాష్ట్రం గుంతలు పడిన రోడ్లతో విధ్వంసమైంది. ఇప్పుడు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని అన్నారు. జీవన ప్రమాణాలు పెంచేలా పాలన సాగిస్తున్నాం.అన్నారు.వివిధ పాలసీలతో పెట్టుబడులను ఆకర్షిస్తున్నాం అన్నారు,బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్ పురస్కారం మనందరి సమిష్టి కృషి అన్నారు.. 94 కేంద్ర పథకాల నుంచి రూ.10 వేల కోట్లను గత ప్రభుత్వం డైవర్ట్ చేసింది అన్నారు. రూ.1.30 లక్షల కోట్ల చెల్లించాల్సిన బిల్లులు కూడా గత పాలకులు మనపై రుద్దారు. రెండేళ్ల క్రితం రాష్ట్రం గురించి ఏం మాట్లాడారు.. ఇప్పుడు ఏం మాట్లాడుకుంటున్నారు అనే దానికి ఈ అవార్డు ఉదాహరణ అన్నారు.మంత్రులు, సిఎస్ మొదలు కుని... గ్రామ స్థాయి అధికారి వరకు పని చేయడం వల్లే ఈ అవార్డు దక్కింది అన్నారు.ప్రజల సంతృప్తి స్థాయిని కొలమానంగా పెట్టుకుని >>2

# మమత సర్కార్ డిస్మిస్

- ఆమె పదవికి రాజీనామా చేయకపోవడంతో తన అధికారాలను వినియోగించిన గవర్నర్ రవి
- మమత పదిహేనేళ్ల పాలనకు తెర
- రేపు కొలువుదీరనున్న కొత్త సర్కారు
- సువేందు అధికారికే సిఎం ఛాన్స్?

**కోల్‌కత, మే 7:**బెంగాల్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. సిఎం పదవికి రాజీనామా చేయనని భీష్మించుకు కూర్చున్న మమతా బెనర్జీకి గవర్నర్ ఆర్ ఎన్ రవి షాక్ ఇచ్చారు. మమతా బెనర్జీ రాజీనామా చేయకపోవడంతో బెంగాల్ టిఎంసి ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేశారు. బెంగాల్ అసెంబ్లీని రద్దు చేస్తున్నట్లు గవర్నర్ ఆర్‌ఎన్‌రవి ప్రకటించారు. అలాగే గవర్నర్ మొత్తం మంత్రివర్గాన్ని రద్దు చేశారు. దీంతో మమతా బెనర్జీ ముఖ్యమంత్రి పదవి నుంచి వైదొలిగినట్లైంది. రాజ్యాంగం ప్రకారం గవర్నర్ తన విచక్షణాధికారాలను ఉపయోగించారు. మే 7వ తేదీ అర్ధరాత్రితో బెంగాల్ అసెంబ్లీ 5 ఏళ్ల కాలపరిమితి ముగుస్తోంది. మరోవైపు ఓడిపోయినా మమతా బెనర్జీ సిఎం పదవికి రాజీనామా చేయలేదు. ఈ నేపథ్యంలో గవర్నర్ ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది. ఈ నిర్ణయంతో మమతా 15 ఏళ్ల పాలనకు తెరపడింది. బెంగాల్‌లో శనివారం కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. శుక్రవారం బిజెపి శాసనసభాపక్షం సమావేశం కానుంది. ఈ సమావేశంలో శాసనసభాపక్ష నేతను ఎమ్మెల్యేలు ఎన్నుకోనున్నారు. అసెంబ్లీ రద్దుతో మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని గవర్నర్ రవి బర్తరఫ్ చేసినట్లు అయింది. 294 స్థానాలు ఉన్న పశ్చిమ బెంగాల్ అసెంబ్లీకి రెండు విడతలుగా ఎన్నికలు జరిగాయి. మే 4వ తేదీన ఈ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో అధికారాన్ని బిజెపికి ఓటర్ కట్టబెట్టారు. దీంతో సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే స్పష్టమైన మెజార్టీ ఓటర్ ఇచ్చారు. దీంతో ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బిజెపి అగ్రనేతలు ముహూర్తం ఖరారు చేశారు. మే 9వ తేదీ ఉదయం10 గంటలకు ప్రతిష్టాత్మక బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ >>2





# వర్మకు షాక్!

### పిఠాపురం టిడిపి ఇన్‌చార్జి నుంచి తొలగింపు

### కూటమిలో చెలరేగిన వివాదాలపై అధిష్ఠానం సీరియస్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,మే 7 (ప్రభాతవార్త) :** తెలుగు దేశం పార్టి అదిష్టానం కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గ ఇన్ ఛార్జ్ వర్మకు షాక్ ఇచ్చింది.ఫ్లెక్సీల వివాదం టిడిపి ఇంఛార్జ్ మార్పుకు చోటుచేసుకుంది. ప్రస్తుతం టిడిపి ఇంఛార్జ్‌గా వ్యవహరిస్తున్న ఎస్‌విఎస్‌ఎన్ వర్మను బాధ్యతల నుండి తప్పిస్తూ అధిష్టానం ఝలక్ ఇచ్చింది. దీంతో నియోజకవర్గంలో మార్పులు చోటుచేసుకోబోతున్నాయి.విషయం తెలిసిన వర్మ కన్నీటి పర్యంతమయ్యారు. తనకు అదిష్టానం సంప్రదించాక ఈమేరకు చర్యలు తీసుకున్నారని వర్మ అనుయాయులు చెబుతున్నారు. తరచుగా వర్మ వ్యవహారం కూటమిలో >>2

# రాష్ట్రంలో 12 అదనపు జిల్లా సెషన్స్ కోర్టులు

**విజయవాడ,మే 7,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో నూతనంగా 12 అదనపు జిల్లా సెషన్స్ కోర్టులు ఏర్పాటు చేస్తూ న్యాయ శాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీచేశారు. తూర్పు గోదావరి జిల్లా అమలాపురంలో 14వ అదనపు జిల్లా సెషన్సు కోర్టు, గుంటూరులో అదనపు ఫ్యామిలీ,జిల్లా సెషన్స్ కోర్టు,కృష్ణా జిల్లా గుడివాడలో 17వ అదనపుజిల్లా సెషన్స్ కోర్టు, కర్నూలులో 8వ అదనపు జిల్లా ,సెషన్స్‌కోర్టు. నంద్యాలో 9వ అదనపు జిల్లా ,సెషన్స్‌కోర్టు. విశాఖ పట్టణంలో 14వ అదనపు జిల్లా , సెషన్స్‌కోర్టు. 15వఅదనపు జిల్లా, సెషన్స్ డకోర్టు, 2వఅదనపు ఫ్యామిలీ, జిల్లా ,సెషన్స్ కోర్టు. గాజువాకలో 3వ అదనపు జిల్లా, సెషన్స్‌కోర్టు.గాజువాకలో ఫ్యామిలీ.అదనపు జిల్లా ,సెషన్స్‌కోర్టు. నర్శీపట్టణంలో అదనపు జిల్లా ,సెషన్స్‌కోర్టు. కడప జిల్లాలో అదనపు జిల్లా ,సెషన్స్‌కోర్టు ఏర్పాటవుతున్నాయి.

# రాష్ట్రంలో ఉత్తమ ఆసుపత్రిగా 'స్విమ్స్'

### రూ.100 కోట్లతో స్విమ్స్ ఆధునీకరణ

### తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం

### టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు



గురువారం స్విమ్స్‌లో రూ.55 కోట్లతో ఏర్పాటుచేసిన ఆధునిక వైద్య పరికరాలను ప్రారంభిస్తున్న టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు తదితరులు

**తిరుపతి హెల్త్, మే 7 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాయలసీమ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వీలుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంలో భాగంగా రాష్ట్రంలోనే ఉత్తమ ఆసుపత్రిగా శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్)ను అభివృద్ధి చేస్తున్నామని తిరుమల తిరుపతి దేవస్థానముల ధర్మకర్తల మండలి అధ్యక్షులు బిఆర్ నాయుడు వెల్లడించారు. తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రిలో రూ.55 కోట్లతో ఏర్పాటుచేసిన పెట్ సిటీ స్కాన్, గామా కెమెరా, హైఎనర్జీ అడ్వాన్స్ లీనియర్ యాక్సిలరేటర్ ఆధునిక వైద్య పరికరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బిఆర్. నాయుడు మీడియాతో మాట్లాడుతూ స్విమ్స్ ఆసుపత్రిలో తక్కువ ఖర్చుతో మెరుగైనవైద్యం అందుతోందని చెప్పారు. క్యాన్సర్ వైద్య చికిత్సలకోసం శ్రీ బాలాజి ఆరోగ్య వరప్రసాదిని పథకం నిధులతో ప్రారంభించిన.పెట్ సిటీ స్కాన్, గామా కెమెరా, హై ఎనర్జీ అడ్వాన్స్‌డ్ లీనియర్ యాక్సిలరేటర్ వైద్య పరికరాలు రోగులకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఇందులో దాదాపు రూ.18కోట్ల >>2



# కల్తీ నెయ్యిపై 'హైలెవెల్' కమిటీ

### ఏకసభ్య కమిషన్ నివేదికపై తులనాత్మక అధ్యయనం

### వారంలోగా నివేదికకు ఆదేశం

### మరికొందరు 'పెద్దల' గుట్టురట్టయ్యే అవకాశం

**తిరుమల,మే 7ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలేశుని లడ్డూల పవిత్రతను కాపాడాల్సిన ముఖ్యపెద్దలు లోపాలను అవకాశంగా మార్చుకుని లక్షల్లో దండుకున్నారనే కేసులో ఇక మరింతగా లోతుగా విచారణకు హైలెవల్ కమిటీని నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయంతో టిటిడి గత పెద్దల్లో మళ్లీ గుబులు రేకెత్తుతోంది. ఈ వ్యవహారంలో ఎటుపోయి ఎటొస్తుందో.. ఎవరి మెడలకు ఉచ్చుబిగుస్తుందోననేని ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే లడ్డూలకు కల్తీనెయ్యి సరఫరాపై ఏకసభ్యకమిటీ నివేదికల అంశంలో "వార్త"ముందే చెప్పింది. ఈనెల 3వతేదీ "కల్తీ"నెయ్యి కేసులో ఇక "పెద్దోళ్ల" జోలికెళతారా!? -టెండర్ల నిబంధనల మార్పులో కర్త,కర్మ,క్రియ తేల్చేసిన ఏకసభ్యకమిటీ "అని వివరంగా పేర్కొంది. 2019-24 మధ్యకాలంలో గత వైసిపి ప్రభుత్వంలోని టిటిడి వైసిపి బోర్డు చైర్మన్, కొందరు టిటిడి అధికారులు చేతులు కలిపి ఏకంగా టెండర్ల నిబంధనలే మార్పుచేసి, అర్హతలేని డెయిరీలకు నెయ్యిసరఫరా చేయడం అప్పగించారనేది 2024లోనే గుప్పుమంది. ఇప్పుడు ఇదే విషయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చైర్మన్‌గా, పోలీస్ బాస్ డిజిపి, న్యాయ శాఖ కార్యదర్శి సభ్యులుగా హైలెవల్ కమిటీని నియమించింది. ఏకసభ్యకమిటీ దినేశ్‌కుమార్ ఇచ్చిన నివేదికను కూడా సూచాయంగా పరిగణించ కుండా మరింతగా లోతుగా విచారణ చేసి లోపాలు, పెద్దల పాత్ర ఏ మేరకు ఉందనేది తేల్చడానికి సిద్ధమవనున్నారు. 2019-24 మధ్యకాలంలో తిరుమల లడ్డూలకు కల్తీ నెయ్యి అంశంపై ఏక సభ్య కమిటీ అందించిన నివేదికను అధ్యయనం చేసేందుకు ముఖ్యులైన ఉన్నతాధికారులతో హైలెవెల్ కమిటీని నియమించడం సంచలనమే. రానున్న వారంలోగా నివేదిక సమర్పించాలని ఆగమేఘాలపై ఉన్నత స్థాయి కమిటీకి ఆదేశించడం విశేషం. తిరుమల లడ్డూతయారీలో నాణ్యతతో పాటు ఇతర వివాదస్పద అంశాలపై కూడా >>2



# మరో రెండు రోజులు పిడుగుల వానలు

**విజయవాడ,మే7,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ దిగువ ట్రోపో ఆవరణములో ఆగ్నేయ, నైరుతి గాలులు వీస్తున్నాయని దీని ప్రభావంతో మరో రెండు రోజులపాటు పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ >>2

### కోట్లాది రూపాయలు కమీషన్‌లకే?

### ఎపి ప్రభుత్వమే 250 కోట్లు టిబి డ్యాంకు కేటాయింపు

### ఒక్కొక్క కాంట్రాక్టర్‌కు 58 శాతం వరకు నిధులు విడుదల?

### ఎక్కువ పర్సెంటేజీలు ఇచ్చిన వారికి ఎక్కువ నిధులు

### రింగ్‌మాస్టర్‌గా మారిన ఓ సీమ ఎమ్మెల్యే?



## హెచ్‌ఎల్‌సి, ఎల్‌ఎల్‌సి బిల్లులు చెల్లింపులో

# 8 శాతం కమీషన్?

**అనంతపురం, మే 7 ప్రభాతవార్త బ్యూరో:** తుంగభద్ర డ్యాం పరిధిలో కర్ణాటకలో చేసిన కోట్లాది రూపాయల హెచ్‌ఎల్‌సీ, ఎల్‌ఎల్‌సీ పనులకు సంబంధించి గత ఏప్రిల్,మే నెలల్లో కాంట్రాక్టర్లకు చెల్లిస్తున్న బిల్లుల్లో భారీగా అవినీతి చోటు చేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించేందుకు మాత్రమే దాదాపు 8 శాతం కమీషన్‌ను తుంగభద్ర బోర్డు అధికారులు వసూలు చేస్తున్నట్లు తెలియవచ్చింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున తుంగభద్ర బోర్డులో ఉన్న కొందరు కీలక అధికారులు బిల్లుల చెల్లింపులో అడ్డదిడ్డంగా వ్యవహరించినట్లు ఇప్పటికీ కొనసాగిస్తున్నట్లు తెలియవచ్చింది. ఒక్కొక్క కాంట్రాక్టర్‌కు చేసిన పనులకు సంబంధించి దాదాపు 58 శాతం మొత్తాన్ని విడుదల చేసినట్లు సమాచారం. కమీషన్లు సరిగా ఇవ్వని వారికి తక్కువ శాతం నిధులు కూడా విడుదల చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. 2023లో టిబి డా ్యం పరిధిలో ఆంధ్రా సరిహద్దుల వరకు ఇటు అనంతపురము అటు కర్నూలు వరకు ఉన్న హెచ్‌ఎల్‌సీ, ఎల్‌ఎల్‌సీ పనులకు టెండర్లు పిలిచారు. ఆ పనులు కూటమి ప్రభుత్వం హయాంలో పూర్తి అయ్యాయి. చేసిన పనులకు సంబంధించి బిల్లులు ఇచ్చేందుకు, ఇతర పనుల కొసం ఇటీవల ఏపీ ప్రభుత్వ బడ్జెట్‌లో దాదాపు 250 కోట్ల రూపాయలను కేటాయించి, ఏపీ ప్రభుత్వ వాటా క్రింది తుంగభద్ర బోర్డుకు ఇచ్చారు. ఈ 250 కోట్లకు అదనంగా కర్ణాటక వాటా క్రింద కూడా నిధులు >>2

# ఒకే గొడుగు కిందకు విద్యా శాఖ

### - మంత్రి లోకేష్

**విజయవాడ,మే 7,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర విద్యాశాఖ మొత్తాన్ని ఒకే గొడుగు కిందకు తీసుకొస్తూ, ఒకే డ్యాష్‌బోర్డును రూపొందించబోతున్నట్లు ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కీలక ప్రకటన చేశారు. పాఠశాల విద్య నుంచి ఉన్నత విద్య వరకు అన్ని విభాగాల పనితీరును దీని ద్వారా పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. అమరావతి సచివాలయంలో జరుగుతున్న 7వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో ఆయన ఈ విషయం వెల్లడించారు.ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. "విద్యాశాఖకు సంబంధించి ఒక సమగ్రమైన కేపిఐ (కీ పర్ఫార్మెన్స్ ఇండికేటర్) డ్యాష్‌బోర్డును రూపొందించాం. విద్యా >>2

8-5pg2exHMNWJQE 2_8-5pg2exHMNWJQE.qxd 08/May/26 12:20 AM Page 1





గురువారం బీహార్‌లో కొత్త మంత్రి వర్గ ప్రమాణ స్వీకారానికి హాజరైన ప్రధాని మోడీ

# ఇంకెంత దూరం?

>> నడుస్తున్నారంటూ యువజన కాంగ్రెస్ లోక్‌భవన్‌వద్ద ధర్నాకు పిలుపునిచ్చింది. శుక్రవారంలోపు ప్రభుత్వం ఏర్పాటుకు విజయ్‌ను ఆహ్వానించకపోతే తాము ఆందోళన చేస్తామని ప్రకటించింది. కాంగ్రెస్‌పార్టీ మద్దతిచ్చినందువల్లనే గవర్నర్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శించింది. మరోపక్క అన్నా డిఎంకెకు చెందిన 12 మంది ఎమ్మెల్యేలతో ఎంపి షణ్ముగం రిసార్టుకు తరలించి ప్రత్యేక సమాలోచనలుచేస్తున్నారు. అన్నా డిఎంకెలో మెజార్టీభాగం టివికెకు మద్దతివ్వాలని మతతత్వ పార్టీలకు స్థానం కల్పించకూడదన్న వాదన లేవదీస్తున్నారు. ప్రభుత్వంలో చేరి కేబినెట్‌పదవులను డిమాండ్‌చేయవచ్చని, తమిళనాడు ఉనికిని కోల్పోనీయకూడదన్న వాదన తెస్తున్నారు. అలాగే మాజీ సీఎం ఎంకె స్టాలిన్‌సైతం శుక్రవారం తమ నిర్ణయాన్ని తెలియజేస్తామని ప్రకటించారు. సమీకరణాలు హటాత్తుగా ఎవ్వరూ ఊహించనివిధంగా మారినా ఆశ్చర్యంలేదని రాజకీయ నిపుణులు పేర్కొంటున్నారు. మరోపక్క అటు అన్నాడిఎంకె, ఇటు డిఎంకె పార్టీలు రెండూ కూడా ప్రభుత్వం ఏర్పాటుకు టివికె పార్టీని ఆహ్వానించాలని బలనిరూపణకు అవకాశం ఇవ్వాలని గతంలో కొన్ని రాష్ట్రాల అసెంబ్లీల్లో కూడా ఇవే పరిణామాలుచోటుచేసకున్నాయని నాయకులు తెరపైకి తెస్తున్నారు. ముందునుంచి టివికెకు మద్దతివ్వబోమని చెపుతున్న అన్నాడిఎంకె, డిఎంకెలు కలిసి ప్రభుత్వం ఏర్పాటుచేయాలని భావించినా వాటికి సరైన మెజార్టీకూడాలేదు. ఈలోపు అన్నాడిఎంకెలోనే చీలిక ఏర్పడి చీలికవర్గం టివికె విజయ్‌కు మద్దతిచ్చేందుకు సిద్ధం అవుతున్నట్లు సమాచారం. ఇప్పటికే టివికెకు చెందిన సీనియర్ నాయకులతో మంతనాలు జోరుగా సాగిస్తున్నారు. ఇప్పటికే 12 మంది ఎమ్మెల్యేలతో షణ్ముగం ప్రత్యేక శిబిరం నిర్వహిస్తుంటే అన్నాడిఎంకె ఇతర ఎమ్మెల్యేలను పుదుచ్చేరిలోని ప్రత్యేక శిబిరానికి తరలించి పళనిస్వామి వర్గం తమ వర్గం ఎమ్మెల్యేలను కాపాడుకుంటోంది.

**తెరపైకి మళ్లీ రిసార్ట్ రాజకీయాలు**

తమ ఎమ్మెల్యేలు చేజారిపోకుండా కాపాడుకునేందుకు అన్నాడీఎంకే పార్టీ అప్రమత్తమైంది. బుధవారం 15 మందికి పైగా తమ పార్టీ ఎమ్మెల్యేలను పొరుగున ఉన్న పుదుచ్చేరిలోని ఓ విలాసవంతమైన రిసార్టుకు తరలించింది. ఎన్నికల్లో 108 స్థానాలతో అతిపెద్ద పార్టీగా అవతరించిన విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే), ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 118 మంది మద్దతును కూడగట్టలేకపోయింది. ఈ క్రమంలో టీవీకేకు కొందరు అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు మద్దతు పలకవచ్చనే ప్రచారం జరగడంతో, పార్టీ అధిష్ఠానం వెంటనే ఎమ్మెల్యేలను తరలించే ప్రక్రియ చేపట్టింది. అన్నాడీఎంకే నేత, ఎంపీ సీవీ షణ్ముగం పుదుచ్చేరిలోని ది షోర్ త్రిశ్వమ్ రిసార్టులో 20కి పైగా గదులను బుక్ చేసినట్లు సమాచారం. మరోవైపు కాంగ్రెస్ (5) మద్దతుతో కలిపి విజయ్ బలం 112కు చేరినప్పటికీ, మెజారిటీకి ఇంకా దూరంలోనే ఉండటంతో టీవీకే కూడా తమ ఎమ్మెల్యేలను చెన్నై సమీపంలోని మామల్లపురంలో ఉన్న రిసార్టుకు తరలించింది. మరోవైపు తమిళ రాజకీయాల్లో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. బద్ధ శత్రువులైన డీఎంకే (59), అన్నాడీఎంకే (47) మధ్య తెర వెనుక చర్చలు జరుగుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలని కోరుతూ విజయ్ గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్‌ను కలిశారు. అయితే, 118 మంది ఎమ్మెల్యేల మద్దతును నిరూపించుకున్న తర్వాతే రావాలని గవర్నర్ స్పష్టం చేశారు. దీంతో ప్రధాన పార్టీలన్నీ ఎమ్మెల్యేలను కాపాడుకునే పనిలో పడటంతో తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటు వ్యవహారం మరింత ఉత్కంఠగా మారింది.

**డిఎంకె అన్నాడిఎంకె కలిస్తే మూకుమ్మడిరాజీనామాలే...!**

టివికెను ప్రభుత్వం ఏర్పాటుచేయనీయకుండా డిఎంకె, అన్నాడిఎంకెలు రెండూ కలిసినా వారికి కూడా మెజార్టీ మార్కు చేరుకోవడం కష్టమే. ఈ రెండుపార్టీల్లో ఎవరో ఒకరు మరొకరికి మద్దతు ఇవ్వడంద్వారా ప్రభుత్వం ఏర్పాటుచేసే యోచనలో ఉన్నట్లు సమాచారం. డిఎంకె, ఎఐఎడిఎంకె శిబిరాల్లో ఇందుకు సంబంధించి ప్రత్యేక అత్యవసర సమావేశాలు కూడా జరిగాయి. టివికె వరకూ విజయ్‌కు 108 స్థానాలున్నప్పటికీ రెండుసీట్లలో పోటీచేయడంవల్ల 107 స్థానాలు మాత్రమే ఉంటాయి. ఐదుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేల మద్దతుతో ఆపార్టీకి 112 స్థానాలు వరకూ వచ్చాయి. టివికెకు మరో పదిస్థానాలవరకూ అవసరం అవుతుంది.

# రాష్ట్రంలో 15 లేబర్ అడ్డాల నిర్మాణం

**విజయవాడ మే 7 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో 15 లేబర్ అడ్డాలు నిర్మిస్తున్నామని జిల్లా కలెక్టర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు తెలిపారు. పని కోసం రోడ్ల మీద వేచి ఉండకుండా లేబర్ అడ్డాల్లో కూర్చొంటారు. పని లేని సమయంలో కార్మికులకు స్కిల్ డెవలప్మెంటులో శిక్షణ ఇస్తాం. ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా వారిలో ఆరోగ్య అవగాహన కల్పించాలి. ప్రివెంటివ్ హెల్త్ సక్సెస్ అయితే ప్రజలకు వైద్య ఖర్చులు కూడా తగ్గుతాయి. జిల్లాల వారీగా హెల్త్ స్కోర్‌లు తయారు చేయండి. సోలార్ రూఫ్ టాప్, కుసుమ్ స్కీంలను ఇంటిగ్రేట్ చేసి ఇళ్లు, ప్రభుత్వ కార్యాలయాలపై సౌర విద్యుత్ ఉత్పత్తి చేయాలి. అన్ని ప్రభుత్వ కార్యాలయాల భవనాలు పాఠశాలలు, కళాశాలలపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయండి. రానున్న కాలంలో విద్యుత్ నిమిత్తం ఒక్క పైసా కూడా ఖర్చు చేయాల్సిన అవసరం రానంతగా ప్రభుత్వ కార్యాలయాల వద్ద సోలార్ పవర్‌ఉత్పత్తి జరగాలి. 22 లక్షల పంపు సెట్లకు పీఎం కుసుమ్ ద్వారా సోలార్ పవర్ పెట్టుకుంటే మంచి ప్రయోజనం ఉంటుంది.

# ఉత్తమ ఆసుపత్రిగా 'స్విమ్స్'

>> విలువైన పెట్ సిటీ స్కాన్ పరికరం క్యాన్సర్, మెదడు సంబంధిత వ్యాధులు, గుండె జబ్బులను త్వరగా గుర్తించడంలో ఉపయోగపడుతుందన్నారు. రూ.5 కోట్ల విలువైన గామా కెమెరా అవయవాల పనితీరును, కణజాల స్థితిని చిత్రాల రూపంలో చూపిస్తుందని, క్యాన్సర్, ఇన్ఫెక్షన్లు, గుండె, మెదడు, థైరాయిడ్, ఎముకలు, మూత్రపిండాల పనితీరును అంచనా వేయడానికి ఉపయోగపడుతుందని వివరించారు. అదేవిధంగా, రూ.29 కోట్ల విలువైన హై ఎనర్జీ అడ్వాన్స్డ్ లీనియర్ యాక్సిలరేటర్ ద్వారా అధిక శక్తి గల ఎక్స్‌రేలు లేదా ఎలక్ట్రాన్ కిరణాలను క్యాన్సర్ ట్యూమర్పై ఖచ్చితంగా ప్రసారం చేస్తుందని, దీని వల్ల చుట్టుపక్కల ఆరోగ్యకర కణజాలానికి హాని తక్కువగా ఉంటుందని చెప్పారు. ఈ యంత్రం మెదడు, రొమ్ము, ప్రోస్టేట్, ఊపిరితిత్తులు వంటి భాగాల్లో క్యాన్సర్ చికిత్సకు ఉపయోగపడుతుందన్నారు. స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డాక్టర్ ఆర్వీ కుమార్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు రామారావు స్థాపించిన స్విమ్స్ విశ్వవిద్యాలయం అంచలంచెలుగా అభివృద్ధి చెందుతోందన్నారు. 30 ఏళ్లుగా టిటిడి సహకారంతో రూ.450 కోట్లతో ఆసుపత్రిలో మెరుగైన వైద్యసౌకర్యాలు ఏర్పాటుజరిగిందని వివరించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు టిటిడి చైర్మన్ బిఆర్. నాయుడు మార్గదర్శకత్వంలో ఇదివరకెన్నడూ లేనివిధంగా రూ.600 కోట్లతో పలు భవనాలు నిర్మించుకుంటున్నామని వెల్లడిచారు. ఆరు నెలల క్రితం దాతల సహకారంతో ఎంఆర్ ఐ, సిటి స్టిమ్యులేటర్ యంత్రాలు ప్రారంభించామని గుర్తు చేశారు. మరో రెండు నెలల్లో పూర్తిస్థాయిలో క్యాన్సర్ బ్లాకు ప్రారంభిస్తామన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో భవిష్యత్తులో రోబోటిక్ సర్జరీలు, వైద్య విద్యార్థులకు ఉపయోగపడేలా సిమ్యులేటర్స్, వర్చువల్ డిసెక్షన్ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు రూ.105 కోట్ల విరాళాలతో స్విమ్స్ పలు వైద్యపరికరాలు అందుబాటులోకి తీసుకొచ్చినట్టు వెల్లడించారు. శ్రీ బాలాజి ఆరోగ్య వరప్రసాదిని పథకానికి విరివిగా విరాళాలు అందించి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు తోడ్పాటునందిస్తున్న దాతలకు, కార్పొరేట్ సామాజిక బాధ్యతగా నిధులు అందిస్తున్న సంస్థలకు స్విమ్స్ కుటుంబం తరఫున పాదాభివందనాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు సదాశివరావు, పనబాక లక్ష్మి, జానకి దేవి, భానుప్రకాష్ రెడ్డి, తుడ ఛైర్మన్, టిటిడి బోర్డు సభ్యులు సి. దివాకర్రెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, తిరుపతి మున్సిపల్ మాజీ డిప్యూటీ మేయర్ ఆర్. సి. మునికృష్ణ, ఇతర నాయకులు స్విమ్స్ అధికారులు, రేడియేషన్ అంకాలజీ, న్యూక్లియర్ మెడిసిన్ విభాగం వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఒకే గొడుగు కిందకు విద్యా శాఖ

>>ర్థుల హాజరు, డ్రాపవుట్లు, మధ్యాహ్న భోజనం వంటి కీలక అంశాలను ఇందులో పొందుపరిచాం. నిర్దేశిత లక్ష్యాలను సాధించడంలో ఈ డ్యాష్‌బోర్డు కలెక్టర్లకు ఎంతగానో ఉపయోగపడుతుంది" అని వివరించారు. 'డెమాక్రటైజేషన్ ఆఫ్ డేటా' తమ లక్ష్యమని, త్వరలోనే ఈ డ్యాష్‌బోర్డును ప్రజలకు కూడా అందుబాటులోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు. ఇదే సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. ఉత్తమ విధానాలు (బెస్ట్ ప్రాక్టీసెస్) అమలు చేసేందుకు జిల్లాల కలెక్టర్లను మెంటార్లుగా నియమిస్తామని ప్రకటించారు. ఇందులో భాగంగా, స్కూళ్లలో స్మార్ట్ కిచెన్ల ఏర్పాటుకు మెంటార్‌గా కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్‌ను నియమిస్తున్నట్టు తెలిపారు. పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ నిర్ణయాలు స్పష్టం చేస్తున్నాయి.

# యుద్ధవిమాన ప్రాజెక్టుకు 15న శంకుస్థాపన

## పుట్టపర్తి సమీపంలో ఏర్పాటు

**విజయవాడ,మే 7,ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీ సత్యసాయి జిల్లాలోని పుట్టపర్తి సమీపంలో ఐదవ తరం స్టెల్త్ యుద్ధ విమానాల తయారీ ప్రాజెక్టు ఏర్పాటు కానుంది. ఈ ప్రాజెక్టుతో పాటు, దీనికి అనుబంధంగా వచ్చే పరిశ్రమల ద్వారా సుమారు రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులు సమకూరుతాయని అంచనా వేస్తున్నారు. ఈ నెల 15వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తారని మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఈ మేరకు మంత్రి కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేసారు. ఈ కేంద్రంలో స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన సుమారు 140 అధునాతన మధ్యస్థ యుద్ధ విమానాలను (డీఆర్‌డివో) తయారు చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (ఎఎంసీఏ)ఈ ప్రాజెక్టు ఏర్పాటు బాధ్యతలను ప్రధానంగా పర్యవేక్షింస్తోంది. తిలీదితి విమానాలకు అవసరమైన వ్యవస్థల రూపకల్పన, పరీక్షలు వివిధ భాగాల (మాడ్యూల్స్)కూర్పు పనులు బెంగళూరు కేంద్రంగా పనిచేసే ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఏడిఏ) వద్ద పూర్తి చేస్తారు. ఈ భాగాలను బెంగళూరు నుంచి శ్రీ సత్యసాయి జిల్లాలోని పుట్టపర్తికి తరలించాలని ఈ ప్రతిపాదనలో పేర్కొన్నారు. విమాన నమూనాల తుది కూర్పు (ఫైనల్ అసెంబ్లీ) నేలపైన నిర్వహించే పరీక్షల కార్యకలాపాలు పుట్టపర్తిలోని కేంద్రంలో జరుగుతాయి. విమాన పరీక్షల సముదాయం శాస్త్రవేత్తల నివాస గృహాలు, తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం డీఆర్‌డీవోకు 600 ఎకరాల భూమిని కేటాయించింది. ప్రైవేటు రంగ భాగస్వాములతో కలిసి ఏడీఏ ఈ కేంద్రాన్ని నిర్మించనుంది. ఏఎంసీఏ అభివృద్ధి తయారీ ప్రక్రియలో టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, ఎల్ అండ్ టీ, భారత్ ఫోర్జ్ వంటి సంస్థల సహకారాన్ని తీసుకోవాలని ప్రతిపాదించారు. ఈ ప్రాజెక్టుకు అనుబంధంగా పలు అనుబంధ పరిశ్రమలు కూడా ఏర్పాటు కానున్నాయి.

## వారం - వర్జ్యం

08-05-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, కృత్తిక కార్తె
షష్ఠి మ.12.19
ఉత్తరాషాఢ రా.9.17
వర్జ్యం : రా.1.38-రా.3.22
దు.ఉ.8.13-ఉ.9.04,
2) మ.12.29-మ.1.20
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** దైవం తోడు ఉంటే కాలం కలిసి వస్తుందని సమయం కోసం వేచి ఉంటారు. పోటీ పరీక్షలలో పాల్గొంటారు.

**వృషభం:** రాజకీయ యత్నాలు, చర్చలు ఫలిస్తాయి. సంతాన అభివృద్ధికి ఎంతో కృషి చేస్తారు. ఉద్యోగావకాశాలు పొందుతారు.

**మిథునం:** పూర్వం కన్నా భిన్నంగా ప్రవర్తిస్తారు. దైనందిన జీవితంలో మార్పులు చేస్తారు. ఆ మార్పులు కలిసి వస్తాయి.

**కర్కాటకం:** వృత్తి, వ్యాపారాలలో లాభం నామ మాత్రం గానే ఉంటాయి. సొంత ఆలోచనలు మేలు చేస్తాయి. వివాదాలకు దూరంగా ఉండండి.

**సింహం:** పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని గతంలో వద్దనుకున్న అవకాశాలు తిరిగి అనుకూలం చేసుకునే యత్నాలు చేస్తారు.

**కన్య :** విదేశీయానం, ఉద్యోగం వంటి ముఖ్యమైన విషయాలు కలిసి వస్తాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు.

**తుల :** పలువిషయాలలో అభిప్రాయ భేదాలు, వాగ్వివాదాలు సంభవించడం చికాకు కలిగిస్తుంది. ఆరోగ్యం జాగ్రత్త.

**వృశ్చికం:** ఆరోగ్యపరంగా తీసుకునే జాగ్రత్తలు మంచి ఫలితాలనిస్తాయి. ఇతరులకు సహాయం చేసి విరోధులవుతారు.

**ధనుస్సు:** పొదుపు చేసిన ధనాన్ని పెట్టుబడి రూపంలో చూసుకోవలసి ఉంటుంది. కాంట్రాక్టులు దక్కుతాయి. వస్త్రలాభం.

**మకరం:** మీ కృషి వల్ల మీరు సుఖపడకపోయినా మీ వాళ్ళు సౌఖ్యంగా ఉంటారు. ఆశ్చర్యకరమైన ఆహ్వానాలు అందుతాయి. వాహనసౌలభ్యం.

**కుంభం:** వాతావరణంలో వచ్చే మార్పులు ప్రభుత్వ విధానాలు ఆందోళన కలిగిస్తాయి. సామాజిక కార్యక్రమాలలో పాల్గొంటారు.

**మీనం:** కుటుంబ సభ్యుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొన్న కొన్ని అవమానాలు భరించాల్సి వస్తుంది. ప్రయాణాలు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# సంక్షేమం సర్కార్ బాధ్యత

>> పాలన అందిస్తున్నామన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో బాగా పనిచేసిన చోట ప్రజల నుంచి పాజిటివ్ ఫీడ్ బ్యాక్ వస్తోంది. మంత్రుల నుంచి క్షేత్రస్థాయిలో ఉన్న ప్రజాప్రతినిధి, ఉద్యోగి వరకూ అంతా బాధ్యతగా ఉండాలి. వచ్చిన ఫిర్యాదులు వందశాతం పరిష్కారం కావాల్సిందే. ర్థికేతర ఫిర్యాదులను పరిష్కరించకుండా.. కొందరు పైకి కిందకు తిప్పుతున్నారు... వాటిని తక్షణం పరిష్కరించాలి.

ఆర్థికపరమైన ఫిర్యాదుల గురించి కూడా విచారణ చేసి సరైన వాటిని పరిష్కరించాలి. 2027 మార్చి నాటికల్లా రెవెన్యూ రికార్డులను పూర్తిగా ప్రక్షాళన కావాలి. సమస్య పరిష్కారం కోసం వినూత్నంగా ఆలోచనలు చేస్తే సుపరిపాలన అందించినట్టే, డబ్బులు లేవనడం కాదు, సంపద సృష్టి పని చేయాలి, చేద్దాం. వెల్ఫేర్, డెవలప్మెంట్, వెల్త్ క్రియేషన్ అనేది ఓ సైకిల్..అన్నారు. అభివృద్ధి లేకుండా సంపద లేదు. సంపద లేకుండా సంక్షేమం లేదన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో భద్రత, భరోసా కల్పించాం అన్నారు. పి4తో ఆర్థిక ప్రమాణాలు పెంచుతున్నాం అన్నారు. 26 కొత్త పాలసీలతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎపి అంటే నమ్మకాన్ని కల్పించాం అన్నారు..రాయల్ ఎన్ ఫీల్డ్‌ను డ్రైవ్ చేయడమనేది గర్వంగా ఉండేది. అన్నారు. నా కాలేజీ రోజుల్లోకూడా ఎన్‌ఫీల్డ్ డ్రైవ్ చేయడం చాలా గొప్పగా ఫీలయ్యేవాళ్లం అన్నారు..అలాంటి రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థను ఎపికి తెచ్చాం. రూ. 23 లక్షల కోట్ల ఎంఓయూలు చేసుకున్నాం. ఇవి సాకారమైతే 24 లక్షల మేర ఉద్యోగాలు వస్తాయి. గ్రీన్ ఎనర్జీతో పాటు గ్రీన్ హైడ్రోజన్, అమ్మోనియా ఉత్పత్తి దిశగా ముందుకు వెళ్తున్నాం. బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు దక్కినందున సిఎం చంద్రబాబుకు సమావేశంలో అంతా అభినందనలు తెలిపారు.

**ప్రభుత్వ కృషిని ప్రజలల్లో బలీయంగా తీసుకుని వెళ్లాలి**

విశాఖపట్నం, అమరావతి, తిరుపతి కేంద్రంగా 3 రీజియన్ల అభివృద్ధి చేస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. కేంద్రంతో సమన్వయంతో ఉంటూ దాదాపు 90 కేంద్ర పథకాల పునరుద్ధరణ చేసామన్నారు. 100వరకు సంక్షేమ పథకాలను నూరుశాతం అమలు చేస్తున్నామన్నారు. రుణాల రీ షెడ్యూల్‌తో వడ్డీ తగ్గింపు జరిగిందన్నారు. రాష్ట్రానికి సెమీ కండక్టర్, డిఫెన్స్ పరిశ్రమలు, విశాఖ స్టీల్ ప్లాంట్ కు రూ.11440 కోట్లతో కేంద్ర సాయం అందిస్తుందన్నారు. వేగంగా పోర్టులు, ఫిషింగ్ హార్బర్‌ల నిర్మాణం జరుగుతుందన్నారు. జూలై నాటికి భోగాపురం విమానాశ్రయం పూర్తి లక్ష కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు - విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటుకు గెజిట్‌ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లు కొత్తగా మార్కాపురం, పోలవరం జిల్లాల ఏర్పాటు, లక్ష మంది మహిళా పారిశ్రామిక వేత్తలు మరో 5 లక్షల మంది లక్ష్యం, శ్రీ సిటీలో రూ. 5 వేల కోట్లతో ఎల్ జీ, రూ.1000 కోట్లతో క్యారియర్ ఏసీ పరిశ్రమకు శంకుస్థాపన. రూ.5,400కోట్లతో రెన్యూ ఎనర్జీ సంస్థకు శంకుస్థాపన, అనకాపల్లిలో రూ.1.35 లక్షల కోట్లతో ఆర్సెలార్ రూ ప్లాంట్‌కు శంకుస్థాపన, విశాఖపట్నంలో రూ.1.35 లక్షల కోట్లతో గూగుల్ ఏఐ డేటా సెంటర్ హబ్‌కు శంకుస్థాపన. రూ.1 లక్షల కోట్లతో రిలయన్స్ డేటా సెంటర్ ఏర్పాటుకు అడుగులు, 23 నెలల్లో 5.5 లక్షల ఇళ్లు పేదలకు అందజేత..మరో 5 లక్షల ఇళ్ల నిర్మాణానికి సంకల్పం, 50 వేల మంది కాంట్రాక్టర్లకు రూ.2 వేల కోట్లు చెల్లింపులు, ఉద్యోగులకు 23 నెలల్లో రూ.21 వేల కోట్ల బకాయిలు చెల్లింపులు, అగ్నిమాపక శాఖ బలోపేతం - రూ. 34 కోట్లతో కొత్త పరికరాలు, వాహనాలు. తగ్గిన క్రైమ్ రేట్ - మహిళల భద్రతకు ప్రాధాన్యత,.గంజాయిడ్రగ్స్‌పై ఉక్కుపాదం ఈగల్ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు ఇవన్నీ దాదాపు రెండేళ్ల పాలనలో చేసామన్నారు. వీటిని ప్రజల్లో బలీయం తీసుకుని వెళ్లాలి.

**డేటా, ఏఐ, క్వాంటం లాంటి టెక్నాలజీలకు కేంద్రంగా ఎపి**

డేటా, ఏఐ, క్వాంటం లాంటి టెక్నాలజీలకు ఏపీ కేంద్రంగా మారనుంది సీఎం చంద్రబాబు అన్నారు. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ లాంటి దిగ్గజ కంపెనీలు ఎపికి వచ్చాయి అన్నారు. రోజుకో ఒప్పందం, వారానికో శంకుస్థాపన చేసుకోగలుగుతున్నాం. వేసవిలో దేశ ప్రజలకు చల్లబరిచే ఎసిలు మన రాష్ట్రం నుంచే సరఫరా చేసే పరిస్థితికి వచ్చాం అన్నారు,.గత రెండు కలెక్టర్ల సమావేశంలో ప్రజెంట్ చేసిన బెస్ట్ ప్రాక్టీసెస్ అమలు ఏ మేరకు వచ్చిందనే అంశంపై, జీఎస్డీపీ గ్రోత్, జిల్లాల వారీ జీఎస్డీపీ అంచనాలపై ముఖ్యమంత్రి సమీక్షించారు. జీఎస్డీపీ గ్రోత్ పై వాణిజ్య పన్నుల శాఖ చీఫ్ కమిషనర్ బాబు.ఏ, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు పీయూష్ కుమార్, రోనాల్డ్ రోస్, వినయ్ చంద్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు ఇచ్చారు. కలెక్టర్ల కాన్ఫరెన్సులో సింగపూర్ పర్యటన అధ్యయనాలను మంత్రులు అందించారు. మంత్రులు అచ్చెన్నాయుడు, నారాయణ, అనిత, సత్యకుమార్ యాదవ్, అనగాని, బీసీ జనార్దన్ రెడ్డి సింగపూర్ ట్రైనింగ్ వివరాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యాలు, విద్యవైద్యం, పెట్టుబడుల గ్రౌండింగ్, జలధార వంటి అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షిస్తారు.

**గత ప్రభుత్వం అనవసరంగా ప్రైవేటు భూములను నిషేధిత జాబితాలో పెట్టేసింది.**

గత ప్రభుత్వం అనవసరంగా ప్రైవేటు భూములను నిషేధిత జాబితాలో పెట్టేసిందని సిఎం చంద్రబాబు అన్నారు. కార్యాలయాల చుట్టూ తిరిగి ప్రజలు విసిగిపోతున్న పరిస్థితి ఉందన్నారు. భూముల విషయంలో జీరో ఎర్రర్ రికార్డులు తయారు చేయాలి. అన్నారు. రోడ్లు, వంతెనలు, ఎత్తిపోతల ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలి అన్నారు. ప్రతీ మూడు నెలలకూ నిర్వహించే కలెక్టర్ల సదస్సు మంత్రులు, అధికారులకు క్వార్టర్లీ పరీక్షలు అన్నారు. ప్రజల కోసం పనిచేసే వ్యక్తులు ఎవరికీ భయపడాల్సిన అవసరమే లేదు అన్నారు. పబ్లిక్ రిలేషన్స్ ఎంతో ముఖ్యమో., పబ్లిక్ డెలివరీ కూడా అంతే ముఖ్యం. అన్నారు. జిల్లాల్లో అమలు చేసే ఉత్తమ పద్ధతులను బెస్ట్ ప్రాక్టీసెస్ మిగతా జిల్లాల్లోనూ అమలు చేస్తాం అన్నారు. ఆ కలెక్టర్లనే వాటికి నోడల్ ఆఫీసరుగా పెడతాం అన్నారు. సీయింగ్ ఇజ్ బిలీఫ్ అనే విధానంలో 3 రోజుల కార్యదర్శులు, 6 రోజులు హెచ్వోడీలు, 8 రోజులు కలెక్టర్లు ఫీల్డ్ కు వెళ్లాలి అన్నారు. సామాజిక మాధ్యమాలను సక్రమంగా వినియోగించుకోవాలి అన్నారు.



గురువారం న్యూఢిల్లీలో పునరుద్ధరించబడిన నెహ్రూ ప్లేస్ పోస్టాఫీసును ప్రజలకు అంకితం చేసే కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా

# కల్తీ నెయ్యిపై 'హైలెవెల్' కమిటీ

>> ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏకసభ్యకమిటీ నివేదికలోని సాంకేతిక, పరిపాలనాపరమైన, న్యాయపరమైన అంశాలను సమగ్రంగా సమీక్షించి, బాధ్యులపై ఎక్కడ ఎలాంటి చర్యలు తీసుకోవాల్సి ఉందనేది తేల్చనున్నారు. అత్యున్నత స్థాయి కమిటీ తన నివేదికను వారంలోగా ప్రభుత్వానికి సమర్పించాలని డెడ్‌లైన్ విధించడం వెనుక కూడా పెద్దోళ్ళపై చర్యలకు సిద్ధమైందనే సంకేతాలు అందినట్లేనని టిటిడి వర్గాల్లో చర్చ మొదలైంది. ఏడుకొండలస్వామికి అపచారం చేసిన వాళ్ళను ఆ దేవుడే క్షమించడనే వాదనలు గుప్పుమంటున్నాయి. కల్తీనెయ్యి వినియోగం, సరఫరాలో గత మాజీ ఛైర్మన్‌లు వైవి సుబ్బారెడ్డి, అప్పటి టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్(ఇప్పటికే చర్యలకు గురై పోస్టింగ్‌కూడాలేని), అదనపు ఇఒ ఏవి ధర్మారెడ్డి(కీలకమైన డిఆర్‌డిఒ శాఖ పదవి నుండి తప్పుకుని, విశ్రాంతత)పాత్ర ఉందనేది సిబిఐ సిట్‌తోబాటు ఏకసభ్యకమిటీ నిగ్గుతేల్చిందనేది నివేదికలో ప్రధాన అంశం. ఇక కర్త, కర్మ, క్రియగా మారిన టిటిడి ముఖ్య గణాంకఅధికారి (ఎఫ్ఎఎ ఇఒ) ఓ.బాలాజీ(దీర్ఘకాల సెలవుపై వెళ్ళిపోయిన) వ్యవహరించి అక్రమాలకు వంతపాడారనేది ప్రధాన ఆరోపణలు.

# వర్మకు షాక్!

>> తలనొప్పులుగా మారడంతో పార్టీ అదిష్టానం సీరియస్ అయ్యింది. పార్టీ అదినేత చంద్రబాబు కూడా కుర్చీ కోసం, ఫ్లెక్సీలకోసం వివాదాలు చేస్తే ఊరుకోనని గట్టిగా హెచ్చరించారు. హైకమాండ్‌లో తామంతా సఖ్యతగా వున్నప్పుడు మీకెందుకు ఆ విరుగుపాటంటూ సిఎం అసహనం వ్యక్తం చేసిప్పుడే వర్మకు చెక్ పెడతారని ఊహాగానాలు వినిపించాయి. వర్మను గురువారం ఇంచార్జ్ బాధ్యతల నుండి తొలగించింది. త్వరలో నియోజకవర్గ పార్టీ వ్యవహారాల నిర్వహణ కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటును టీడీపీ అధిష్ఠానం చేపట్టబోతుంది.

టిడిపి కమిటీ నియామకంపై పార్టీ అధిష్ఠానం ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది. పార్టీ కార్యకలాపాలకు వీలైనంత త్వరగా కమిటీ ఏర్పాటు చేయాలని అధిష్ఠానం చర్యలు చేపట్టింది. వర్మ దూకుడు స్వభావ వ్యవహారం కూటమిలో చీలికలు తెచ్చే విధంగా ఉండడంతో అధిష్ఠానం దిద్దుబాటు చర్యలు తీసుకుంది. పలుమార్లు అధిష్ఠానం నుంచి హెచ్చరికల నేపథ్యంలో కూడా ఆయన వ్యవహార శైలిలో మార్పు రాకపోవడంతో తక్షణ చర్యల్లో భాగంగా ఇంచార్జ్ పదవి నుంచి తొలగించింది. నియోజకవర్గంలో టిడిపి ఇంచార్జి మార్పుకు దారి తీసిన పరిస్థితులు ఆయన లేవదీసిన ఫ్లెక్సీల వివాదమే ప్రధాన కారణం. ఇటీవల పిఠాపురంలో ప్రభుత్వ కార్యకలాపాల్లో ఫ్లెక్సీల విషయంలో అధికారులను, కూటమి నాయకులపై నానాయాగి చేసి పరుష పదజాలంతో విరుచుకుపడడంతో పాటు జనసేన నాయకులను అవినీతిపరులుగా పేర్కొనడంతో తోపులాటల వరకూ వెళ్లింది. అనంతరం చోటు చేసుకున్న పరిస్థితులపై నివేదికను తెప్పించుకున్న అధిష్ఠానం ఇంచార్జి మార్పుకు నిర్ణయం తీసుకుంది.

# సర్కార్ డిస్మిస్

>> ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతుందని పశ్చిమ బెంగాల్ బిజెపి చీఫ్ సమీక్ భట్టాచార్య ప్రకటించారు. మరోవైపు ముఖ్యమంత్రి అభ్యర్థిపై పలువురి పేర్లు తెరపైకి వచ్చాయి. టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీపై ఘన విజయం సాధించిన సువెందు అధికారిని ముఖ్యమంత్రిగా నియమిస్తారనే ప్రచారం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతుంది. ఇంకోవైపు ఈ ఎన్నికల్లో ఓటమి పాలవడంతో ఎన్నికల సంఘంపై మమతా బెనర్జీ తీవ్ర ఆరోపణలు చేశారు. అసలు విలన్ ఇసి అంటూ మండిపడ్డారు. ముఖ్యమంత్రి పదవికి తాను రాజీనామా చేసే ప్రసక్తే లేదంటూ ఆమె కుండబద్దలు కొట్టారు. బెంగాల్ అసెంబ్లీ కాలపరిమితి నేటితో గురువారంతో ముగిసింది. సిఎం పదవికి మమతా బెనర్జీ రాజీనామా చేయలేదు. దీంతో గత ప్రభుత్వాన్ని రద్దు చేస్తున్నట్లు గవర్నర్ ఆర్ఎన్ రవి ప్రకటించారు.

# మహానాడు ప్రతినిధుల నమోదు కమిటీ కన్వీనర్‌గా చింతకాయల విజయ్

**విశాఖపట్నం, మే 7,ప్రభాతవార్త:** ఈ నెల 27, 28, 29 తేదీలలో నెల్లూరు వేదికగా జరగనున్న తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మక కార్యక్రమం మహానాడుఖికు సంబంధించి ప్రతినిధుల నమోదు కమిటీ కన్వీనర్‌గా టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర నలుమూలల నుంచి మహానాడుకు తరలివచ్చే పార్టీ శ్రేణులు, ముఖ్య నాయకులు, కార్యకర్తల పేర్ల నమోదు ప్రక్రియను ఆయన పర్యవేక్షించనున్నారు. సభకు హాజరయ్యే ప్రతినిధులందరికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పకడ్బందీగా, సమన్వయంతో నిర్వహించే బాధ్యతను ఆయనకు అప్పగించారు.

# 8 శాతం కమీషన్?

>> విడుదల చేయడంతో ఎల్‌ఓసీల మేరకు తుంగభద్ర బోర్డు ఏప్రిల్, మే నెలల్లో కాంట్రాక్టర్లకు నిధులు విడుదల చేస్తూ వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇటు కాంట్రాక్టర్లకు, అటు తుంగభద్ర బోర్డులోని అధికారులతో మధ్యవర్తిగా మాట్లాడేందుకు రాయలసీయ జిల్లాలకు చెందిన ఓ కీలక ఎమ్మెల్యే చక్రం తిప్పినట్లు తెలియవచ్చింది. ఈ కీలక ఎమ్మెల్యే ఎవరన్నది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. టిబి డ్యాం క్రింద చేసిన పనులకు బిల్లులు చెల్లింపులలో జరిగిన అక్రమాలపై ఉన్నతస్థాయి అధికారులకు, ఏపీ ప్రభుత్వ పెద్దలకు కొందరు కాంట్రాక్టర్లు ఫిర్యాదు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ విషయంలో ఏపీ ప్రభుత్వం, తుంగభద్ర బోర్డు ఏ చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి.

# పిడుగుల వానలు

>> తెలిపారు. ఇదే సందర్భంలో కొన్ని జిల్లాల్లో ఎండల తీవ్రత అధికంగా ఉంటుందని వివరించారు. గురువారం పోలవరం జిల్లా విఆర్ పురంలో 41.7 నెల్లూరుజిల్లా కొమ్మిపాడులో 41.3 కర్నూలుజిల్లా నగరడోన, కడప జిల్లా లో 41.2 నంద్యాలజిల్లాలో ఆళ్లగడ్డలో 41.1 పశ్చిమగోదావరి జిల్లా పోడూరులో 41 , అనంతపురంజిల్లా తెరన్నపల్లి, ఏలూరుజిల్లా ధర్మాజీగూడెం, పల్నాడు జిల్లా బెల్లంకొండలో 40.8 ఎన్టీఆర్ జిల్లా చిలకల్లులో 40.3 తిరుపతిజిల్లా ఏర్పేడులో 40.1 ప్రకాశంజిల్లా కొప్పెరపాడులో 40 గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు పేర్కొన్నారు. సాయంత్రం 5 గంటల నాటికి అల్లూరి జిల్లా గంపరైలో 21.5మిమీ, గుంటూరు జిల్లా మంగళగిరిలో 15.2మిమీ, తూర్పుగోదావరి జిల్లా కోరుమామిడిలో 13.2మిమీ, గుంటూరు పశ్చిమ నల్లపాడులో 12మిమీ వర్షపాతం రికార్డైందన్నారు. ఇక శుక్రవారం అల్లూరి, పోలవరం, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. శనివారం .. అల్లూరి, పోలవరం, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, శ్రీసత్యసాయి, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. రైతులు వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉరుములతో కూడిన వర్షం పడేటప్పుడు పొలాల్లో పని చేసే రైతులు, కూలీలు, పశు కాపరులు చెట్ల కింద నిలబడరాదని హెచ్చరించారు. మరోవైపు అల్లూరి జిల్లా జికే వీధి మండలంలో తీవ్రవడగాలులు, అలాగే అల్లూరి జిల్లా ముంచింగిపుట్టు, పెదబయలు మండలాలు, తూర్పుగోదావరి జిల్లా గోకవరం, పోలవరం జిల్లా చింతూరు, కూనవరం, వరరామచంద్రాపురం, గుర్తేడు ..మండలాల్లో వడగాలులు.. వీచే అవకాశం ఉందన్నారు. కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ ఎండ ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు.

8-5Pg3exHMNWJQEKR 3 ONG_8-5Pg3exHMNWJQEKR.qxd 07/May/26 11:06 PM Page 1



## తిరుమల సమాచారం



### స్వామివారి ఆశీస్సులతో అందరికీ మంచి జరగాలి

**తిరుమల, మే 7 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని, సంతోషంగా ఉండాలని స్వామి వారిని వేడుకున్నట్లు పలువురు ప్రముఖులు తెలిపారు. గురువారం మధ్య ప్రదేశ్ మంత్రి ప్రహ్లాద్‌సింగ్ పటేల్ కుటుంబం, అనంతపురం ఎంపి లక్ష్మీనారాయణ కుటుంబంతో కలిసి ఉదయం విఐపి బ్రేక్‌లో వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకున్నారు. నైవేద్య విరామ సమయంలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్ రెడ్డి ఉన్నారు.

### టిటిడి ట్రస్ట్‌లకు రూ.20 లక్షలు విరాళం



**తిరుమల, మే 7 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశవ్యాప్తంగా మోకీళ్ళనొప్పులు, కాళ్ళు చేతులు సరిగా లేని దివ్యాంగులు, మతి స్థిమితంలేని పేద రోగులకు ఉచితంగా వైద్యసేవలందిస్తున్న టిటిడి బర్డ్ ట్రస్ట్‌కు దాతలు తమవంతుగా విరాళాలందిస్తున్నారు. తిరుపతి టిటిడి బర్డ్ ఆస్పత్రిలో పలువురు పేదలకు ఉచితంగా కృత్రిమ పరికరాలు అందించేందుకు ఈ విరాళాలు దోహదపడుతాయి. గురువారం తెలంగాణ హైదరాబాద్‌కు చెందిన నవ్య మార్కెటింగ్ సంస్థ బర్డ్ ట్రస్టుకు రూ.10,01,116లు విరాళంగా అందించింది. గుంటూరుకు చెందిన వెంకట కృష్ణ చైతన్య వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.10,01,116లు విరాళంగా అందించారు. దాతల తరఫున టిటిడి బోర్డు సభ్యుడు నన్నపనేని సదాశివరావు ఆలయం లోపల రంగనాయకుల మండపంలో టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడుకు డిడిలను అందజేశారు.



### దివ్యక్షేత్రంలో ఉట్టిపడుతున్న పవిత్రత

● మాడవీధులు, కూడళ్ళకు కొత్తగా పుణ్యపురుషుల పేర్లు

**తిరుమల, మే 7 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగ వైకుంఠం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి కొలువైన దివ్యక్షేత్రంలో మరింత పవిత్రత ఉట్టిపడేలా ఆధ్యాత్మిక భావం కలిగించేలా టిటిడి పేర్లు సూచించింది. పవిత్రమైన ఆలయ మాఢవీధులతోబాటు తిరుమలలోని పలు కూడళ్ళకు, మార్గాలకు భక్తాగ్రేసరుల పేర్లతో నిర్ణయించారు. ఇందుకోసం ఏర్పాటైన కమిటీ తిరుమల కొండ విశిష్టతను తెలియజేసేలా శ్రీవారి సేవలో తంచిన భక్తాగ్రేసరుల పేర్లు పెట్టారు. త్వరలోనే ఈ పేర్లు అధికారికంగా కొండపై అమల్లోకి రానున్నాయి. ఆలయానికి తూర్పున ఉన్న మాడ వీధిని "రుగ్వేదమార్గం"గా, దక్షిణ మాడ వీధిని "యజుర్వేదమార్గం"గా, పశ్చిమ మాడ వీధిని "సామవేద మార్గం"గా, ఉత్తర మాడవీధి "అధర్వణవేద మార్గం"గా మార్చేశారు. టిటిడి బోర్డు చైర్మన్ బిఆర్‌నాయుడు, అదనపు ఇఒ వెంకయ్యచౌదరి చొరవ చూపారు.

**తిరుమల మొత్తం భక్తాగ్రేసరుల పేర్లే:** ఆలయ మాఢవీదులతో బాటు శ్రీవారి ఆలయానికి ఎదురుగా ఉన్న ఖాళీ వాహనసేవల్లో గ్యాలరీలుగా ఉండే ప్రాంతానికి "భగవద్రామానుజాచార్య ప్రాంగణం"గా, బేడీ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంతానికి "సాళువ నరసింహరాయల ప్రాంగణం" అని పేర్లు పెట్టారు. కొండపై ప్రధాన కూడళ్ల పేర్లలో "లేపాక్షి కూడలికి "అన్నమయ్య కూడలి", ఆలయానికి ప్రధాన ప్రవేశద్వారంకు ముందుండే రామభగీచ కూడలికి "తొండమాన్ చక్రవర్తి కూడలి", ఎస్ఎంసి సర్కిల్‌కు "పురందరదాసు కూడలి"గా నామకరణం చేశారు. కాగా ఇప్పటికే ఔటర్ రింగ్‌రోడ్డుకు "తిరువేంకటపథం" అని, ఇన్నర్ రింగ్‌రోడ్డుకు "అన్నమాచార్య మార్గం" అనే పేర్లు కొనసాగించారు. రామభగీచ విశ్రాంతి గృహాల నుండి పుష్కరిణి వరకు ఉన్న మార్గానికి "శ్రీ కృష్ణదేవరాయల మార్గం"మని సూచించేలా త్వరలోనే శాశ్వత రాయిసూచిక బోర్డులు రానున్నాయి.

### సూర్యప్రభ వాహనంపై వేదనారాయణ స్వామి



**తిరుమల, మే 7 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడికి అనుబంధంగా ఉన్న తిరుపతి జిల్లా నాగలాపురం వేదనారాయణ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో గురువారం స్వామి సూర్యప్రభ వాహనంపై భక్తులకు దివ్య దర్శనం ఇచ్చారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన వాహనసేవ ఆలయ నాలుగు మాడ వీధుల్లో అత్యంత వైభవంగా సాగింది. గోవింద నామస్మరణల మధ్య భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి స్వామి అనుగ్రహం పొందారు. సకల లోకాలకు తేజస్సును ప్రసాదించే సూర్యభగవానుని ప్రతీకగా సూర్యప్రభ వాహనంపై స్వామివారు దర్శనమివ్వడం భక్తులను ఆధ్యాత్మిక ఆనందంలో ముంచెత్తింది. సకల జీవరాశులకు ప్రాణాధారమైన సూర్యుని మహిమను ప్రతిబింబించేలా ఈ వాహనసేవ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఆ తరువాత ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత వేదనారాయణ స్వామి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్లు, పసుపు, చందనంతో అభిషేకాలు నిర్వహించారు. రాత్రి 7.30 గంటలకు చంద్రప్రభ వాహనంపై స్వామివారు భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాసులరెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసులు, చెంగల్రాయులు, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

### ఎస్వీ బాలమందిరంలో ప్రవేశాలకు దరఖాస్తులు




**తిరుమల, మే 7 ప్రభాతవార్త ప్రతినిధి:** ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నడుపబడుతున్న అనాథ పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్న శ్రీ వేంకటేశ్వర (ఎస్వీ) బాలమందిరంలో 2026-27 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు దరఖాస్తులను టిటిడి ఆహ్వానిస్తోంది. దరఖాస్తుదారులు హిందూ మతానికి చెందినవారై ఉండాలి. ఏప్రిల్ 27కి ఐదు సంవత్సరాలు నిండిన, 10 సంవత్సరాల లోపు వయస్సు ఉండాలి. ఆసక్తి గల వాళ్ళు తిరుపతిలోని ఎస్వీ బాలమందిరంలో లభించే దరఖాస్తు పత్రాలను, తెల్లకాగితంపై తమ వివరాలు రాసి సమర్పించవచ్చని టిటిడి తెలిపింది. దరఖాస్తుతో పాటు తల్లిదండ్రుల మరణ ధ్రువీకరణ పత్రాలు, సంరక్షకుల/ తల్లిదండ్రుల ఆదాయ ధ్రువీకరణ ప్రతులను, బాలబాలికలు జనన, కుల ధ్రువీకరణ పత్రం అందజేయాల్సి ఉంటుంది. దరఖాస్తులను సహాయ కార్యనిర్వహణాధికారి, శ్రీ వేంకటేశ్వర బాలమందిరం, టి.టి.డి, భవానీనగర్, తిరుపతి- 517501 చిరునామాకు దరఖాస్తులను స్వయంగా, పోస్టు ద్వారా పంపవచ్చు. మరిన్ని వివరాలకు 0877 -2264613 నంబర్‌లో సంప్రదించవచ్చు.

# భూ రికార్డుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత

● రైతుల చేతికే భూముల డిజిటల్ లాకింగ్ ● రెండేళ్లకే అసైన్డ్ ఇళ్ల పట్టాలపై సర్వ హక్కులు ● సింగపూర్ పాలనా విధానాల అనుసరణతో ఉత్తమ రాష్ట్రంగా ఏపి ● కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో మంత్రి అనగాని సత్యప్రసాద్



**విజయవాడ, మే 7 ప్రభాతవార్త ప్రతినిధి:** గత ప్రభుత్వం విధ్వంస పాలన నుంచి రెండేళ్లలోనే రాష్ట్రాన్ని గాడిలో పెట్టగలిగామని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. గురువారం సచివాలయంలో ప్రారంభమైన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై నమ్మకంతోనే రాష్ట్రానికి 11 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని చెప్పారు. సూపర్ సిక్స్‌కు మించి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. రెవెన్యూ వ్యవస్థలోని ఈ రెండేళ్లలో సమూల సంస్కరణలు తెచ్చామన్నారు. భూ రికార్డులు తారుమారు చేయడానికి ఎటువంటి ఆస్కారం లేకుండా ప్రతి దశలోనూ భూ యజమానికి ఈ కెవైసి సదుపాయం కల్పించామన్నారు. పట్టా భూముల 1బి, అడంగల్ ను ఆప్షన్లో భూ యజమానులే స్వంతంగా లాక్ చేసుకునే అవకాశం కల్పించామన్నారు. భూయజమానుల అనుమతి లేకుండా ఏ అధికారి కూడా మ్యుటేషన్లు గానీ, రిజిస్ట్రేషన్లు గానీ చేసే అవకాశం ఉండదన్నారు. కొత్త పాస్ బుక్ కూడా ఈకేవైసీ చేసి డ్రాఫ్ట్ పాస్ పుస్తకాన్ని రైతులకు చూపించి వారు సంతృప్తి చెందిన తర్వాతే ముద్రణకు పంపిస్తున్నామన్నారు. పేదలకు అసైన్ చేసిన ఇళ్ల పట్టాలకు గతంలో పదేళ్ల తర్వాత సర్వ హక్కులు కల్పిస్తే కూటమి ప్రభుత్వం రెండేళ్ల తర్వాత సర్వ హక్కులు కల్పించే చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీని వల్ల బడుగు బలహీన వర్గాలకు ఆర్థిక భరోసా దొరుకుతుందన్నారు. పట్టణ గరిష్ట భూ పరిమితి చట్టం కింద నిషేధ జాబితాలో ఉన్న స్థలాల క్రమబద్ధీకరణ గడువు తేదీని ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు పొడిగిస్తున్నామన్నారు. క్రమబద్ధీకరణ ప్రక్రియను కూడా సులభతరం చేశామని, గతంలో ప్రభుత్వం వద్దకు రావాల్సి ఉండగా ప్రస్తుతం సీసీఎల్‌ఏ స్థాయిలోనే ఆదేశాలు ఇచ్చే విధంగా సవరణ చేశామన్నారు. విలేజ్ సర్వీసు ఇనాం భూములను 22ఎ నిషేధిత జాబితా నుండి తొలగిస్తూ 1.36 లక్షల ఎకరాలకు విముక్తి కల్పించామన్నారు. రాష్ట్రంలో 33,440 ఎకరాల షరతుల గల పట్టా భూములు ఉండగా 33,012 ఎకరాల భూములపై కూడా రైతులకు పూర్తి హక్కులు కల్పించామన్నారు. తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్లు చేసిన భూములను రద్దు పరిచే అధికారాన్ని కలెక్టర్లు సక్రమంగా అమలు చేయాలన్నారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ డిపార్టమెంట్లను అనుసంధానించి బ్లాక్ చైన్ టెక్నాలజీ ద్వారా భూమి రికార్డులకు అత్యున్నత భద్రత కల్పిస్తున్నామన్నారు. కలెక్టర్లంతా ప్రభుత్వ ఆశయాలు, ఉద్దేశ్యాలను మరింత లోతుగా అర్థం చేసుకొని చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. సింగపూర్ పర్యటనలో ఎంతో నేర్చుకున్నాంవారం రోజుల పాటు సాగిన సింగపూర్ పర్యటనలో పాలనకు సంబంధించి ఎన్నో విషయాలు నేర్చుకున్నామని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. గతంలో ఎన్నోసార్లు సింగపూర్ పర్యటనకు వెళ్లినప్పటికీ ఈ పర్యటన మాత్రం చాలా ప్రత్యేకమన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు గ్రామ, వార్డు సచివాలయాల రూపంలో భారీ వ్యవస్థ ఉండగా సింగపూర్ తన పనులను చాలా ఖచ్చితంగా, సమన్వయంతో చేయడంలో మేటి అని అన్నారు. ఆంధ్రప్రదేశ్ తనకున్న విస్తృతమైన వ్యవస్థను, సింగపూర్ లాంటి ఖచ్చితత్వంతో కలిపి ముందుకు తీసుకెళ్లాలన్నారు. మనం 500 రకాల సేవలను ప్రజలకు అందిస్తున్నప్పటికీ సింగపూర్ లాగా వాటన్నింటినీ ఒకే చోట, సులభంగా అందేలా చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న బలమైన వ్యవస్థలైన ఆర్టీజీఎస్, మీ భూమి, సింగిల్ డెస్క్ వంటి ఉండగా, వాటినకి సింగపూర్ మాదిరి ఒకదానితో ఒకటి అనుసంధానించి పని చేయించాలన్నారు. ఎపి ప్రభుత్వం పరిశ్రమలకు వేగంగా అనుమతులు ఇస్తున్నప్పటికీ సింగపూర్ ప్రభుత్వం మాదిరి పరిశ్రమలు రాక ముందే భూమిని, మౌళిక వసతులను సిద్ధం చేసి ఉంచేలా చూడాలన్నారు. ఏపీలో ప్రభుత్వ శాఖలు, జిల్లా పరిపాలన పటిష్టంగా ఉన్నప్పటికీ సింగపూర్ లాగా అన్ని శాఖలు సమన్వయంతో కలిసి పని చేసేలా చూసుకోవాలన్నారు. ఇప్పటికే ఏపీ దేశంలో ఉత్తమ విధానాలను అనుసరిస్తూ ఉండగా సింగపూర్ విధానాలను కూడా మేళవింపు చేసుకుంటే ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ రాష్ట్రంగా మారుతుందని మంత్రి సత్యప్రసాద్ పేర్కొన్నారు.

## సుపరిపాలన, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ప్రభుత్వ విధానం: సిఎస్ సాయిప్రసాద్



**విజయవాడ, మే 7 ప్రభాతవార్త ప్రతినిధి:** సుపరిపాలనతో పాటు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అన్నది ప్రభుత్వ విధానం అని ఎపి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ స్పష్టం చేసారు. ఎపి సచివాలయంలో రెండు రోజుల పాటు జరిగే జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారుల సమీక్ష సమావేశాన్ని సాయిప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ నిర్దేశించుకున్న లక్ష్యాలను రీఫోకస్ చేసేందుకు కలెక్టర్ల కాన్ఫరెన్సు ఉపకరిస్తోందన్నారు. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్సు సర్వీస్ డెలివరీ అనేది అత్యంత కీలకమైన అంశంగా గుర్తించాలన్నారు. ముఖ్యమంత్రి నిర్దేశించిన 10 సూత్రాల ఆధారంగా స్వర్ణాంధ్ర 2047 విజన్ సాకారమవుతుందన్నారు. పెట్టుబడులను ఆకర్షించటం ద్వారా రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేయగలం అన్నారు. స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సృష్టిస్తేనే అభివృద్ధి, స్వయం సమృద్ధి సాధించగలమన్నారు. విద్య, వైద్యం లాంటి సంక్షేమ కార్యక్రమాలను సమర్థంగా ప్రజలకు అందించాలన్నారు. సానుకూల దృక్పథంతో ముందుకు వెళ్తూ నిర్ణయాలు తీసుకోవటంలో ఎలాంటి సంకోచం ఉండకూడదు. సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అమలు చేయడంతో పాటుగా అనేక అంశాల్లో అధికార యంత్రాంగం కీలకంగా ఉండాలన్నారు.

## ఆర్థికపరమైన సవాళ్లను అధిగమిస్తూ ఎపి ముందుకు వెళ్తోంది

● ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్



**విజయవాడ, మే 7 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆర్థికపరమైన సవాళ్లను అధిగమిస్తూ ఎపి ముందుకు వెళ్తోందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. గురువారం కలెక్టర్ల కాన్ఫరెన్సులో పయ్యావుల కేశవ్ ప్రసంగిస్తూ ప్రజలకు ఏం మేలు జరుగుతుందోననే అంశాన్ని ఆలోచించి ప్రతి పైసా ఖర్చు చేస్తున్నాం అన్నారు. ప్రజలకు మెరుగైన జీవితం కల్పించేలా ప్రాధాన్యతలను మార్చుకుంటూ వెళ్తున్నామన్నారు. వ్యవస్థలో లోపాలను సవరించుకుంటూ ఆదాయాలను పెంచుకోవాలి అన్నారు. రాష్ట్రంలోని డిజిటల్ ఇన్ ఫ్రాను సమర్థంగా వినియోగించుకోవాలని అన్నారు. వృథా ఖర్చులను తగ్గించుకుని అభివృద్ధి కోసం వ్యయాలను పెంచాల్సి ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్దేశించిన ప్రాజెక్టులపై ఎక్కువ ఖర్చు పెట్టాలన్నారు. ప్రజలకు ఫలితాలను చూపించేలా పని చేయాలి అన్నారు. బడ్జెట్టును దాటి ప్రతిపాదనలు చేయటం సరికాదన్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులకు అనుగుణంగా ఏ ప్రాజెక్టులు అవసరమో దానిపై దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్లకు మంత్రి పయ్యావుల కేశవ్ దిశానిర్దేశం చేశారు.

## పేదలకు వైద్య సేవలు మానవత్వానికి నిర్వచనాలే

● గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ ● 'మీ ఇంటికి - మీ డాక్టర్' ప్రాజెక్టుకు శ్రీకారం




**విజయవాడ, మే 7 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆపదలో ఉన్న వారికి అండగా ఉండటం, పేదలకు ఆరోగ్య అవసరాలను తీర్చడం వంటి సేవలు మానవత్వానికి నిర్వచనాలనేనని ఆంధ్రప్రదేశ్ గవర్నర్, రెడ్ క్రాస్ రాష్ట్ర శాఖ గౌరవ అధ్యక్షులు జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ అన్నారు. గురువారం లోక్‌భవన్‌లో నిర్వహించిన ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం, ప్రపంచ తలసేమియా దినోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మారుమూల చేరుకోలేని ప్రాంతాలలోని పేద కుటుంబాల ఇంటి వద్దకే ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ సేవలను అందించే లక్ష్యంతో, ఏడు జిల్లాల్లోని సుమారు 5 లక్షల పేద కుటుంబాలకు మూడేళ్ల కాలంలో సేవలు అందించే "మీ ఇంటికి - మీ డాక్టర్ ప్రాజెక్టు"ను ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ, "మీ ఇంటికి - మీ డాక్టర్ ప్రాజెక్టు" కార్యక్రమ ఉద్దేశం గర్భిణీ స్త్రీలు, 0 నుండి 6 సంవత్సరాల వయస్సు గల పిల్లలు, సమీపంలోని ఆరోగ్య సంరక్షణ కేంద్రాలకు చేరుకోలేని మంచాన పడిన వృద్ధులకు వృద్ధాప్య సంరక్షణ అందించడం అన్నారు. మన చుట్టూ జన సముహం, అభ్యున్నతి అనే సామాజిక బాధ్యత కింద రూ.8.40 కోట్ల వ్యయంతో, ఒక డాక్టర్, నర్సు, ఫార్మసిస్ట్ డ్రైవర్‌తో కూడిన మొబైల్ మెడికల్ యూనిట్లను అందిస్తారు. ఇంటింటికీ వెళ్లి ఉచిత ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు సమకూరుస్తారు. ఉచిత మందుల పంపిణీని చేపట్టేందుకు సహకరించిన రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ కృషిని ఆయన ప్రశంసించారు. తరచుగా నిర్లక్ష్యానికి గురయ్యే తలసేమియా వ్యాధిపై అవగాహన పెంచడం, ముందస్తు పరీక్షలను ప్రోత్సహించడం జరిగిందన్నారు. ఈ వ్యాధితో బాధపడుతున్న వారికి సహాయం చేయడంపై దృష్టి సారించించారన్నారు. ఈ రోజు ప్రపంచ తలసేమియా దినోత్సవాన్ని కూడా పాటిస్తున్నట్లు గవర్నర్ తెలిపారు. గత రెండేళ్లుగా రాష్ట్రంలో రెడ్ క్రాస్ ఉద్యమం అనే మహత్తర ఆశయానికి చేసిన విశేష సేవలకు గుర్తింపుగా, రెడ్ క్రాస్ అవార్డులు అందుకున్న నెల్లూరు, పశ్చిమ గోదావరి, బాపట్ల, కృష్ణా, కాకినాడ జిల్లాల కలెక్టర్లు, రెడ్ క్రాస్ జిల్లా శాఖల అధ్యక్షులు. ఇతర ప్రముఖులను ఆయన అభినందించారు. మానవ సేవ అనే ఆశయానికి పునరంకితం కావాలని, రెడ్ క్రాస్ ఎపి రాష్ట్ర శాఖను దేశంలోనే అత్యుత్తమ యూనిట్‌గా తీర్చిదిద్దాలని గవర్నర్ రెడ్ క్రాస్ సభ్యులకు విజ్ఞప్తి చేశారు. రెడ్ క్రాస్ ఆంధ్రప్రదేశ్ శాఖ చైర్మన్ వై.డి. రామారావు, జనరల్ సెక్రటరీ సిఇఒ అశ్విని కుమార్ పరిడ, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.అనంత రాము, పలువురు జిల్లా శాఖల చైర్మన్లు, రాష్ట్ర శాఖ నిర్వాహక కమిటీ సభ్యులు హాజరయ్యారు.

## మరో 7 పోర్టుల అభివృద్ధి

● ఐఅండ్ఐ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి యం.టి కృష్ణబాబు

**విజయవాడ, మే 7 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న పోర్టులకు అదనంగా మరో 7 పోర్టులను అభివృద్ది చేయడం జరుగుతోందని ఐఅండ్ఐ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి యం.టి కృష్ణబాబు తెలిపారు.వాటికి అవసరమైన భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను కోరారు. జిల్లా కలెక్టర్ల సమావేశంలో గ్లోబల్ బెస్టు లాజిస్టిక్స్ అంశంపై ప్రజెంటేషన్ ఇస్తూ రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న పోర్టులకు అదనంగా మరో 7 పోర్టులను అభివృద్ది చేయడం జరుగుతోందని తెలిపారు. అవసరమైన భూసేకరణను బాధ్యతన జిల్లా కలెక్టర్లదే అన్నారు జాతీయ రహదారులకు సంబంధించి మాట్లాడుతూ 2025-26 లో రాష్ట్రంలో 24 వేల 117 కోట్ల రూ.ల విలువైన 969 కి.మీ.ల పొడవైన 39 పనులు పూర్తయినట్టు వివరించారు. 2026-27లో 30వేల 781 కోట్ల రూపాయల విలువైన 1467 కి.మీల పొడవైన 79 పనులు చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. అదే విధంగా 2027-28 లో 8 వేల19 కోట్ల రూ.ల విలువైన 425 కి.మీ.ల పొడవున 11 జాతీయ రహదారుల అభివృద్ధికి లక్ష్యంగా నిర్ణయించామని పేర్కొన్నారు. 2025 నుండి 2028 వరకు మొత్తం 62వేల 967 కోట్ల రూపాయల విలువైన 2861 కి.మీల పొడవున 129 పనులు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. కాగా లక్షా3వేల 667 కోట్ల రూపాయలు విలువైన 2543 కి.మీ.ల పొడవైన 64 ప్రాజెక్టులు పైపులైనులో ఉన్నాయని కృష్ణబాబు వివరించారు రైల్వే ప్రాజెక్టులు గురించి వివరిస్తూ 43 వేల 101 కోట్ల రూపాయల విలువైన 2517 కి.మీల పొడవున 40 ప్రాజెక్టులు మంజూరై ప్రగతిలో ఉన్నట్లు వివరించారు. అంతేగాక 13 వేల 305 కోట్ల విలువైన 343 రైల్లే ఓవర్ బ్రిడ్జిటలు, రైల్వే అండర్ బ్రిడ్జిలు నిర్మాణంలో ఉన్నట్టు తెలిపారు. అలాగే 3 వేల 651 కోట్లతో 167 ట్రాఫిక్ సంబంధిత సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. అమృత్ భారత్ స్టేషన్ల కింద 3వేల 81 కోట్లతో 74 రైల్వే స్టేషన్లు అభివృద్ది చేస్తున్నారన్నారు. అదే విధంగా 64 వేల 417 కోట్ల రూపాయల విలువైన 624 ఆన్ గోయింగ్ ప్రాజెక్టులు ప్రగతిలో ఉన్నాయని తెలిపారు. లాజిస్టిక్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ మల్టీ మోడల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్లాన్ గురించి వివరిస్తూ అమరావతి విశాఖపట్నం, తిరుపతి ఎకనామిక్ రీజియన్స్‌లో మలీమోడల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులు ఏర్పాటుకు ప్రతిపాదించినట్టు చెప్పారు.

## రాయల్ ఎన్‌ఫీల్డ్... బ్రాండ్ కాదు, అది వారసత్వం

● ఎపికి ఎవరు వస్తున్నారో తెలుసా? అంటూ మంత్రి లోకేష్ "ఎక్స్"లో పోస్టు



రాయల్ ఎన్‌ఫీల్డ్‌పై మంత్రి లోకేశ్

**విజయవాడ, మే 7 ప్రభాతవార్త ప్రతినిధి:** రాయల్ ఎన్‌ఫీల్డ్ కేవలం ఒక మోటార్ సైకిల్ బ్రాండ్ కాదు, అది వారసత్వం, నాణ్యతకు ఒక ప్రతీక. ఇంతటి ఐకానిక్ కంపెనీని ఎపికి స్వాగతిస్తున్నందుకు గర్వంగా ఉందంటూ రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారు. "ఎక్స్" వేదిక చేసిన పోస్టులో వ్యాపార నిర్వహణలో ఎపి వేగం, ఇక్కడి మౌలిక సదుపాయాలకు ఈ పెట్టుబడి నిదర్శనమని లోకేష్ అన్నారు. "ఈ ప్లాంట్‌తో పాటుగా వచ్చే అనుబంధ పరిశ్రమలతో రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి ఆటోమొబైల్, అడ్వాన్స్‌డ్ మానుఫ్యాక్చరింగ్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న మా లక్ష్యం మరింత బలపడుతుంది" అని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుతో ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంతంలో పారిశ్రామికాభివృద్ధి మరింత వేగవంతం కానుంది. ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజం, ఐకానిక్ మోటార్‌సైకిల్ బ్రాండ్ రాయల్ ఎన్‌ఫీల్డ్ తన నూతన తయారీ యూనిట్‌ను ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయనుంది. 1901లో సంస్థ ప్రారంభమైన నాటి నుంచి తమిళనాడు వెలుపల ఇంత భారీ స్థాయిలో విస్తరించడం ఇదే తొలిసారి. తిరుపతి జిల్లా సత్యవేడులో ఈ అత్యాధునిక తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం కంపెనీ రెండు దశల్లో సుమారు రూ.2,200 కోట్లు పెట్టుబడిగా పెట్టనుంది.

ఈ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సమావేశమైన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి ఆమోదం తెలిపింది. ఈ ప్లాంట్ ద్వారా రాయల్ ఎన్‌ఫీల్డ్ తయారీ సామర్థం దాదాపు 9 లక్షల యూనిట్లు పెరగనుంది. ఈ తాజా పరిణామాలపై తన సామాజిక మాధ్యమం ఖాతాలో లోకేష్ వ్యాఖ్యానించారు. ఇక మంత్రి నారా లోకేశ్ తన ఎక్స్ ఖాతాలో ఆసక్తికర వీడియోను పోస్టు చేశారు. ఎపికి ఎవరు వస్తున్నారో తెలుసా? అంటూ ప్రశ్నించారు. లోకేశ్ పోస్టు చేసిన వీడియోలో నీట్‌గా టక్ వేసుకొని, ట్రెండీ కళ్లజోడు పెట్టుకుని న్యూ లుక్‌లో రాయల్ ఎన్‌ఫిల్డ్ (బుల్లెట్) నడుపుతూ లోకేశ్ కనిపించారు. ఈ వీడియో ఏఐ సహాయంతో రూపొందించింది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

## ఆదిత్య ఎడ్యుకేషనల్ సొసైటీతో సిఆర్‌డిఏ ఒప్పందం

**విజయవాడ, మే 7 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని విద్యా రంగంలో నెంబర్ వన్‌గా తీర్చిదిద్దే లక్ష్యంలో భాగంగా ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. రాజధాని ప్రాంతంలో అంతర్జాతీయ స్థాయి వైద్య విద్య, నైపుణ్యాధారిత శిక్షణను అందుబాటులోకి తీసుకురావడానికి ఆదిత్య ఎడ్యుకేషనల్ సొసైటీతో ఎపి సిఆర్‌డిఏ కీలక ఒప్పందం కుదుర్చుకుంది. రాజధానిలో మెడికల్ కాలేజీ, స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు అంశంపై గురువారం లీజ్ ఒప్పంద ప్రక్రియ అధికారికంగా పూర్తయింది. ఈ ప్రాజెక్టు కోసం మంగళగిరి మండలం నిడమర్రు గ్రామ పరిధిలో సుమారు 23 ఎకరాల భూమిని లీజు ప్రాతిపదికన సిఆర్‌డిఏ కేటాయించింది. ఈ ఒప్పంద కార్యక్రమం సిఆర్‌డిఏ కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సిఆర్‌డిఏ డైరెక్టర్ చిరాగ్ రాయ్, ఆదిత్య ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి ఆద్విక్ బొల్లినేని ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి, పత్రాలను పరస్పరం మార్చుకున్నారు. అనంతరం ఆదిత్య ఎడ్యుకేషన్ ప్రతినిధులు తమ భవిష్యత్ కార్యాచరణను వెల్లడించారు. కేవలం డిగ్రీలకే పరిమితం కాకుండా మారుతున్న కాలానికి అనుగుణంగా నైపుణ్యాధారిత ఉన్నత విద్యను అందించడమే తమ ప్రధాన ఉద్దేశమని వారు స్పష్టం చేశారు. విద్యార్థులకు విస్తృతమైన పరిశోధనలకు అవకాశం కల్పిస్తూ ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఈ సంస్థలను తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు.

## అల్లూరి సీతారామరాజు చిరస్మరణీయుడు: సిఎం చంద్రబాబు



**విజయవాడ, మే 7 ప్రభాతవార్త ప్రతినిధి:** స్వాతంత్ర్య సమర యోధుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాళి అర్పించారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. గిరిజన హక్కుల పరిరక్షణ కోసం మన్యం ప్రజల గుండెల్లో పౌరుషాగ్ని రగిలించిన విప్లవ యోధుడు అల్లూరి అని అన్నారు. తెల్లవారిని గడగడలాడించిన తెలుగువీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా ఆ దేశభక్తుని చరిత్రను స్మరించుకుంటూ నివాళి అర్పిద్దాం అంటూ ఎక్స్‌లో సిఎం చంద్రబాబు పోస్ట్ చేశారు. ఆయన ఆత్మగౌరవ ప్రతీక అన్నారు. తెలుగువారి తెగువను పరాయి పాలకులు చూపిన మహనీయుడన్నారు.

### మహనీయుని స్మృతికి నా ప్రగాఢ నివాళి: లోకేశ్

అల్లూరి వర్ధంతి సందర్భంగా మంత్రి లోకేశ్ నివాళి అర్పించారు. "భారత స్వాతంత్ర్య ఉద్యమాన్ని విప్లవ మార్గంలో నడిపించిన యోధుడు అల్లూరి సీతారామరాజు. ఆయన జీవితం, త్యాగాలు, స్వాతంత్రం కోసం ఆయన చేసిన పోరాటం దేశ చరిత్ర పుటల్లో శాశ్వతంగా లిఖించబడ్డాయి. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని స్మృతికి నా ప్రగాఢ నివాళులు అర్పిస్తున్నా" అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

వార్త

అదును చూసి వ్యవహరించడమంటే ఎంతో శ్రమను, సమయాన్ని, వ్యయాన్ని ఆదా చేయటమే.

న-ఆస్కార్‌వైల్డ్

# 'మత్తు' వదిలించలేమా?

మాదకద్రవ్యాల వ్యసనం జాతి వినాశనానికి దారితీస్తున్నదని, దాన్ని సమష్టిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని ఎంతోకాలంగా ప్రపంచవ్యాప్తంగా దేశాధినేతలు పదేపదే చెబుతూనే ఉన్నారు. కానీ అంతకు రెట్టింపు స్థాయిలో ఈ మహమ్మారి యేడాదియేడాదికి విస్తరిస్తున్నది. ముఖ్యంగా ఈ వ్యసనం పద్దెనిమిదేళ్ల లోపు పిల్లలపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. మరోవైపు నేరాల సంఖ్య అదుపులేకుండా పెరిగిపోతున్నది. మాదక ద్రవ్యాల మత్తులో వారు ఏంచేస్తున్నారు వారికే తెలియని పరిస్థితుల్లో చేయరాని, చేయకూడని పనులకు పాల్పడుతూ అవి కప్పిపుచ్చుకునేందుకు ఆత్మహత్యలు చేయడానికి కూడా వెనుకాడడం లేదు. ప్రపంచవ్యాప్తంగా డార్క్‌నెట్ ద్వారా జరిగిన మత్తుమందుల కొనుగోళ్లలో ఆసియా ఖండం వాటా దాదాపు పద్దెనిమిదిశాతానికిపైగా పెరిగిపోయిందని చెప్తున్నారు. అందులో చైనా తర్వాత భారత్‌దే అగ్రస్థానం ఉంది. రెండు దశాబ్దాల క్రితం భారత్‌లో కోటిడెబ్బైలక్షల మందికిపైగా వాడకందార్లు ఉండేవారు. ఇప్పుడది పదికోట్లకు పైగా చేరుకున్నట్లు అనధికార అంచనా. మత్తుమందుల వాడకంలో పంజాబ్ అగ్రస్థానంలో ఉన్నట్లు అనేక సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఆ రాష్ట్రంలో యేటా దాదాపు పదిహేనువేల కోట్ల రూపాయలకుపైగా మత్తుమందులపై ఖర్చుపెడుతున్నట్లు అంచనా. తెలుగు రాష్ట్రాల్లో కూడా పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. నిత్యం ఎక్కడో ఒక చోట పట్టుబడుతూనే ఉన్నాయి. దీనికితోడు గంజాయి సాగు ఊహించని రీతిలో పెరిగిపోయింది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖఏజెన్సీలోను, ఇటు తెలంగాణలోని ఖమ్మం, వరంగల్ తదితర జిల్లాల్లో అటవీ ప్రాంతాల్లో గంజాయి సాగు బాగా విస్తరించినట్లు వార్తలు అందుతున్నాయి. నాలుగేళ్ల క్రితం ఆంధ్ర, ఒడిశా సరిహద్దుల్లో నల్గొండ పోలీసులు చేపట్టిన 'ఆపరేషన్ గంజా' తనిఖీల్లో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అధికార ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కూడా జరిగింది. ఈ అక్రమాలను ప్రోత్సహిస్తున్నది మీరంటే మీరు అని పరస్పర ఆరోపణలు చేసుకున్నారు. ఇక విదేశాల నుండి భారీ ఎత్తున డ్రగ్స్ అటు ఆంధ్రప్రదేశ్‌కు, ఇటు తెలంగాణకు చేరుకుంటున్నట్లు పట్టుబడుతున్న సంఘటనలు రుజువు చేస్తున్నాయి. గతంలో గుజరాత్‌లోని ముంద్రా పోర్టులో ఇరవై ఒక్కవేల కోట్ల రూపాయల విలువైన హెరాయిన్ పట్టుబడినప్పుడు విజయవాడ లింకులు వెలుగులోకి వచ్చాయి. కొంతవరకు దర్యాప్తు జరిగినా ఆ తర్వాత ఏమైందో తెలియకుండాపోయింది. ఇక మత్తుమందు సరఫరా కోట్ల డాలర్ల వ్యవహారంలో ఎక్కువ భాగం ఉగ్రవాద సంస్థలకు చేరుతుందని దర్యాప్తు సంస్థలు చెబుతున్నాయి. పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్, ఉజ్బికిస్థాన్‌తో పాటు మరికొన్ని ఆఫ్రికా దేశాలు ఇందులో విరివిగా పాల్గొంటున్నాయి. కశ్మీర్ ఉగ్రవాదులకు పంజాబ్‌లోని మత్తుమందుల సరఫరాదారులకు గట్టి సంబంధం ఉన్నట్లు బయటపడింది. అయితే పట్టుబడుతున్నది పదోవంతు కూడా లేదని చెప్పొచ్చు. అన్నిటికన్నా ప్రధానంగా అత్యంత లాభదాయకం కావడం వల్ల ప్రపంచవ్యాప్తంగా పెద్దపెద్ద నేర ముఠాలు, మాదకద్రవ్యాల ఉత్పత్తి, రవాణాను వ్యాపారంగా మార్చుకుంటున్నాయి. ఈ ముఠాలు కొని సొంతంగా నెట్ వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నాయి. లాటిన్ అమెరికాలో తయారవుతున్న మత్తుమందులు ప్రపంచం నలుమూలలకు విస్తరించడంతోపాటు రసాయనికాలు తయారు చేసే యాంఫెటామైన్ థైపిస్ట్‌మెలెన్స్ ఎక్కడి కక్కడ తయారవుతున్నాయి. భారతదేశంలో ఈతరహా మత్తుమందులు పెద్దఎత్తునఉత్పత్తి చేస్తున్నారు. గతంలో మత్తుమందులు కొనేవారు తెలిసిన వాడకందార్లు నమ్మకం ఉన్నవ్యాపారినే సంప్రదించేవారు. మత్తుమందులు తీసుకొని డబ్బులు చేతిలోపెట్టేవారు. ఆవ్యాపారంకూడా అత్యంత రహస్యంగా మూడోకంటికి తెలియకుండా మత్తు మందు తెప్పిచ్చి అప్పగించేవాడు. అయితే అత్యంత పగడ్బందీగా జరుగుతున్నా నిఘా విభాగం అధికారులు కన్ను వేయడంతో ఎక్కడో అక్కడ దొరికిపోయేది. ఇప్పుడు ఆ పరిస్థితులులేవు. మత్తుమందు, రవాణా, చెల్లింపులు సులభం కావడంతో విక్రయాలు విపరీతంగా పెరిగిపోయాయి. మెక్సికో కేంద్రంగా రకరకాల మార్గాల్లో అన్ని దేశాల్లోకి ప్రవేశిస్తున్నది. యేటా కొకైన్, బ్రౌన్‌షుగర్ లాంటి మాదక ద్రవ్యాలు రెండువేల టన్నుల వరకు ప్రపంచవ్యాప్తంగా సరఫరా అవుతున్నట్లు అంచనా. లక్షలాది కోట్ల వ్యాపారం జరుగుతున్నది. తెలంగాణ, అటు ఆంధ్రప్రదేశ్‌లోనూ పరిస్థితి ఆందోళనకరంగా తయారవుతున్నది. ముఖ్యంగా పట్టుబడిన కేసుల్లోకూడా పటిష్టంగా వ్యవహరించకపోవడం వల్లనో, లేక చట్టంలో ఉన్న లొసుగులేమోకానీ జైళ్ల నుంచి బయటకు వచ్చి తిరిగి అదే వ్యాపారంలో కొనసాగుతున్నారు. అసలు పట్టుబడుతున్న కేసుల్లో సమర్థవంతంగా దర్యాప్తు జరిపి రుజువు చేయడంలో సంబంధిత అధికారులు విఫలం కావడం వల్ల అధికశాతం కేసులు న్యాయస్థానంలో వీగిపోతున్నాయి. ఈమహమ్మారిని పారద్రోలేందుకు ప్రత్యేక విభాగాలను ఎన్ని ఏర్పాటుచేసినా స్థానిక పోలీసుల సహకారం, తోడ్పాటు లేకుండా లక్ష్యాన్ని సాధించలేరు. స్థానిక పోలీసులను కూడా ఇందులో భాగస్వాములను చేయాలి. వారిపరిధిలో మాదకద్రవ్యాలు పెద్ద ఎత్తున పట్టుబడితే వారిని కూడా బాధ్యులను చేసే విధంగా చర్యలు ఉండాలి. ఏదిఏమైనా మానవజీవనంతో ఆటలాడుకుంటున్న ఈ మాదకద్రవ్యాలను నిరోధించే విషయంలో మాటలకే పరిమితం కాకుండా ఆచరణలో చూపాల్సిన తరుణమిది.

గతాన్ని గుర్తుపెట్టుకోనివారు, తిరిగి గతాన్ని అనుభవించవలసి వస్తుంది.



గౌతమబుద్ధ

ఆత్మ విశ్వాసం కలిగిన కొందరి చరిత్రే ప్రపంచ చరిత్ర.



స్వామి వివేకానంద

# దేశ రాజకీయాల్ని షేక్ చేసిన విజయ్

**తమిళనాడులో అక్షరాస్యత శాతం ఎక్కువగా ఉండటం వల్ల నేటి జంజి జనరేషన్‌కి చెందిన యువత కుల మత పార్టీలక తీతంగా టీవీకె పార్టీ విజయ్ నాయకత్వ గుణగణాలుచూసి అతి స్వల్ప కాలంలోనే విజయ్ ద్వారా తమిళనాడులోగొప్ప సామాజిక రాజకీయ పరివర్తన జరగాలని భావించినట్లుగా తాజా రాజకీయ ఫలితాలు నిరూపణ చేస్తున్నాయి. తమిళనాడుకు చెందిన హీరో స్థాయి నుండి ముఖ్యమంత్రి కాబోతున్న దళపతి విజయ్ ఆదర్శంగా తీసుకొని నిబద్ధత కలిగిన రాజీపడని రాజకీయాలని తెలుగు రాష్ట్రాల్లోని దళిత బహుజన నాయకులు చేసినట్లయితే అతి కొద్ది కాలంలోనే తెలుగు రాష్ట్రాల్లో కూడా జనాభా దామాషా ప్రకారం మెజార్టీగా 90శాతంఉన్న బీసీ ఎస్సీ,ఎస్టీలైన రాజ్యాధికారం స్థాపించడం కష్టతరమైన పని ఏమీ కాదు.**

రెండువేల ఇరవై ఆరు తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు భారత రాజకీయ చరిత్రలో ఒక నూతన అధ్యాయాన్ని లిఖించాయి. సుదీర్ఘ కాలంగా డీఎంకే , ఏఐఏడీఎంకే మధ్య సాగుతున్న ద్విధ్రువ రాజకీయాలకు తెరదించుతూ, తన తొలి ప్రయత్నంలోనే తమిళగ వెట్రి కళగం అధినేత సి. జోసెఫ్ విజయ్ సంచలన విజయాన్ని నమోదు చేశారు. తమిళనాడులో విజయ్ ప్రస్థానం 2026 ఎన్నికల విశ్లేషణ తమిళనాడు రాజకీయాల్లో సినిమా తారల ప్రభావం కొత్తేమీ కాకపోయినా, ఎంజీఆర్ తర్వాత ఆ స్థాయిలో ప్రజల ఆదరణ పొంది, నేరుగా ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించబోతున్న ఘనత విజయ్‌కే దక్కింది. అధికార డీఎంకే కోటను బద్దలు కొట్టి, టీవీకే పార్టీ ఘన విజయం సాధించడం వెనుక బలమైన కారణాలు ఉన్నాయి. విజయ్ తన మేనిఫెస్టోలో కేవలం హామీలు మాత్రమే కాకుండా, క్షేత్రస్థాయి సమస్యలపై దృష్టి సారించారు. అవే ఆయనను యువతకు, మహిళలకు చేరువ చేశాయి. మహిళా సంక్షేమం కోసం ప్రతి నెలా మహిళలకు 2,500 రూపాయల ఆర్థిక సాయం, పెళ్లి కానుకగా 8 గ్రాముల బంగారం పట్టుచీర హామీ మహిళా ఓటర్లను విశేషంగా ఆకర్షించింది. గ్యాస్ సబ్సిడీ భాగంగా ఏడాదికి 6 గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందజేస్తామని ప్రకటించడం పేద, మధ్యతరగతి కుటుంబాలలో భరోసా నింపింది. యువతకు ఉపాధిని కల్పించడానికి తమిళనాడును ఇండస్ట్రియల్ హబ్‌గా మార్చి లక్షలాది ఉద్యోగాల కల్పన చేస్తామన్న హామీ యువతలో ఉత్సాహం నింపింది. నీట్ రద్దు పోరాటం భాగంగా విద్యార్థుల భవిష్యత్తు కోసం నీట్ పరీక్ష రద్దుకు గట్టిగా నిలబడతామని మాటివ్వడం గ్రామీణ విద్యార్థుల మనసు గెలుచుకుంది. పాత రాజకీయ వ్యవస్థలోని అవినీతిని అంతం చేస్తానని, పారదర్శకమైన 'న్యూ ఏజ్ పాలిటిక్స్' తీసుకొస్తానని విజయ్ ఇచ్చిన పిలుపు సామాన్యులను కదిలించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం తలపతి విజయ్ జన నాయగన్ సినిమాని అనేక కారణాలతో విడుదల కాకుండా అడ్డుపడిన, కేంద్ర సంస్థలైన ఈడీతో విజయ్‌ని ముప్పు తిప్పలు పెట్టిన విజయ్ ఎక్కడ కూడా ఆత్మస్థైర్యం పోగొట్టుకోకుండా, తన అభిమానులు నిరుత్సాహ పడకుండా ఎన్నికల ప్రచారంలో భాగంగా కొండంత ధైర్యాన్ని నూరిపోశాడు. అందుచేత సినిమా ప్రపంచంలో జన నాయగన్ సినిమాని కేంద్ర ప్రభుత్వం అడ్డుకున్నా తమిళ ప్రజల గుండెల్లో కొలువై ఉన్న జోసెఫ్ విజయ్ రాజకీయ పెను భూకంపాన్ని కేంద్ర ప్రభుత్వం ఎదురుకోలేకపోయింది. విజయ్ తన రాజకీయ ప్రస్థానంలో కులం గురించి ప్రస్తావన లేకుండా మానవత్వమే తన కులంగా చెప్పుకొని కుల మతాలకి అతీతంగా ప్రజాస్వామ్య రాజ్యాంగ మానవతా నైతిక విలువలకి కట్టుబడి తన నాయకత్వాన్ని నిర్మించుకున్నాడు. అందుకే అన్ని వర్గాల ప్రజలు విజయ్ నాయకత్వాన్ని బలపరిచారు. 75 ఏళ్ల క్రితం డీఎంకే పార్టీ సాంస్కృతిక పునాదులకి అభిముఖంగా రెండు సంవత్సరాల క్రితం పార్టీ ఏర్పాటు చేసిన దళపతి విజయ్ తమిళ వేట్రీ కజగం పార్టీ కూడా మహనీయుల సిద్ధాంత మార్గంలోని తన సాంస్కృతిక రాజకీయ ప్రయాణం ఉంటుందని తమిళ ప్రజలనే కాదు యావత్ భారతీయుని నమ్మించగలిగాడు. ఇది విజయ్‌లోని గుణగణాలకి నీతినిబద్ధతకి నిజాయితీగల నాయకత్వానికి నిదర్శనంగా చూడాలి. అధికారంలో ఉన్న డీఎంకే పార్టీ ఈ ఎన్నికల్లో వెనుకబడటానికి అనేక కారణాలు విశ్లేషకులు

పుల్లెంల గణేష్



చెబుతున్నారు. ప్రభుత్వ వ్యతిరేకత ఐదేళ్ల పాలనలో కొన్ని హామీలు నెరవేర్చకపోవడం, నిత్యావసర ధరల పెరుగుదల ప్రజల్లో అసంతృప్తిని పెంచింది. వారసత్వ రాజకీయాలపై విరక్తి పెరిగి, ఉదయనిధి స్టాలిన్ ఎదుగుదల,కుటుంబ పెత్తనంపై కొంతమంది ఓటర్లు అసహనం వ్యక్తం చేశారు. ఇది విజయ్ వంటి కొత్త నాయకుడికి కలిసొచ్చింది. విజయ్ 'మాస్' అప్పీల్ ఏంటి అంటే విజయ్‌కి ఉన్న భారీ ఫ్యాన్ బేస్ కేవలం సినిమాకే పరిమితం కాకుండా, ఒక సైన్యంలా పనిచేసింది. డీఎంకే కేడర్ కంటే టీవీకే కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చురుగ్గా వ్యవహరించారు. ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ స్వయంగా తన సొంత నియోజకవర్గం కొల్తూర్‌లో టీవీకే అభ్యర్థి చేతిలో ఓడిపోవడం డీఎంకే పతనానికి పరాకాష్టగా నిలిచింది. ఇది మాత్రమే కాకుండా కీలకమైన అంశాలు ఏంటంటే 75 ఏళ్ల డీఎంకే పార్టీ చరిత్రలో కరుణానిధి మరణ అనంతరం పెరియార్, అన్నదొరై పేర్లకు మాత్రమే ప్రాముఖ్యత ఇచ్చి అంబేద్కర్‌కి గౌరవ సామాజిక విలువని ఇవ్వకపోవడం, ఎన్నికల సందర్భంగా ఓట్ల కోసం మాత్రమే అంబేద్కర్ నామస్మరణ చేయడంతో దళితుల ఓట్లు చీలి, దళిత హీరో ఐన తలపతి విజయ్ వైపు మొగ్గు చూపారు, నిరుద్యోగ యువతలో ఉన్న ప్రభుత్వ వ్యతిరేకత విజయ్ గుణగణాలకి, నీతి నిబద్ధతకి ఆకర్షితులను చేసి డీఎంకేపార్టీ ఘోర ఓటమికి ముఖ్యమైన కారణంగా సామాజిక రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. విజయ్ విజయం తమిళనాడు రాజకీయాల్లో ఒక సరికొత్త మార్పుకు సంకేతం. కుల, మత రాజకీయాలకు అతీతంగా 'తమిళులే మన బలం' అనే నినాదంతో ఆయన ముందుకు సాగారు. సంప్రదాయ రాజకీయ పార్టీల వ్యూహాలను తిప్పికొట్టి, సామాన్యుడి గొంతుకగా మారడం వల్లే ఈ అద్భుత విజయం సాధ్యమైంది. అంతిమంగా తమిళనాడు ప్రజలు మార్పును కోరుకున్నారని ఈ తీర్పు స్పష్టం చేస్తోంది. డీఎంకే, ఏఐఏడీఎంకే వంటి దిగ్గజ పార్టీలను కాదని ఒక సినీ నటుడికి పట్టం కట్టడం అనేది సామాన్య విషయం కాదు. ఇప్పుడు అందరి దృష్టి విజయ్ పైన, ఆయన అందించబోయే 'వెట్రి' (విజయం) పాలన పైన ఉంది. అయితే తమిళనాడులో ఎక్కువ సీట్లు సాధించిన లార్జెస్ట్ పార్టీగా టీవీకే అవతరించగా, డిఎంకె 60 సీట్లతో రెండవ స్థానాన్ని, ఎఐఎడిఎంకె 47సీట్లతో మూడవ స్థానంలో ఉండగా, కాంగ్రెస్ ఐదు సీట్లు గెలుచుకుంది. లోకల్ పార్టీలు సింగిల్ డిజిట్స్ గెలుచుకున్నాయి. అయితే కాంగ్రెస్ లేదా లోకల్ పార్టీలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం దలపతి విజయ్‌కి కష్టతరం కాదు అనే విధంగా రాజకీయ ఫలితాలున్నాయి. తమిళనాడులో దళపతి విజయ్ అతి తక్కువ కాలం నుండి ప్రభుత్వాన్ని సింగిల్ గా ఏర్పాటు చేసేలా ప్రభావం చూపిస్తాడని రాజకీయ విశ్లేషకులు మేధావులు కూడా ఊహించలేదు. కానీ తమిళనాడులో ఇలాంటి ఆశ్చర్యకరమైన రాజకీయ ప్రక్షాళన జరగడం తమిళనాడులో కొత్తేమీ కాదు. 75 ఏళ్ల స్వాతంత్ర భారతంలో ప్రాంతీయ పార్టీలైన డీఎంకే, అన్న డీఎంకే పాలన చూసి తమిళ ప్రజలు విసుగెత్తిపోయారు. అంతేకాకుండా తమిళనాడులో అక్షరాస్యత శాతం ఎక్కువగా ఉండటం వల్ల నేటి జంజి జనరేషన్‌కి చెందిన యువత కుల మత పార్టీలకతీతంగా టీవీకె పార్టీ విజయ్ నాయకత్వ గుణగణాలుచూసి అతి స్వల్ప కాలంలోనే విజయ్ ద్వారా తమిళనాడులోగొప్ప సామాజిక రాజకీయ పరివర్తన జరగాలని భావించినట్లుగా తాజా రాజకీయ ఫలితాలు నిరూపణ చేస్తున్నాయి. తమిళనాడుకు చెందిన హీరో స్థాయి నుండి ముఖ్యమంత్రి కాబోతున్న దళపతి విజయ్ ఆదర్శంగా తీసుకొని నిబద్ధత కలిగిన రాజీపడని రాజకీయాలని తెలుగు రాష్ట్రాల్లోని దళిత బహుజన నాయకులు చేసినట్లయితే అతి కొద్ది కాలంలోనే తెలుగు రాష్ట్రాల్లో కూడా జనాభా దామాషా ప్రకారం మెజార్టీగా 90శాతంఉన్న బీసీ ఎస్సీ ఎస్టీలైన రాజ్యాధికారం స్థాపించడం కష్టతరమైన పని ఏమీ కాదు. అంతిమంగా టివికే అధినేత దళపతి విజయ్ ఎన్నికల సమయంలో తాను ఇచ్చిన హామీలను ఎంత వరకు అమలు చేసి భవిష్యత్తులో తమిళనాడు రాజకీయాలనే కాదు, దేశ రాజకీయాలని ఎంతగా ప్రభావితం చేయగలడో భవిష్యత్ కాలమే సమాధానం చెప్పే వరకు వేచి చూడక తప్పదు. ●

# గల్ఫ్ యుద్ధం సాకుతో పెరుగుతున్న ధరలు

ఎల్లబోయిన వెంకటేశ్వర్లు

ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న యుద్ధ ఉద్రిక్తతలు, ఆర్థిక అస్థిరతలకు దారితీస్తున్నాయి. కానీ ఆ ప్రభావం ఎంతవరకు సహజమో, ఎంతవరకు కృత్రిమమో అన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ముఖ్యంగా వంటనూనెల ధరల పెరుగుదల నేపథ్యంలో, యుద్ధాన్నిసాకుగా చూపిస్తూ కొందరు వ్యాపారులు కృత్రిమ కొరతలు సృష్టిస్తున్నారనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ఫలితంగా, పేద,మధ్యతరగతి ప్రజలు ధరల దోపిడీకి బలవుతున్నారు. నెల రోజుల్లోనే వంటనూనెల ధరలు దాదాపు 20-22 శాతం పెరగడం సాధారణ మార్కెట్ పరిణామం కాదు. సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.200కు చేరడం, పామాయిల్, సోయాబీన్, రైస్‌బ్రాన్ నూనెల ధరలు వరుసగా పెరగడం ఇవి అన్నీ వినియోగదారులపై అదనపు భారాన్ని మోపుతున్నాయి. ఒకవైపు అంతర్జాతీయ మార్కెట్‌లో యుద్ధ ప్రభావం, రవాణా ఖర్చుల పెరుగుదల, ఇంధన ధరలు ఎగిసిపడటం వంటి అంశాలు ఉన్నప్పటికీ, మరోవైపు దేశీయంగా కొందరు వ్యాపారులు నిల్వలను దాచిపెట్టి సరఫరాను తగ్గించడం వల్ల పరిస్థితి మరింత విషమిస్తోంది. భారతదేశం వంటనూనెల అవసరాల్లో పెద్ద భాగాన్ని దిగుమతుల ద్వారానే తీర్చుకుంటోంది. అందువల్ల గ్లోబల్ మార్కెట్‌లో చిన్న మార్పుకూడా దేశీయ ధరలపై ప్రభావం చూపుతుంది. కానీ ఈ సహజ ప్రభావాన్నిమించి, కృత్రిమ కొరతలు సృష్టించడం ద్వారా ధరలను పెంచడం అనేది వ్యాపార నైతికతకు విరుద్ధం. ఇది కేవలం ఆర్థిక దోపిడీ మాత్రమే కాదు ప్రజల జీవన ప్రమాణాలను దెబ్బతీసే సామాజిక అన్యాయం. ఇప్పటికే గ్యాస్ సిలిండర్ ధరలు, రవాణాఖర్చులు, ఇతర నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిన నేపథ్యంలో, వంటనూనెల ధరల పెరుగుదల కుటుంబ బడ్జెట్‌ను పూర్తిగా దెబ్బతీస్తోంది. ముఖ్యంగా తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలకు ఇది జీవన పోరాటంగా మారింది. రోజువారీ ఖర్చులను సమతుల్యం చేసుకోవడం కష్టసాధ్యంగా మారుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాత్ర అత్యంత కీలకం. మార్కెట్‌లో జరుగుతున్న అక్రమాలను అరికట్టేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలి. గిడ్డంగులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం, స్టాక్ లిమిట్లు విధించడం, కృత్రిమ కొరతలు సృష్టించే వ్యాపారులపై కఠినచర్యలు తీసుకోవడం అవసరం. ధరల నియంత్రణ కోసం పారదర్శక వ్యవస్థను అమలు చేయడం ద్వారా వినియోగదారులకు న్యాయం చేయాలి. దీర్ఘకాలిక పరిష్కారంగా దేశీయంగా ఆయిల్‌సీడ్స్ ఉత్పత్తిని పెంచడం అత్యవసరం. రైతులకు ప్రోత్సాహకాలు, సాంకేతిక సహాయం అందించడం ద్వారా దిగుమతులపై ఆధారాన్ని తగ్గించవచ్చు. వినియోగదారులు కూడా అప్రమత్తంగా ఉండాలి. అవసరానికి మించి కొనుగోలు చేయడం, నిల్వ చేసుకోవడం వంటి చర్యలు మార్కెట్‌లో మరింత కొరతను పెంచుతాయి. కాబట్టి బాధ్యతాయుత వినియోగంకూడా సమానంగా ముఖ్యం. మొత్తంగా, యుద్ధం ఒక కారణం కావచ్చు కానీ అది ధరల దోపిడీకి న్యాయం చేయదు. కృత్రిమ కొరతలు సృష్టించడం ద్వారా ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం అసహనీయమైన చర్య. ●



# ప్రజావాక్కు

## ఉద్యోగులలో ఆందోళనలు

నేటి సాంకేతిక యుగంలో పెరుగుతున్న ఉద్యోగ కోతలు, కృత్రిమ మేధ వల్ల కలిగే మార్పులు ఉద్యోగులలో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఈవిఘాతం కేవలం తాత్కాలికం కాదు, ఇది ఒక తక్షణ సవాలు. దీనిని ఎదుర్కోవడానికి కేవలం నిష్క్రియాత్మక సర్దుబాట్లు సరిపోవు. సంస్థలలో పటిష్టమైనపునఃశిక్షణ కార్యక్రమాలుండాలి. ముఖ్యంగా మధ్య స్థాయి ఉద్యోగులు ఏఐ ఆధారిత విధుల్లోకి మారడానికిస్పష్టమైనమార్గాలను యాజమాన్యాలు కల్పించాలి. కొత్త సాంకేతికతలను అందిపుచ్చుకోవడం ద్వారానే వృత్తిపరమైన ఎదుగుదల సాధ్యమవుతుంది. పరిశ్రమల సంఘాలు, ప్రభుత్వం కలిసి సరసమైన ధరకే నాణ్యమైన శిక్షణను అందించాలి. సంస్థలు తమ మానవ వనరుల ప్రణాళికను పారదర్శకంగా ఉంచడం ద్వారా ఉద్యోగులలో నెలకొన్న అనిశ్చితిని తగ్గించవచ్చు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## విద్యార్థులకు అదనపు శిక్షలు

ఏపిలో కూటమి ప్రభుత్వం ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, నూతన బోధనా ప్రక్రియలు చేపట్టి వార్షిక పరీక్షల ముందే విద్యార్థులకు తగినశిక్షణ, అదనపు ఏర్పాట్లు చేసి తద్వారా వచ్చినఉత్తమ ఫలితాలు తల్లితండ్రులకు, విద్యాభిమానులకు ఆశ్చర్యపరిచింది. ఉత్తమ ర్యాంకర్లను అభినందించేకార్యక్రమాలుపిల్లలకు ఎంతో ఉత్సాహం ,ఆనందం తృప్తిఏర్పడింది. చాలా వరకు ప్రైవేట్ సంస్థల ప్రకటనలు, వారి విద్యార్థుల ఫోటోలతో వస్తున్న మీడియాలో ప్రభుత్వపాఠశాల విద్యార్థుల ప్రతిభను ఉపాధ్యాయులు, అధికార్లు చాటిచెప్పారు. ఇదేరీతిలో ఇంటర్మీడియట్ నుండి కూడా ఆ విద్యార్థులను ప్రభుత్వ కళాశాలలోని చేరేందుకు ప్రోత్సహించి వారికి వీలైన ఆర్థిక సహాయం ప్రభుత్వం అందించి కళాశాల వనరుల అభివృద్ధి మరింత దీటుగా మెరుగు పరచాలి.

- బొల్లోజు మేఘనాదం విశాఖపట్నం

## వృద్ధులు,పసిపిల్లలు జాగ్రత్త

వేసవికాలంలో అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా ఇంట్లోని వృద్ధులు,చిన్నపిల్లలు అత్యవసరమైతే తప్ప ఆరుబయటికి వెళ్లొద్దు. రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల ప్రభావం వలనవడదెబ్బలకు గురయ్యే అవకాశాలు ఎక్కువ. కావున వీలైనంత వరకు ఆరోగ్యంగా ఉంటూ ఇంట్లోనే సమయాన్ని గడిపేలా చూడాలని వైద్యులు చెబుతున్నారు.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

## రాజకీయాల ప్రక్షాళన యువతకే సాధ్యం!

ముఖ్యంగా నేటి రాజకీయాలలో నీతి, నైతిక విలువలు అనేవి పూర్తిగా అడగంటిపోయాయి అనేది ఎవరు కాదనలేని వాస్తవం. ఎందుకంటే ఈసమాజంలో విద్యావంతులైన యువతకు భ్రష్టుపట్టిన నేటి రాజకీయాలలో ఉన్నత స్థానం అంటూ లేకుండా పోయింది. ఒక వేళ చదువుకున్న యువతకు నేటి రాజకీయాలలో అవకాశం వస్తున్న అది బహుస్వల్పమే అంటే నూటికి కేవలం 30 శాతం మాత్రమే. అదేమీ దురదృష్టమో గాని ఎక్కువగా నేటి రాష్ట్ర రాజకీయాలను అవినీతి మకిలి అంటిన వారు, దౌర్జన్యకారులు, ప్రజల ఆస్తులను కొల్లగొట్టే దుర్మార్గపు వ్యవహారశైలి వున్నవారే శాసిస్తుండటం ఈ ప్రజాస్వామ్యానికి సంబంధించి అత్యంత బాధాకరమైన, ఆందోళన కలిగించే విషయం. కాబట్టి ఈ ఆనారోగ్య, అనాగరిక పరిస్థితుల్లో మార్పురావాలంటే మరింతమంది ఉన్నత విద్యావంతులైన యువత రాజకీయాలలోకి రావాలి.

- బుగ్గన మధుసూదనరెడ్డి, నంద్యాల జిల్లా

## సంయమనం పాటించాలి

నేడుదేశంలో హత్యలు, అత్యాచార సంఘటనల్లో బాధితులపై ఎక్కడ, ఎలా జరిగాయని మీడియాలో సవివరంగా వస్తున్నాయి. దర్యాప్తు చేసే పోలీసులకు తెలుపవలసిన వివరాలన్నీ టీవీ, పేపర్ చూసే సామాన్యులకు అవసరంలేదు. సెల్ ఫోన్లలో వచ్చే ఇలాంటి దారుణ సంఘటనల ప్రసారాలన్నీ కూడా ప్రభుత్వం నియంత్రించాలి. లేకపోతే సమాజంలో బాధితుల పరిస్థితి రచ్చకెక్కి పెనంపైనుండి పొయ్యిలో పడ్డట్టవుతుంది. మరోవైపు నిందితులకు వాళ్ల పరువు పోకుండా ముసుగు వేస్తారు. టీవీల్లో 24గంటల వార్తా ప్రసారాల వల్ల సమాజంలో సున్నితత్వం, సెంటిమెంట్స్ తగ్గి తాగుడు, డ్రగ్స్ వంటి వాటి మత్తులో సైకోల హింసోన్మాదం, ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. తాము కూడా అలా నేరాలు చేసి తప్పించుకోవచ్చనే భ్రమతోకొందరు అలాంటి నేరాలకి పాల్పడుతున్నారు. కనుక గతంలోవలె టీవీలు, పత్రికలు సంయమనం పాటించి పైశాచిక సంఘటనలని సమాజానికి క్లుప్తంగా తెలపాలి.

- టి. సాంబశివరావు, గుంటూరు

## అధిక నిధులు కేటాయించాలి

తెలంగాణా రాష్ట్రంలో ఉన్న వివిధ ఆశ్రమం విద్యా సంస్థలకు అధికనిధులు కేటాయించాలి. విద్యార్థులకు త్రాగు నీరు, మరుగు దొడ్లు, బట్టలు, ఛూట్లు, టీషర్ట్స్, బుక్స్, నోట్స్, స్టడీ మెటీరియల్, ట్రంక్ బాక్స్, బెడ్ షీట్, వివిధ మౌలిక వసతులు కలిపించాలి. విద్య బోధన చేసే గురువులకు నివాసయోగ్యమైన వసతి కలిపించాలి.

-రాపాక రవీందర్,జనగాం

# 'సంయమన శక్తి'కి నిదర్శనమే 'సిందూర్'

సయ్యద్ అతా హస్నైన్

ఆపరేషన్ సింధూర్' వార్షికోత్సవం గుర్తుంచుకోవాల్సిన తేదీ మాత్రమే కాదు, భారత వ్యూహాత్మక దృక్పథంలో వచ్చిన బలమైన, నిర్ణయాత్మకమైన మార్పుకు ప్రతిబింబం. అనేక విధాలుగా, సంక్లిష్టమైన, బహుముఖ సవాళ్ల మధ్య భవిష్యత్తులో యుద్ధాలను లేదా సంఘర్షణలను భారత్ ఎలా ఎదుర్కోవాలో చెప్పేందుకు నిర్వచనంగా ఆపరేషన్ సింధూర్ నిలిచిపోతుంది. ఈ విజయం వెనుక ఉన్నప్రధాన కారణం తడబాటు లేని రాజకీయ స్పష్టత. దశాబ్దాలుగా, శత్రువుల రెచ్చగొట్టే చర్యలకు భారత్ స్పందించే తీరు తరచుగా స్వయంగా విధించుకున్న పరిమితులకు లోబడే ఉండేది. ఆపరేషన్ సింధూర్ ద్వారా భారత్ తన సంయమనాన్ని వీడలేదు, కానీ దానిని మరింత మెరుగుపరిచింది. అవసరమైన మేరకే శక్తిని ఉపయోగిస్తూనే, ఒక ఖచ్చితమైన వ్యూహాత్మక సందేశాన్ని శత్రువుకు పంపగలమని భారత్ నిరూపించింది. అదే సమయంలో, అవసరమైతే ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేసే సామర్థ్యం కూడా ఉందని స్పష్టంగా చాటిచెప్పింది. రాజకీయ నాయకత్వం కేవలం నిర్ణయాత్మక చర్య తీసుకోవాలనే ఉద్దేశాన్ని చూపడమే కాకుండా, క్షేత్రస్థాయిలో ఉన్న సైనిక కమాండర్లకు పూర్తి కార్యాచరణ స్వేచ్ఛను ఇచ్చే అంతటి ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శించింది. లక్ష్యం పట్ల ఉన్న ఈ స్పష్టత.. వేగం, ఖచ్చితత్వం, సమన్వయంగా మారింది. ఆధునిక సైనిక పోరాటాల విజయానికి ఈమూడు లక్షణాలే అత్యంత కీలకం. రాజకీయ సంకల్పానికి వ్యవస్థాగత సామర్థ్యం తోడైనప్పుడు అది దేశ బలాన్ని ఎన్నో రెట్లు పెంచుతుంది. ఆపరేషన్ సింధూర్ ఈ అద్భుతమైన సమన్వయానికి ఒక గొప్ప ఉదాహరణగా నిలిచింది. అంతే ప్రాముఖ్యత కలిగిన మరొక అంశం, భారతదేశం తన బహుముఖ సామర్థ్యాలను అత్యంత సమర్థవంతంగా అనుసంధానించడం. నేటి ఆధునిక యుద్ధం భూమి, నీరు, ఆకాశానికే పరిమితం కాలేదు. సైబర్, అంతరిక్షం, ఎలక్ట్రోమాగ్నెటిక్ స్పెక్ట్రమ్కు కూడా విస్తరించింది. ఈవిభిన్న రంగాల్లో తన పట్టును ప్రదర్శించడంలో దేశానికున్న ప్రావీణ్యాన్ని ఆపరేషన్ సింధూర్ నిరూపించింది. ఖచ్చితమైన దాడులతో పాటుశత్రువుల సమాచార వ్యవస్థ, సరఫరా గొలుసును దెబ్బతీసే సైబర్ ఆపరేషన్లు తోడయ్యాయి. ఎప్పటికప్పుడు నిఘా, లక్ష్యాలను గుర్తించడంలో అంతరిక్ష వనరులు కీలక పాత్ర పోషించాయి. లక్ష్యాల్ని గుర్తించడంతో పాటు దాడి తర్వాత జరిగిన నష్టాన్ని అంచనా వేయడంలోనూ క్రియాశీలకంగా పని చేశాయి. అదే సమయంలో, ఎలక్ట్రానిక్ వార్ఫేర్ సామర్థ్యాలు శత్రువుల స్పందనను బలహీనపరిచాయి. ఈ ఆపరేషన్ భారత దళాల మధ్య కేవలం సమన్వయాన్నే కాదు, సమష్టి పనితీరు, పరిణతిని ప్రతిబింబించింది. ఈ సమయంలో సివిల్‌సైనిక వ్యవస్థల ఏకీకరణ పోషించిన పాత్ర ప్రత్యేకంగా గమనించాలి. ఆపరేషన్ సింధూర్ కేవలం సైనిక ప్రయత్నమే కాదు, దేశం మొత్తం కలిసి చేసిన కృషి. నిఘా సంస్థలు, సాంకేతిక సంస్థలు, పౌర నాయకత్వం, సాయుధ దళాలతో కలిసి పనిచేశాయి. నిఘా వ్యవస్థల నుంచి ఖచ్చితమైన ఆయుధాల వరకు స్వదేశీ సాంకేతికతలు కీలక పాత్ర పోషించాయి, ఇది స్వయంసమృద్ధిపై మనం నిరంతరం పెట్టిన పెట్టుబడి ఫలితాన్ని చూపించింది. ఈ ఆపరేషన్ భారత నిర్ణయాధికార నిర్మాణంలోని సామర్థ్యాన్ని కూడా ప్రదర్శించింది.



ఇక్కడ వివిధ ఏజెన్సీల మధ్య సమన్వయం, బ్యూరోక్రాటిక్ జాప్యాలకు తావు లేకుండా ఒకే లక్ష్యంతో సాగింది. ఆపరేషన్ ప్రారంభానికి ముందే భారతదేశం ఎంతో దూరదృష్టితో వ్యవహరించింది. మనం తీసుకునే చర్యలను ప్రపంచం ఏవిధంగా చూస్తుందనే విషయంలో భారత్ చాలా జాగ్రత్తగా వ్యవహరించింది. మన దౌత్యవేత్తలు ప్రపంచ దేశాలతో నిరంతరం సంప్రదింపులు జరిపి, భారత్ చేస్తున్న ఈ పోరాటం ఎవరినో ఆక్రమించుకోవడానికికాదని, శత్రువుల రెచ్చగొట్టే చర్యలకు సమాధానంగా చేస్తున్న 'అవసరమైన ఆత్మరక్షణ' అని స్పష్టంగా వివరించారు. దీనివల్ల అంతర్జాతీయ సమాజం కూడా భారత్ తీసుకున్న నిర్ణయం సరైనదేనని గుర్తించింది. ఇలా సైనిక శక్తికి, రాజకీయనేర్పు, దౌత్యనీతి తోడవ్వడం వల్లే ఆపరేషన్ సింధూర్ ఒక చారిత్రక విజయంగా నిలిచింది. దీనికి భిన్నంగా, పాకిస్థాన్ స్పందన ముందే ఊహించినట్లుగా సాగింది. సైనిక పరంగా చూస్తే, భారత్ మెరుపుదాడికి ఆ దేశం కంగుతిన్నది. తమ దగ్గర ఉన్న అరకొర వనరులు, సరిపోని యుద్ధ సామర్థ్యం వల్ల భారత్ను సమర్థంగా ఎదుర్కోవడంలో పాకిస్థాన్ విఫలమైంది. ఇక దౌత్యపరంగా, ఈ అంశాన్ని అంతర్జాతీయ వేదికలపైకి తీసుకెళ్లి ప్రపంచ దేశాల మద్దతు కూడగట్టాలని చూసినా అనుకున్న ఫలితం సాధించలేదు. అయితే, పాకిస్థాన్ ఎక్కువగా దృష్టి పెట్టింది మాత్రం'సమాచార యుద్ధం' మీదనే. క్షేత్రస్థాయిలో జరిగిన అసలు విషయాలను దాచిపెట్టడానికి, వారు తెలివిగా అల్లిన ఎన్నో అబద్ధాలను ప్రచారం చేశారు. కానీ, వారి మాటల్లో నిజాయితీ, పొంతన లేకపోవడంతో ఆ ప్రయత్నాలు ఫలించలేదు. ఆపరేషన్ సింధూర్ అనేది భారతదేశం కావాలనిచేసిన దురాక్రమణకాదు. శత్రువులను ప్రత్యక్షంగా రెచ్చ గొట్టే చర్యలకు భారత్ ఇచ్చిన సరైన సమాధానం. ఈ ఆపరేషన్ లక్ష్యాలు చాలా స్పష్టమైనవి, ఎంచుకున్న స్థావరాలు చట్టబద్ధమైనవి, దీనిని అత్యంత క్రమశిక్షణతో నిర్వహించారు. భారతదేశం ఎప్పుడూ హద్దులు దాటలేదు. అవసర మైన మేరకు మాత్రమే స్పందిస్తూ, అత్యంత సంయమనంతో వ్యవహరించింది. ఆపరేషన్ జరిగినంత కాలం భారత్ నిజమైన సమాచారాన్ని మాత్రమే వెల్లడించింది. ఎంతో పారదర్శకతను పాటిస్తూ, విశ్వసనీయమైన మార్గాల ద్వారా అసలు విషయాలను ప్రపంచానికి తెలియజేయడం వల్ల, వాస్తవాలను వక్రీకరించే శత్రువుల ప్రయత్నాలు పూర్తిగా విఫలమయ్యాయి. ఆపరేషన్ సింధూర్ భవిష్యత్తుకు మార్గనిర్దేశం చేసే కొన్ని విలువైన పాఠాలను నేర్పింది. మొదటిది, రాజకీయ సంకల్పం అత్యంత కీలకం. మనం ఏ విషయంలోనైనా అస్పష్టంగా ఉంటే అది శత్రువులకు బలాన్నిస్తుంది. అదే స్పష్టమైన వైఖరితో ఉంటే వారు భయపడతారు. యుద్ధతంత్రంలో కేవలం సైన్యమే కాదు, సైబర్, అంతరిక్షం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి ఆధునిక రంగాల్లో కూడా మనం పట్టు సాధించాలి. భవిష్యత్తులో మన ఆధిక్యాన్ని నిలబెట్టుకోవడానికి ఈ రంగాల్లో పెట్టుబడులు చాలా అవసరం. దేశంలోని పౌర, సైనిక వ్యవస్థలు మరింతగా కలిసి పని చేయాలి. జాతీయ శక్తిని ఒక పద్ధతి ప్రకారం సమన్వయం చేసుకున్నప్పుడే మనం ఏసవాలునైనా సమర్థంగా ఎదుర్కోగలం. తప్పుడు సమాచారాన్ని గుర్తించడానికి, దానిని తిప్పికొట్టడానికి, అది వ్యాప్తిచెందక ముందే అడ్డుకోవడానికి భారతదేశం తన సామర్థ్యాలను మరింత బలోపేతం చేసుకోవాలి. దీనికోసం కేవలం అత్యాధునిక సాంకేతిక పరికరాలు ఉంటే సరిపోదు, వేగవంతమైన, నమ్మదగ్గ సమాచారాన్ని ప్రజలకు చేరవేసే బలమైన వ్యవస్థలు కూడా ఉండాలి. ఆపరేషన్ సింధూర్ వారసత్వం కేవలం ఆసమయంలో దక్కిన విజయానికే పరిమితం కాలేదు. అది మనలో నింపిన ఆత్మవిశ్వాసంలో, దేశంలోని రాజకీయ, సైనిక, వ్యవస్థాగత యంత్రాంగాలు అన్నీఒకే తాటిపైఉండి, పూర్తిస్పష్టతతో, ఒకే లక్ష్యంతో తమ శక్తినంతా సమన్వయం చేసుకున్నంతకాలం, ఆ ప్రభావం సమతుల్యత భారత్‌కు అనుకూలంగానే ఉంటుంది. ●

**(రచయిత : లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్))**

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

ong-5_ong-5.qxd 5/7/2026 11:01 PM Page 1



## పదోన్నతులు మరింత బాధ్యతను పెంచుతాయి

**ఒంగోలు, ప్రభాతవార్త**



పదోన్నతులు విధి నిర్వహణలో బాధ్యతలను మరింత పెంచుతాయని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా డిప్యూటీ జనరల్ మేనేజర్ వెల్లంకి శ్రీనివాసరావు అన్నారు. స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఒంగోలు రీజనల్ మేనేజర్‌గా పని చేస్తున్న వెల్లంకి శ్రీనివాసరావు డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా రీజనల్ మేనేజర్‌గా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా రీజనల్ పరిధిలోని బ్యాంక్ సిబ్బంది, అధికారులు, యూనియన్ నాయకులు ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన వెల్లంకి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో పదోన్నతులు సహజమని, ఇవి మన పనితీరుకు నిదర్శనం అన్నారు. మనం మరింత వినూత్నంగా మెరుగ్గా ఖాతాదారులకు సేవలు అందించడానికి పదోన్నతులు దోహదపడతాయన్నారు. తనకు అభినందనలు తెలిపిన అధికారులు, సిబ్బంది, యూనియన్ నాయకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా పదోన్నతి పొందిన వెల్లంకి శ్రీనివాసరావును అభినందించిన వారిలో హోం లోన్ విభాగం అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పి.శ్రీరామ్, చిట్టిబాబు, నాగేశ్వరరావు, ఎం.సూరజ్, శ్రీధర్, చీఫ్ మేనేజర్లు వేదం రాజేష్‌బాబు, రవికుమార్, రామారావు, సాయి ప్రభాకర్, కే.జానకీరామయ్య, ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు వి.శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, అవార్డు యూనియన్ నాయకులు సుధాకర్, పి.వెంకటరెడ్డి, చీఫ్ మేనేజర్లు, రీజనల్ పరిధిలోని అన్ని శాఖల మేనేజర్లు ఉన్నారు.

## సమగ్ర అభివృద్ధి, సాధికారతే కిశోర వికాసం లక్ష్యం: ఎంపీడీవో

**బల్లికురవ మే 7( ప్రభాతవార్త)**



కిశోర వికాసం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కుసుమ కుమారి అన్నారు. మండలంలోని కొప్పెరపాడు పంచాయతీ కార్యాలయంలో జరిగిన కిశోర వికాసం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. 11 నుండి 18 సంవత్సరాల వయసు గల కౌమార బాలికల సమగ్ర అభివృద్ధి, సాధికారత, ఆరోగ్య భద్రత, సామాజిక అవగాహన కోసం ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని రూపొందించింది అన్నారు. యుక్త వయసులో బాలికలు ఎదుర్కొనే శారీరక, మానసిక మార్పులపై ప్రధానంగా అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. బాలికలలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి వారి హక్కులను వారికి గుర్తు చేయటం జరుగుతుందన్నారు. బాల్యవివాహాలను నిర్మూలించటం, లైంగిక దాడులు, వేధింపులపై మరింత అవగాహన పెంపొం దించి, బాలికలకు సురక్షితమైన వాతావరణ ని కల్పించడం ఈ కార్యక్రమా ప్రధాన లక్ష్యమన్నారు.

## చాగొల్లు సచివాలయంలో గ్రామ సభ

**ఉలవపాడు, మే 7, ప్రభాతవార్త**




వన్ మంత్ వన్ విలేజ్ ఫోర్ విజిట్స్ కార్యక్రమం లో భాగంగా గురువారం చాగొల్లు గ్రామ సచివాలయంలో గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు సబ్ కలెక్టర్ హిమ వంశీ పాల్గొని ప్రజలు ఇచ్చిన అర్జీలను స్వీకరించారు. నిర్ణీత సమయంలో సమస్యలను పరిష్కరిస్తామని అర్జీదారులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు ఏ వి రవి శంకర్, ఏం పి డి ఓ సురేష్, మండల సర్వేయర్ ఖాదర్ హుస్సేన్, వి ఆర్ ఓ రవిబాబు, మండల స్థాయి అధికారులు, గ్రామ రైతులు మరియు గ్రామ నాయకులు పాల్గొన్నారు. గ్రామ సభలో మొత్తం 7 అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ తెలిపారు.

## స్కూల్.. కాలేజీ బస్సులపై విస్తృత తనిఖీలు చేసిన ఆర్టీవో

**ఉలవపాడు, మే 7, ప్రభాతవార్త**



మండలంలోని స్కూల్ మరియు కాలేజీ బస్సులను కందుకూరు ఆర్టీవో టీవీ నాగలక్ష్మి విస్తృతంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రవాణా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు కందుకూరు నియోజకవర్గ పరిధిలోని స్కూల్ మరియు కాలేజీ బస్సులపై గత వారం రోజుల నుండి విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్కూల్ మరియు కాలేజీ బస్సులకు ఏఐఎస్ 63 ప్రకారం స్టాండర్డ్స్ ఉండాలన్నారు. అదేవిధంగా బస్సులకు సంబంధించిన ధ్రువపత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని, ప్రతి బస్సు కు వి ఎల్ టి డి (వెహికల్ లోకేషన్ ట్రాకింగ్ డివైస్) ను తప్పనిసరిగా అమర్చుకోవాలని వాహనాల యజమానులకు తెలియజేశారు. రూల్స్ కు వ్యతిరేకంగా వాహనాలు నడిపినటువంటి యజమానులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మోటార్ వాహనాల అధికారి జే అనిల్ కుమార్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరుగురు మహిళలకు కుట్టు మిషన్లు

**చీమకుర్తి(ప్రభాతవార్త)**



చీమకుర్తి రోటరీ క్లబ్ ఆధ్వ ర్యంలో ఆరుగురు మహిళలకు కుట్టు మిషన్ పంపిణీ చేశారు. డాక్టర్ చెరుకూరి వెంకటేశ్వర్లు ఇండోర్ షటిల్ కోర్టు స్టేడియంలో రోటరీ క్లబ్ అఫ్ చీమకుర్తి అధ్య క్షుడు తోగటి శ్రీను, సభ్యుడు నాగేళ్ల సత్యం, చారు ప్రాజెక్టు వారి ఆర్థిక సహకారంతో గురువారం ఈ కార్యక్రమంలో నిర్వహిం చారు. చీమకుర్తి పట్టణము లోని ఆరుగురు పేద మహిళలకు కుట్టు మిషనులు అందజేయటం జరిగింది. ఇవి వారి స్వయం ఉపాధికి ఉపయోగపడే విధంగా రోటరీ ఆసరా కార్యక్రమం ద్వారా ఇవ్వటం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షుడు తోగటి శ్రీను, కార్యదర్శి పారెళ్ల శ్రీనివాసరావు, మాజీ కార్యదర్శి సుధాకర్, సభ్యులు పిల్లి ఆదినారాయణ రెడి, నాగేళ్ల సత్యం హాజరయ్యారు.

## చీమకుర్తి స్పెషల్ ఆఫీసర్‌గా చంద్రశేఖర్

**చీమకుర్తి ప్రభాతవార్త**



చీమకుర్తి మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్ గా టి.చంద్రశేఖర నాయుడు బాధ్యతలు స్వీకరించారు. ఒంగోలు ఆర్డీఓ కె లక్ష్మి ప్రసన్న బదిలీ అయినందున వారి స్థానము లో నూతన ఆర్డిఓ గా టి చంద్రశేఖర్ నాయుడు నియమితులయ్యారు. దీనిలో భాగంగా చీమకుర్తి పురపాలక సంఘం స్పెషల్ ఆఫీసర్ గా వారు గురువారం బాధ్యతలు స్వీకరించటం జరిగినది. చీమకుర్తి మునిసిపల్ కమిషనర్ వై రామకృష్ణయ్య వారిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

## మోకాలుకు శాస్త్ర చికిత్సకు నగదును మంజూరు చేసిన మంత్రి

**జె. పంగులూరు మే 7 ప్రభాతవార్త**



అనారోగ్యంతో బాధపడుతున్న కార్యకర్తలను, నాయకులను తెలుగుదేశం పార్టీ ఆదుకుంటుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని పంగులూరు గ్రామానికి చెందిన బాచిన విజయలక్ష్మి భర్త రామారావు మోకాలు శాస్త్ర చికిత్స చేయించుకోగా తెలుగుదేశం పార్టీ నాయకులు బాచిన త్రివేంద్రం, వడ్డెంపూడి శ్రీకాంత్ 74,464/ చెక్కును బుధవారం అందించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు త్రివేంద్రం మాట్లాడుతూ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చొరవతో ఎల్‌ఓసి ద్వారా 74,464/ రూపాయలను బాచిన విజయలక్ష్మికి అందించడం జరిగిందని, రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఇటువంటి ఆపదలో ఉన్న తెలుగుదేశం పార్టీ సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాచిన త్రివేంద్రం, వడ్డెంపూడి శ్రీకాంత్, బాచిన చౌదరి బాబు, చిలుకూరి నాగేశ్వరరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

## రైతులు రాయితీపై వ్యవసాయ పనిముట్ల కొరకు దరఖాస్తులు చేసుకోవాలి

**మండల వ్యవసాయ అధికారి డి.సుబ్బారెడ్డి**

**జె. పంగులూరు మే 7 ప్రభాతవార్త**



రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం యాంత్రీకరణ పథకం కింద పనిముట్లు రాయతీయులపై అందించేందుకు సిద్ధంగా ఉందని, ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగ పరచుకోవాలని మండల వ్యవసాయ అధికారి డి. సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని రైతులు వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా పనిముట్లు, పరికరాలు, స్ప్రేయర్స్ మరియు ట్రాక్టర్ పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి డి. సుబ్బారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రకాశం
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



## అల్లూరి సీతారామరాజుకు నివాళులర్పించిన ఎస్పీ హర్షవర్ధన్ రాజు

**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త**



స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా ప్రకాశం జిల్లా పోలీస్ క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఘన నివాళులు అర్పించారు. అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు సమర్పించిన ఎస్పీ, ఆయన దేశభక్తి, పోరాట పటిమను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగు జాతి ఆత్మగౌరవానికి, తెగువకు అల్లూరి సీతారామరాజు చిరస్మరణీయ ప్రతీక అని పేర్కొన్నారు. బ్రిటిష్ పాలకుల నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా మన్యం ప్రజల్లో చైతన్యం నింపి విప్లవ పోరాటానికి నాంది పలికిన మహనీయుడు అల్లూరి అని కొనియాడారు.

# జలవనరుల విభజనపై కసరత్తు

**- కొత్త సర్కిల్‌పై తర్జనభర్జన**

**ఒంగోలు, ప్రభాతవార్త**






రాష్ట్ర విభజన జరిగిన పుష్కరకాలం తరువాత కొత్త జిల్లాలప్రాతిపాదిన, ఉద్యోగుల సర్దుబాటుకు శ్రీకారం చుట్టారు. నూతన జిల్లా పరిధిలోకి రాని అన్ని సబ్ డివిజన్లు మార్కాపురం జిల్లా ఏర్పాటై నాలుగు నెలలు పూర్తయినా నేటికి ఇరిగేషన్ శాఖ కార్యాకలాపాలు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోనే ఉన్నట్లుగా కొనసాగుతుంది. డివిజన్, సబ్ డివిజన్ వ్యవస్థలో మార్పుల ఊసే లేదు. కొత్తగా మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి, యర్రగొండపాలెం నాలుగు నియోజకవర్గాలతో నూతన జిల్లా ఏర్పాటైన తరువాత అంతకముందు ఉన్న రూపు నుంచి అన్ని శాఖల పునర్వ్యవస్థీకరణ జరుగుతుంది. మొత్తం 21 మండలాల పరిధిలోని సబ్ డివిజన్‌లు, జిల్లా పరిధిలో ఉండేలా రూపుదిద్దుకుంటున్నాయి. ఇప్పటికే పలు శాఖల మార్పులు జరగ్గా, ఇంకా కొన్ని శాఖల్లో పాత పద్ధతుల్లో కార్యకలాపాలు కొనసాగుతూ, సాంకేతిక వివరాలను నమోదు కూడా ఒంగోలు పేరుతోనే జరుగుతుంది. అటువంటి శాఖల్లో ఇరిగేషన్ శాఖ ఒకటి. రాష్ట్ర ప్రభుత్వం జల సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ కార్యకలాపాలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పనులకు అంచనాలు రూపొందించడం, ఆమోదం, టెండర్ల పక్రియ ముమ్మరంగా జరుగుతుంది. ఆ సమయంలో ఉమ్మడి జిల్లా పరిధిలోని అన్ని జరుగుతుండడంతో పాటు ఆ శాఖలో ఉన్న సిబ్బందికొరత కూడా ఇబ్బంది కరంగా మారింది. మార్కాపురం జిల్లాలో మొత్తం 21 మండలాలు ఉన్నాయి. అందులో జలవనరుల శాఖకు సంబంధించి మార్కాపురం డివిజన్‌లో వివిధ సెక్షన్లు కలిపి నాలుగు సబ్ డివిజన్లు ఉన్నాయి. కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాలను రెండు సెక్షన్లు చేసి కనిగిరి-1,2 గా ఉంచి వాటిని ఒంగోలు డివిజన్‌లోనే ఉంచారు. పొదిలి, కొనకనమిట్ల మండలాలు కూడా ఒంగోలు డివిజన్‌లో ఉండిపోయాయి. ఇప్పటికి పనుల అంచనాలు, ఆమోదాలు, బిల్లుల అప్లోడ్ కోసం ఎప్పటిలాగానే కొన్ని సబ్ డివిజన్‌లు ఒంగోలు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లా అధికారి పోస్టు ఒంగోలు ఇన్‌చార్జి కావడంతో పాత పద్ధతిలోనే అన్ని పద్ధతులు ఒంగోలులోనే జరిగిపోతున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఎన్నెస్పీ కూడా అన్ని డివిజన్‌ల పరిధిలోకి వస్తుంది. మరమ్మత్తులు, అంచనాలు పెరిగాయి. ఉమ్మడి జిల్లా ప్రాతపదికన ప్రకాశం జిల్లా కేంద్రంగా ఆ రెండు విభాగాల సర్కిల్ కార్యాలయాలు అవసరం. ప్రాధాన్యత ఎంతో ఉంది.

## అమరావతి సమావేశం ఉమ్మడి ప్రకాశం జిల్లా కలెక్టర్లు, మంత్రులు





**ఒంగోలు కలెక్టరేట్ ప్రభాతవార్త**

అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన గురువారం నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా కలెక్టర్లు రాజబాబు, మార్కాపురం కలెక్టర్ విజయ సునీతతో పాటు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పాల్గొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, పరిపాలన, సంక్షేమ కార్యక్రమాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగినట్లు సమాచారం. ఈ సందర్భంగా ఉమ్మడి ప్రకాశం జిల్లాకు సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక వసతుల విస్తరణ, తాగునీరు, రహదారులు, గృహ నిర్మాణ పథకాలు, వ్యవసాయానికి సంబంధించిన అంశాలపై ముఖ్యమంత్రికి అధికారులు నివేదిక సమర్పించినట్లు తెలిసింది. జిల్లాల్లో అమలవుతున్న సంక్షేమ పథకాల పురోగతి, ప్రజలకు సేవలు అందుతున్న విధానం, గ్రామ, వార్డు సచివాలయాల పనితీరు వంటి అంశాలు కూడా సమావేశంలో ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. ప్రభుత్వ సేవలను మరింత వేగవంతంగా ప్రజలకు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సీఎం అధికారులకు పలు సూచనలు చేసినట్లు తెలిసింది. ముఖ్యంగా అభివృద్ధి పనులు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, పెండింగ్ ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించినట్లు సమాచారం. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు, విద్యా, వైద్య రంగాల అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణపై కూడా చర్చ జరిగినట్లు తెలిసింది. ప్రజలకు పారదర్శక పరిపాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని సమావేశంలో అధికారులు పేర్కొన్నట్లు సమాచారం.

## మృతదేహం కలకలం

**ఒంగోలు క్రైమ్ ప్రభాతవార్త**

టంగుటూరు మండలం కొణిజేడు-పొందూరు గ్రామాల మధ్య ఇనగలేరు సమీపంలో కుళ్లిపోయిన మృతదేహం లభించడం స్థానికంగా కలకలం రేపింది. జామాయిల్ కర్ర కొడుతున్న కూలీలకు తీవ్ర దుర్వాసన రావడంతో సమీప ప్రాంతాలను పరిశీలించగా ఓ వ్యక్తి మృతదేహం కనిపించింది. వెంటనే వారు టంగుటూరు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం పూర్తిగా కుళ్లిన స్థితిలో ఉండటంతో మరణం కొన్ని రోజుల క్రితమే జరిగి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ఘటనాస్థలంలో లభించిన ఆధార్ కార్డు ఆధారంగా మృతుడు బిహార్ రాష్ట్రానికి చెందిన సాకీ సహానిగా గుర్తించారు. మృతుడి మరణానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు సమాచారం. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## కారుబైక్ ఢీ.. కారుపై యువకుల దాడి

**ఒంగోలు క్రైమ్ ప్రభాతవార్త**

ఒంగోలుకొత్తపట్నం రోడ్డులో జరిగిన కారు, బైక్ ఢీకొన్న ఘటన ఉద్రిక్తతకు దారితీసింది. అల్లూరువైపు వెళ్తున్న కారును ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొనడంతో బైక్‌పై ఉన్న పవన్‌తో పాటు మరో వ్యక్తి కిందపడిపోయి స్వల్ప గాయాలు పొందారు. ఘటనతో అక్కడ కొంతసేపు ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే పవన్ అన్న అజయ్‌తో పాటు మరికొందరు యువకులు ఆగ్రహంతో కారుపై రాళ్లతో దాడి చేసినట్లు సమాచారం. ఈ ఘటనలో కారుకు చెందిన అద్దాలు ధ్వంసమయ్యాయి. రాళ్ల దాడి కారణంగా కారులో ఉన్న ప్రసన్న కుమార్ రెడ్డి భార్యతో పాటు కుమార్తె దీక్షతకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ప్రమాదానికి గల కారణాలు, కారుపై దాడి ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

## రైల్వే బ్రిడ్జిలపై ఎంపీ మాగుంట, దామచర్ల సత్యతో రైల్వే అధికారుల సమావేశం

**ఒంగోలు కలెక్టరేట్ ప్రభాతవార్త**



ఒంగోలు నగరంలోని రామ్‌నగర్‌లో ఉన్న మాగుంట కార్యాలయంలో ఒంగోలు పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసులు రెడ్డిని రైల్వే అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రాంతంలో ప్రతిపాదిత రైల్వే బ్రిడ్జిల నిర్మాణాలు, భద్రతా చర్యలు, అభివృద్ధి పనులపై విస్తృతంగా చర్చించారు. రైల్వే సేఫ్టీ ప్రాజెక్ట్ ఇంజనీర్ సుందర్ సింగ్ (ఆర్ఎస్‌పీ) పలు కీలక అంశాలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా రైల్వే క్రాసింగ్‌ల వద్ద ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులు, ట్రాఫిక్ సమస్యలు తగ్గించే దిశగా చేపట్టాల్సిన చర్యలపై చర్చ జరిగినట్లు సమాచారం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా రైల్వే వంతెనల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎంపీ సూచించినట్లు తెలిసింది. నగర అభివృద్ధికి అనుగుణంగా రైల్వే మార్గాల వద్ద భద్రతా ప్రమాణాలు మరింత మెరుగుపరచాల్సిన అవసరం ఉందని సమావేశంలో ప్రస్తావించారు. పలు ప్రాంతాల్లో పెరుగుతున్న వాహన రద్దీ కారణంగా కొత్త రైల్వే బ్రిడ్జిల నిర్మాణం అత్యవసరమని అధికారులు వివరించారు. రైల్వే అండర్‌పాస్‌లు, ఓవర్‌బ్రిడ్జిల నిర్మాణాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలపై కూడా సమీక్ష నిర్వహించినట్లు తెలిసింది. ప్రజల రాకపోకలకు ఆటంకం కలగకుండా పనులను దశల వారీగా పూర్తి చేయాలని ఎంపీ సూచించారు. రైల్వే శాఖ, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల మధ్య సమన్వయం ఉంటే అభివృద్ధి పనులు వేగంగా పూర్తవుతాయని అభిప్రాయపడ్డారు. ఒంగోలు నగర అభివృద్ధిలో రైల్వే మౌలిక సదుపాయాల విస్తరణ కీలకమని సమావేశంలో పేర్కొన్నారు. రైల్వే లైన్ల సమీపంలో భద్రతా చర్యలు మరింత కట్టుదిట్టం చేయాలని అధికారులు తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వానికి మరిన్ని ప్రతిపాదనలు పంపించే అంశంపై కూడా చర్చించారు. ఈ సమావేశంలో మారిటైమ్ బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్య కూడా పాల్గొని పలు అభివృద్ధి అంశాలపై అభిప్రాయాలు వెల్లడించారు. ప్రాంతీయ అభివృద్ధికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర స్థాయిలో సమన్వయంతో ముందుకు సాగాలని సమావేశంలో అభిప్రాయపడినట్లు సమాచారం.

## పియంజిఏవైతో పేదల సొంతింటి కలసాకారానికి అర్హుల ఎంపిక పూర్తి

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



పేదలకు సొంతింటి కలను నెరవేర్చాలన్న లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రధానమంత్రి గ్రామీణ్ ఆవాస్ యోజన (పీఎంజీఏవై) అమలును వేగవంతం చేస్తు న్నాయి. ఇందులో భాగంగా ప్రకాశం జిల్లాలో 28,996 మంది, మార్కాపురం జిల్లాలో 22,654 మంది అర్హులను అధికారులు గుర్తించారు. గృహ నిర్మాణశాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే రెండుసార్లు సర్వే నిర్వహించి అర్హుల వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. ఈ నెలాఖరులోగా కేంద్ర ప్రభుత్వం కొత్త ఇళ్ల మంజూరు ప్రక్రియ ప్రారంభిం చనున్న నేపథ్యంలో తొలి విడతలో కొంతమంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పీఎంఏవై2.0 కింద 2024 నవంబర్ నుంచి 2025 జులై వరకు విస్తృత స్థాయిలో సర్వే చేపట్టారు. దరఖాస్తుదారుల ప్రస్తుత నివాసం, నిర్మాణం చేపట్టే స్థలాల వద్ద ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేశారు. పట్టణ ప్రాంత లబ్ధిదారులకు రూ.2.50 లక్షలు, గ్రామీణ ప్రాంత లబ్ధిదారులకు రూ.1.80 లక్షల ఆర్థిక సహాయం అందించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సొంత స్థలం లేదా ప్రభుత్వ పట్టా ఉన్నవారు పథకానికి అర్హులుగా పరిగణించబడతారు. తెల్ల రేషన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం, భార్యాభర్తల ఆధార్ నకళ్లు సమర్పించాల్సి ఉంటుంది. గతంలో ప్రభుత్వ గృహ పథకాల కింద ఇళ్లు పొందిన వారికి ఈ పథకం వర్తించదని అధికారులు స్పష్టం చేశారు. అర్హుల ఎంపిక ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తున్నామని గృహనిర్మాణశాఖ అధికారులు తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా కూడా దరఖాస్తుల పరిశీలన చేపట్టినట్లు వెల్లడించారు. అర్హుల జాబితాను తుది రూపంలో సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించనున్నట్లు పేర్కొన్నారు. కొత్త ఇళ్ల మంజూరుతో జిల్లాలో వేలాది నిరుపేద కుటుంబాలకు శాశ్వత నివాస భద్రత కలగనుంది. గ్రామీణ ప్రాంతాల్లో మట్టి, పాత ఇళ్లలో నివసిస్తున్న కుటుంబాలకు ఈ పథకం ద్వారా పెద్ద ఊరట లభించనుంది. లబ్ధిదారులు నిర్మాణ పనులను నిర్ణీత గడువులో పూర్తి చేస్తే విడతల వారీగా నిధులు విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు. నిర్మాణ నాణ్యతపై ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందని, ఇళ్ల నిర్మాణం వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

## భవన్నాసి కాలువ ఆక్రమణపై అధికారుల నిర్లక్ష్యం

**- పారుదల కాలువ ఆక్రమించిన రియల్టర్**
**- అభివృద్ధికి చర్యలు చేపట్టాలని భక్తుల డిమాండ్**

**సింగరాయకొండ, మే 5, ప్రభాత వార్త:**



ప్రభుత్వ భూములు, దేవాదాయ శాఖ భూములు, నీటి పారుదల కాలువలు ఆక్రమణకు గురవుతున్నా నియంత్రణలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పాత సింగరాయకొండ గ్రామంలోని శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ప్రాంగణంలోని స్వామివారి పుష్కరిణీ అయిన భవనాసికి నీరు చేరే ప్రధాన కాలువ ఆక్రమణకు గురైన ఘటన వెలుగులోకి వచ్చింది. దేవాదాయ ధర్మాదాయ శాఖ, రెవిన్యూ రికార్డుల ప్రకారం సుమారు 20 అడుగుల వెడల్పు ఉన్న ఈ కాలువను ఒక రియల్టర్ అక్రమంగా ఆక్రమించి వెంచర్‌గా మార్చి భవన నిర్మాణాలు చేపట్టడంతో పాటు కాలువను రహదారిగా వినియోగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలో ఈ విషయంపై మీడియాలో వార్తలు వచ్చినప్పటికీ అధికారుల నుంచి ఎటువంటి స్పందన లేకపోవడం విమర్శలకు దారి తీస్తోంది. ఈ కాలువ ద్వారా వర్షపు నీరు భవనాసికి చేరి దేవాలయ అవసరాలకు ఉపయోగపడేది. గతంలో ప్రతి రోజు భవనాసి నుంచి తీసుకోని వచ్చిన నీటితో స్వామి వారి తీర్థం భక్తులకు అందించేవారు. ప్రతి సంవత్సరం జూన్‌లో జరిగే బ్రహ్మోత్సవాలు, సంక్రాంతి అనంతరం కనుమ రోజున జరిగే తెప్పోత్సవం ఈ పుష్కరిణీలో ఘనంగా నిర్వహించేవారు. అలాగే బ్రహ్మోత్సవాలలో చివరి రోజు చక్రస్నానం అర్చకులు ఆధ్వర్యంలో ఇక్కడే నిర్వహించబడుతుంది. అయితే కాలువలు ఆక్రమణకు గురవడంతో నీటి ప్రవాహం తగ్గిపోవడం వల్ల పుష్కరిణిలో సరిపడా నీరు లేక కొన్ని సందర్భాలులో తెప్పోత్సవం నిర్వహణలో అంతరాయం ఏర్పడిన ఘటనలు చాలా ఉన్నాయని భక్తులు తెలిపారు. ఊళ్లపాలెం( ఓవి) రోడ్డుకు ఎగువునా కురిసిన వర్షాపు నీరు పకీర్‌పాలెం ప్రాంతంలోని దర్గా వద్ద నుండి ఈ కాలువ ప్రారంభమై అదేవిధంగా బ్రాహ్మణకాలనీ సమీప శివాలయం తూర్పుగా ప్రవహించి దక్షిణంగా ఉన్న కాలువ ద్వారా నీరు భవనాసిలో కలిసేది. ప్రస్తుతం అక్రమ వెంచర్లు కారణంగా ఈ మార్గం పూర్తిగా మూసుకుపోయి నీటి పారుదల నిలిచిపోయింది. దీంతో భవనాసి పూర్తిస్థాయిలో నిండక ముందుగానే వేసవిలో ఎండిపోతుంది. గ్రామంలో బోర్లు, బావుల్లో ఉప్పునీరు అధికంగా ఉండటంతో స్థానికులు ఈ నీటిపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవల దేవస్థానానికి కొత్త పాలకవర్గం ఏర్పడిన నేపథ్యంలో చైర్మన్, సభ్యులు, అధికారులు వెంటనే స్పందించి ఆక్రమణలను తొలగించి కాలువను పునరుద్ధరించి పుష్కరిణీని అభివృద్ధి చేయాలని భక్తులు, గ్రామస్థులు, సనాతన ధర్మ సేవకులు డిమాండ్ చేస్తున్నారు.



ong-8_ong-8.qxd 5/8/2026 12:53 AM Page 1



## ఒక నెల ఒక గ్రామం నాలుగుసార్లు సందర్శన కార్యక్రమం

- గ్రామ సభ్యులనుమండల తాసిల్దార్ పి. సింగారావు

**జె.పంగులూరు మే 7 ప్రభాతవార్త**



రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు బూదవాడ గ్రామంలో తాసిల్దార్ పి.సింగారావు అధ్యక్షతన ఒక నెల ఒక గ్రామం నాలుగుసార్లు సందర్శన కార్యక్రమం గ్రామ సభ్యులను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ పి.సింగారావు మాట్లాడుతూ ఈ గ్రామంలో దాదాపు అన్ని సమస్యలు పరిష్కరించుట ఈ కార్యక్రమం ముఖ్య ఉ దేశమని, సమస్యలు లేని గ్రామంగా తయారు చేయుటకు ఈ కార్యక్రమం రూపొందించడం జరిగిందన్నారు. ప్రతి నెలలో మొదటి గురువారం గ్రామంలో గ్రామ సభలు నిర్వహించి అర్జీలు స్వీకరణ, అర్జీలను ఆన్లైన్లో పొందుపరచుట, గ్రామానికి సంబంధించిన యావత్ రికార్డు అసెస్మెంట్ వివరాలు 22 (ఏ) నిషేధపు భూమిని జాబితా ఆర్ఓఆర్ ఏ 1, మరియు ఏపీ ఆర్ఎస్ ఆర్ 10(1) అడంగల్ గ్రామ సభలో అందుబాటులో ఉంచి చదివి వినిపించుట జరుగుతుందన్నారు. ప్రభుత్వ భూములు లైన చెరువులు, కుంటలు, వాగులు వివరాలు చదివి వివరించుట, ఈ నెల రోజులపై ఎవరిలో రైతుల సమస్యలు పరిష్కరించుట డిజిటల్ సంతకం మిస్సింగ్ గా అడంగల్లు, నకలు 1బి న కళ్ళు లాంటి సమస్యలు అక్కడికక్కడే పరిష్కారించుట, చనిపోయిన కొనుగోలు చేసిన వారి వివరాలు నిర్నిత కాలవ్యవధిలో మియాటేషన్ చేయుట, ఎంపీడీవో కే స్వరూప రాణి మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్, మండల సర్వేలు, ఏఈ ఇరిగేషన్, అటవీ శాఖ అధికారులు దేవాదాయ శాఖ అధికారులు అర్జీలు స్వీకరణ పరిష్కారం క్షేత్రస్థాయిలో పరిశీలన అర్జీదారులకు సమస్య పరిష్కారము చేసి ఉత్తర్వులు మంజూరు చేయుట, కోర్టు కేసులు మినహా వివాదాస్పద భూములు తప్ప మిగిలిన అన్ని సమస్యల పరిష్కరించడం జరుగుతుందన్నారు. మొత్తం అర్జీ లేదు నిన్న అక్కడికక్కడ గ్రామ సభలో పరిష్కారం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఈ సర్వే డిప్యూటీ తాసిల్దార్ అర్జున్, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్వేత, గ్రామ రెవెన్యూ అధికారి మాధవి, గ్రామ సర్వేలు సంపత్, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## వేసవిలో సురక్షిత ప్రయాణానికి వాహనదారులు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి ఎస్పీ

**ఒంగోలు క్రైమ్ ప్రభాతవార్త**



వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో వాహనదారులు ప్రయాణాల సమయంలో తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు సూచించారు. ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో ఎండల తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా వాహన భద్రతతో పాటు వ్యక్తిగత ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ అవసరమన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రజల సహకారం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు .ప్రయాణానికి ముందు వాహనంలోని అన్ని టైర్ల పరిస్థితిని పరిశీలించాలని, గాలి సరైన మోతాదులో ఉందో లేదో తనిఖీ చేయాలని సూచించారు. పాతబడిన లేదా దెబ్బతిన్న టైర్లను వెంటనే మార్చుకోవాలని తెలిపారు. అలాగే ఇంజిన్, బ్రేకులు, బ్యాటరీ, కూలింగ్ సిస్టమ్ వంటి భాగాలను ముందుగానే చెక్ చేయడం ద్వారా ప్రయాణ సమయంలో ఇబ్బందులు, ప్రమాదాలు నివారించవచ్చన్నారు. ఎండాకాలంలో ఇంజిన్ వేడెక్కే అవకాశాలు ఎక్కువగా ఉండటంతో రేడియేటర్‌లో తగినంత నీరు ఉండేలా చూసుకోవాలని సూచించారు.దూర ప్రయాణాలు చేసే వాహనదారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి 100 కిలోమీటర్ల తర్వాత కొంత సమయం విశ్రాంతి తీసుకోవడం మంచిదన్నారు. అలసటతో డ్రైవింగ్ చేయడం ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉన్నందున డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ప్రయాణ సమయంలో తగినంత నీరు తీసుకోవడం, శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుకోవడం అవసరమన్నారు. సాధ్యమైనంత వరకు ఉదయం లేదా సాయంత్రం సమయాల్లో ప్రయాణాలు ప్లాన్ చేసుకోవాలని సూచించారు.ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీటుబెల్ట్ వినియోగించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, రాంగ్ రూట్‌లో ప్రయాణించడం, అతివేగంగా డ్రైవింగ్ చేయడం ప్రమాదాలకు ప్రధాన కారణమవుతున్నాయని తెలిపారు. డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగాన్ని పూర్తిగా నివారించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని, ప్రజల భద్రత కోసం జిల్లా పోలీస్ శాఖ నిరంతరం చర్యలు చేపడుతోందని ఎస్పీ హర్షవర్ధన్ రాజు వెల్లడించారు.

## రేషన్ కార్డుదారులకు ఇకెవైసీ చివరి అవకాశం

**ఒంగోలు కలెక్టరేట్ ప్రభాతవార్త**

రేషన్ కార్డులో నమోదైన ప్రతి సభ్యుడు తప్పనిసరిగా ఇకెవైసీ (ఈకేవైసీ) పూర్తి చేసుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ ప్రక్రియ కోసం ఇప్పటికే పలుమార్లు గడువు పొడిగించినప్పటికీ ఇంకా వేలాది మంది సభ్యులు ఇకెవైసీ పూర్తి చేయలేదని అధికారులు వెల్లడించారు. ప్రకాశం జిల్లాలో మొత్తం 5,14,619 రేషన్ కార్డులు ఉండగా, వాటిలో నమోదైన సభ్యుల సంఖ్య 14,82,876గా ఉంది. ఇప్పటి వరకు 14,41,413 మంది మాత్రమే ఇకెవైసీ పూర్తి చేసుకున్నారని తెలిపారు. ఇంకా 27,376 మంది సభ్యులు ఈ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉందని పేర్కొన్నారు.ఇకెవైసీ పూర్తి చేయని సభ్యులు వెంటనే స్పందించి తమకు సమీపంలోని రేషన్ దుకాణం లేదా గ్రామ, వార్డు సచివాలయాన్ని సంప్రదించాలని అధికారులు సూచించారు. ఈసారి చివరి అవకాశంగా ప్రభుత్వం గడువు కల్పించిన నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ప్రక్రియ పూర్తి చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇకెవైసీ పూర్తి చేయని వారి రేషన్ సేవలపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున ప్రజలు నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని పౌరసరఫరాల శాఖ అధికారి తెలిపారు.

## రెవెన్యూ సమస్యలు సత్వర పరిష్కారానికి కృషి

- మార్కాపురం ఎమ్మెల్యే కందుల

**కొనకనమిట్ల, మే 7, ప్రభాతవార్త**

రెవెన్యూకు సంబంధించిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ఒక నెల ఒక గ్రామం నాలుగు పర్యటనలు కార్యక్రమాన్ని ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. ఒక నెల ఒక గ్రామం కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని మంగాపురం గ్రామంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీని ద్వారా నెలకు ఒక గ్రామంలో ప్రతి గురువారం నాలుగు వారాలు రెవెన్యూ అధికారులు పర్యటిస్తారని దీని ద్వారా జీరో కాతా భూములు, ఇతరులు, పొలం గట్ల సమస్యలు తదితర ప్రతి రెవెన్యూ సమస్యకు నెల కాలంలో అధికారులు పరిష్కరిస్తారన్నారు. ప్రతి ఒక్కరూ ఏ రెవెన్యూ సమస్య ఉన్న అధికారులకు అర్జీల రూపంలో అందజేయాలని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో వైసీపీ నాయకులు తమకు అనుకూలంగా ఉన్న వారికి మిగతా వారి భూములు ఆన్‌లైన్ చేసి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. గత వైసీపీ పాలన మొత్తం కక్ష సాధింపులతోనే కాలం వెళ్ళబుచ్చారని అలాకాకుండా కూటమి ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి ఫలాలను కూడా అందజేస్తున్నామని అన్నారు. ఇప్పటికే నిరుద్యోగులకు రాష్ట్రంలో 6 లక్షల 40 వేల ఉద్యోగాలు ఇచ్చామని భవిష్యత్తులో మరిన్ని ఉద్యోగాలు యువతకు లభిస్తాయని అన్నారు. వెనుకబడిన మన ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి ఇప్పటికే మార్కాపురం జిల్లా ప్రకటించారని త్వరలోనే వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేస్తామని తద్వారా ఈ ప్రాంతాన్ని హార్టికల్చర్‌హబ్‌గా మారుస్తామని అన్నారు. త్వరలోనే కొత్త పెన్షన్ల మంజూరు కార్యక్రమం ఉంటుందని అర్హులైన వారందరికి పెన్షన్లు మంజూరు అవుతాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో కక్ష సాధింపులకు పోయి మిగతా పార్టీల వారి పెన్షన్లు తీసేశారని గుర్తు చేశారు. గత ప్రభుత్వ హయాంలో పాస్ పుస్తకాలపై కూడా జగన్ బొమ్మను ముద్రించి, వ్యవస్థను అల్లకల్లోలం చేశారని కానీ ఇప్పుడు ప్రభుత్వ రాజముద్రతో నూతన పాస్ పుస్తకాలు మంజూరు చేస్తున్నామని అన్నారు. మునగపాడు రెవెన్యూ విలేజ్ పరిధిలో మంజూరైన 520 కొత్త పాస్ పుస్తకాలను ఎమ్మెల్యే కందుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆవుల సురేష్, మండల టీడీపీ కన్వీనర్ మూరబోయిన బాబురావు, పొదిలి, మార్కాపురం ఏఎంసీ చైర్మన్లు సయ్యద్ ఇమాంస సాహెబ్, మాలపాటి వెంకటరెడ్డి, చిన్నారికట్ల, రేగడపల్లి సింగిల్ విండో అధ్యక్షులు సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి, కనకం నరసింహారావు, మాజీ మండల కన్వీనర్ తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పొదిలి ఏఎంసీ వైస్ చైర్మన్ పందిటి తిమోతి, బీసీ సెల్ మండల అధ్యక్షులు అంకాల రోశయ్య, నాయకులు మిడతల చెన్నారెడ్డి, ఆర్ఐ బి.శ్రీనివాసరావు, వీఆర్వోలు పలువురు అధికారులు, ఆయా గ్రామాల ప్రజలు, తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.



## భూ సమస్యల పరిష్కారంలో వేగం పెంచాలి

- జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

**మార్కాపురం, మే 7, ప్రభాతవార్త :**




జిల్లాలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారంలో అధికారులు మరింత వేగం పెంచాలని జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఒక నెల – ఒక గ్రామం – నాలుగు సందర్శనలు కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన కొమరోలు మండలంలోని సూరవారిపల్లి, రాచర్ల మండలంలోని అనుమలపల్లి, అర్ధవీడు మండలంలోని బొల్లుపల్లి గ్రామాల్లో నిర్వహించిన ప్రత్యేక రెవెన్యూ కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వే పూర్తైన గ్రామాల్లో జాయింట్ ఎల్‌పీఎం సమస్యలను ఈ నెలాఖరు లోపు పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సాదా బైనమా, చేతిరాత పత్రాల ద్వారా భూములు కొనుగోలు చేసిన వారికి ప్రభుత్వం రిజిస్ట్రేషన్ అవకాశం కల్పించిందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు 206 గ్రామాల్లో రీ సర్వే పూర్తయిందని, రైతులకు నూతన పాస్ పుస్తకాలు అందజేసే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో భూ సమస్యలు లేకుండా చూడటం రెవెన్యూ శాఖ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ముఖ్యంగా మార్కాపురం జిల్లాలో అధికంగా ఉన్న భూ వివాదాలను పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల తహసిల్దార్లు, ఎంపీడీవోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## టైర్లు మారుస్తున్న బస్సును ఢీకొట్టిన ద్విచక్రవాహనం

**మార్కాపురం, మే 7,ప్రభాతవార్త :**

మార్కాపురం సమీపంలోని రాయవరం ఎస్టేట్ వద్ద గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. భారత్ పెట్రోలియం బంక్ సమీపంలో రోడ్డుపక్కన నిలిపి టైర్లు మారుస్తున్న ఎస్ఎల్వీటి బస్సును వెనుక నుంచి వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న వ్యక్తికి గాయాలు కాగా, స్థానికులు వెంటనే స్పందించి అంబులెన్స్ సహాయంతో సమీప ఆసుపత్రికి తరలించారు. ఘటన సమయంలో బస్సు రోడ్డుపక్కన ఆగి ఉండగా, ద్విచక్ర వాహనం అదుపుతప్పి వెనుక భాగాన్ని ఢీకొట్టినట్లు ప్రాథమిక సమాచారం. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదు.

## నెమలిగుండ్ల క్షేత్రంలో మాస కళ్యాణం

**రాచర్ల, మే 7 ప్రభాతవార్త :**

మండలంలోని జేపీ చెరువు గ్రామ సమీప అడవుల్లో వెలసి ఉన్న శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి క్షేత్రంలో ఈనెల 9వ తేదీ శనివారం స్వామివారి మాస కళ్యాణం జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణ అధికారి మల్లవరపు నాగయ్య చైర్మన్ సిద్ధం నరసింహులు గురువారం తెలిపారు. ప్రతినెల రెండవ శనివారం ఆలయంలో స్వామివారి మాస కళ్యాణం జరుగుతుందని, అందులో భాగంగా ఈ శనివారం కూడా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. స్వామివారి మాస కళ్యాణంలో పాల్గొనదలచిన భక్తులు రూ.1516 రూపాయలు చెల్లించి రశీదు పొందాలని సూచించారు. కళ్యాణంలో పాల్గొనే దంపతులు సాంప్రదాయ దుస్తుల్లో పాల్గొనాలని వారు కోరారు.

## సమస్యల పరిష్కారంలో జాప్యం వహించవద్దు

జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు

**రాచర్ల, మే 7 ప్రభాతవార్త :**




ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చిన సమస్యల పరిష్కారంలో జాప్యం వహించకుండా త్వరతగతిన పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు అన్నారు. మండలంలోని అనుములపల్లి గ్రామంలో గురువారం ఒక నెల– ఒక గ్రామం – నాలుగు సందర్శనలు కార్యమ్రాన్ని మండల తహసిల్దార్ ఎల్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు పాల్గొని మాట్లాడుతూ తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను విచారించి తప్పకుండా పరిష్కరిస్తామని అన్నారు. ఈ సందర్భంగా ప్రస్తుతం ప్రజల నుండి 5 దరఖాస్తులు భూ వ్యత్యాసాలు, హద్దుల సమస్యల గురించి వచ్చాయని వాటిపై విచారణ జరిపి పరిష్కరిస్తామని తెలిపారు. నాలుగు విడతల్లో జరిగే కార్యక్రమాల లోపు సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్ వెంకటరామిరెడ్డి, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ హర్ష గౌడ్, సర్వేయర్ ఏ శ్రీనివాసరావు, వీఆర్వో ఈ వెంకటేశ్వర్లు, పిఓ వి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## హజరత్ గూడెంలో ఉపాధి హామీ పనుల పరిశీలన

**కంభం, మే 7 ప్రభాతవార్త :**

మండలంలోని హజరత్ గూడెం గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను కంభం మండల ఎంపిడిఓ వీరభద్రాచారి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పనుల పురోగతి, కార్మికుల హాజరు వివరాలను పరిశీలించి పనులు నాణ్యతగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. నిర్ణీత కొలతల ప్రకారం పనులు చేయాలని శ్రామికులకు సూచించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఉపాధి హామీ సిబ్బంది తదితరులు ఉన్నారు. 7కెడికె3సమావేశంలో సబ్‌కలెక్టర్ అధికారులు

## వేసవిసెలవుల్లో అంగన్‌వాడీల స్పెషల్ కార్యక్రమం

- కందుకూరు సబ్‌కలెక్టర్ హిమవంశీ

**కందుకూరు మే 7, ప్రభాతవార్త**



ˇవేసవిసెలవుల్లో మహిళాశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించు కిషోర్‌వికాసం సమ్మర్ స్పెషల్ ప్రోగ్రాంను జయప్రదం చేయాలని కందుకూరు సబ్ కలెక్టర్ దామెర హిమవంశీ పలువురు అధికారులకు సూచించారు. గురువారం కందుకూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సీడీపీవో ఉషారాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని సంబందిత అదికారులంతా హాజరై లక్ష్యాలను సాధించాలని కోరారు. సీడీపీవో ఉషారిణి మాట్లాడుతూ బేటీ బచావో– బేటీ పడావో కార్యక్రమంలో మే 1నుంచి జూన్ 11వరకు కిషోర్‌వికాసం, మిషన్ శక్తి పథకాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కాలంలో యువతీయువకులకు బాల్యవివాహాలు, డ్రాపౌట్స్, బాలకార్మికులు, విద్యాభివృద్ధి, ఆరోగ్యం, భద్రత, సమానత్వం తదితర అంశాలపై అవగాహన కలిగించనున్నట్లు సూచించారు. ఇందుకోసం 15 నుంచి 20మంది యువతీ యువకులుతో వేరేవేరుగా గ్రూపులు ఏర్పాటుచేయనున్నట్లు వివరించారు. వీరికి సచివాలయాలు, కమ్యూనిటీ హాల్సు, పాఠశాలలులో ప్రతి మంగళ, శుక్రవారాలలో ఉదయం పూట శక్తిబాలికలకు, బుధ, శనివారాలలో సాయంత్రం వేళల్లో యువకులుకు అవగాహనాసదస్సులు నిరహించనున్నట్లు చెప్పారు. ఇందులో రోజుకొక అంశం చొప్పున విద్యావశ్యకత, వ్యక్తిగతఆరోగ్యం, పౌష్టికాహారం, ఆర్థిక అక్షరాస్యత, కెరీర్ గైడెన్స్, కౌన్సిలింగ్, సోషల్ మీడియా, సైబర్‌నేరం, లైంగికవేదింపులు, జీవితనైపుణ్యాలు, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ తదితర 11అంశాలును గురించి వివరించాలన్నారు. ఇందులో పోలీస్, పీఆర్, విద్యా, వైద్య, క్రీడాశాఖల ప్రతినిధులు హాజరవుతారని ఆమె పేర్కొన్నారు. కిషోరి వికాసం వేసవి సెలవుల శిక్షణా కార్యక్రమం యొక్క పోస్టర్ ఆవిష్కరించారు. ఐసీడీఎస్ అదికారులు నాయకత్వంలో లక్ష్యాలు సాదించాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమానికి డి.ఎల్.డి.ఓ, డివిజన్ లెవెల్ పంచాయతీ అధికారి, మెడికల్ ఆఫీసర్, డి.ఎస్.పి, అసిస్టెంట్ లేబర్ కమిషనర్, డిప్యూటీ డిఇఓ, సిడిపిఓ ఉలవపాడు, ప్రొటెక్షన్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

## కందుకూరుకు 53పరికరాలు-రూ.21లక్షల సబ్సిడీ

**కందుకూరు మే 7, ప్రభాతవార్త**



రైతు సంక్షేమం నిమిత్తం ప్రభుత్వం వ్యవసాయపరికరాలను రాయితీపై అందచేస్తుం దని మండల వ్యవసాయాధికారి అబ్దుల్ రహీం తెలిపారు. ఇందుకోసం కందుకూరు మండలానికి 53రకాల యూనిట్లు మంజూరుకు రూ.21.09 లక్షలమేర సబ్సిడి కేటాయించినట్లు ఆయన వెల్లడించారు. గురువారం స్దానిక వ్యవసాయ అధికారివారి చాంబర్‌లో మండల రైతుసేవాకేంద్రాల సిబ్బంది సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న అబ్దుల్ రహీం మాట్లాడతూ వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద వ్యవసాయ పరికరాలైన ట్రాక్టర్ ట్రక్‌లు, నాగళ్ళ తదితర పరికరాలు సబ్సిడిపై మంజూరుచేయనున్నట్లు తెలిపారు. ఇందుకు అవసరం, అర్హతగల రైతులు ఆన్లైన్ విధానంలో స్వచ్చందంగా దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. ఈ ప్రక్రియలో రైతులకు అవసరమైన సహకారాన్ని రైతు సేవా కేంద్రాల సిబ్బంది అందిస్తారని తెలిపారు.

## ఎస్ఎండీ కిందరాయితీపై పనిముట్లకి దరఖాస్తు చేసుకోండి

- మండల వ్యవసాయాధికారిణి తిరుమలరావు

**ముండ్లమూరు, మే 7, ప్రభాతవార్త**



ఎస్ఎండీ కిందరాయితీపై పనిముట్లకి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి తిరుమలరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముండ్లమూరు మండలంకు 13.45లక్షల రూపాయలు విలువ గల 42రకాల వ్యవసాయ యంత్ర పరికరాలు గొర్రు, పల్టీ నాగలి, విత్తన గొర్రు, రొటోవేటర్, తైవాన్ స్ప్రేయర్, పవర్ వీడర్, పవర్ టిల్లర్ రాయితీపై కేటాయించారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, సన్న చిన్న కారు, మహిళా రైతులకు 50 శాతం, పెదన రైతులకు పొలం 5 ఎకరాలు కన్నా ఎక్కువ ఉన్న రైతులకు 40 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. ట్రాక్టర్‌కు సంబంధించిన పనిముట్ల కొరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతులు తమ పేరును ట్రాక్టర్ ఉండాలని, ట్రాక్టరుకు సంబంధించిన ఆర్‌సీ పత్రమును, రేషన్ కార్డు తమ వెంట తీసుకొని వెళ్లాలని సూచించారు. దరఖాస్తు చేసుకొనుటకు ఆఖరు తేదీ 19 అని చెప్పారు. కావున ముండ్లమూరు మండలంలోని రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

## వృద్ధాశ్రమంలో అన్నదానం

**దర్శి, మే 7, ప్రభాతవార్త**



పొదిలి మండలం కాటూరివారిపాలెం గ్రామస్తులు కరెంటు లైన్‌మెన్ కాటూరి వెంకట నరసయ్య సుజాతల కుమార్తె కుమారుడు కాటూరి వెంకట శివ సాయి కుందనిక కాటూరి వెంకట కౌశిల్ పుట్టిన రోజు సందర్భంగా దర్శి శ్రీ షిర్డీ సాయిబాబా వృద్ధాశ్రమంలో వృద్దులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## పసుపుగల్లులో వన్ మంత్ వన్ విలేజ్ కార్యక్రమం

- పాల్గొన్న తహసీల్దార్ రజనీకుమారి

**ముండ్లమూరు, మే 7, ప్రభాతవార్త**



ముండ్లమూరు మండలంలో వన్ మంత్ వన్ విలేజ్ కార్యక్రమం గురువారం పసుపుగల్లు గ్రామంలో నిర్వహించడమైంది. ఈ కార్యక్రమంలో మొత్తం 7 అర్జీలు వచ్చాయి. వీటిలో 4 ఎఫ్ లైన్, 3 మ్యూటేషన్ వచ్చాయి. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, గ్రామ స్థాయి అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఎల్ఓసీ చెక్కు అందజేసిన ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మీ

**దర్శి, మే 7, ప్రభాతవార్త**




తాళ్లూరు మండలం బొద్దికూరపాడు గ్రామం చింతలపాలెం గ్రామానికి చెందిన సిరిశెట్టి రాంబాబు రూ.7,50,000లక్షల విలువైన ముఖ్యమంత్రిసహాయనిధి చెక్కును దర్శి టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మీ దర్శిలోని టీడీపీ కార్యాలయంలో గురువారం అందజేశారు. వారితో పాటు టీడీపీ నాయకులు కళ్యాణ్ చక్రవర్తి ఉన్నారు.

## ప్రతి గ్రామాన్ని రెవెన్యూ సమస్యలు లేకుండా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం

ఒక నెల-ఒక గ్రామం-నాలుగు సందర్శనలు కార్యక్రమంలో ఎమ్మెల్యే

**మార్కాపురం, మే 7, ప్రభాతవార్త :**



ప్రతి గ్రామాన్ని రెవెన్యూ సమస్యలు లేకుండా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష యమని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఒక నెల – ఒక గ్రామం – నాలుగు సందర్శనలు" కార్యక్రమంలో భాగంగా గురువారం మార్కాపురం మండలం రామచంద్రాపురం, శివరామపురం గ్రామాలతో పాటు కొనకనమిట్ల మండలం మంగాపురం గ్రామాల్లో ఎమ్మెల్యే పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించిన ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లోని రెవెన్యూ సమస్యలను గ్రామ స్థాయిలోనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి గురువారం తహసీల్దార్ నేతృత్వంలో అధికారులు గ్రామాలను సందర్శించి జీరో ఖాతా భూములు, ఆన్లైన్ భూ సమస్యలు, పొలం గట్ల వివాదాలు తదితర అంశాలను పరిశీలించి పరిష్కరిస్తారని చెప్పారు. ప్రతి అర్జీని ఆన్లైన్‌లో నమోదు చేసి రసీదు అందజేస్తామని, నెలరోజుల్లో తప్పులు లేని రెవెన్యూ రికార్డులను సిద్ధం చేయడమే లక్ష యమని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో భూ రికార్డుల్లో జరిగిన అవకతవకలకు భిన్నంగా పారదర్శక విధానంతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని, వెలుగొండ ప్రాజెక్టు పూర్తి ద్వారా ఈ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేస్తామని అన్నారు. త్వరలో కొత్త పెన్షన్ల మంజూరు కార్యక్రమం కూడా చేపడతామని వెల్లడించారు. అనంతరం మంగాపురం గ్రామంలో మునగపాడు రెవెన్యూ విలేజ్ పరిధిలో మంజూరైన 520 కొత్త పాస్ పుస్తకాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాలచెన్నయ్య, తహసీల్దార్ చిరంజీవి, సర్వేయర్ సంజీవయ్య, ఇతర మండల అధికారులు, గ్రామ అధికారులు, ప్రజలు, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ˇమార్కాపురంలో ఉచిత కంటి వైద్య శిబిరం

**మార్కాపురం, మే 7, ప్రభాతవార్త :**




మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి, పెదకాకాని – గుంటూరు మరియు జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నాయి. ఈ శిబిరం ఈ నెల 10వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మార్కాపురం పట్టణంలోని జవహర్ నగర్ కాలనీలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద జరుగుతుంది. శిబిరంలో అవసరమైన వారికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైతే ఉచిత కంటి ఆపరేషన్లు కూడా చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మార్కాపురం నియోజకవర్గ ప్రజలు, జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరానికి వచ్చే వారు తప్పనిసరిగా ఆధార్ కార్డు, ఓటర్ కార్డు, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ జిరాక్స్ కాపీతో పాటు కుటుంబ సభ్యుల ఫోన్ నెంబర్ తీసుకురావాలని సూచించారు. వివరాలకు 7075173912, 8096082956, 9705359708 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

## మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే

**వెలిగండ్ల, మే 7, ప్రభాతవార్త**

ఒంగోలు పార్లమెంటరీ పార్టీ అధ్యక్షులు, స్థానిక శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి గురువారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా వెలిగండ్ల గ్రామానికి చెందిన పంతగాని బాల గురవయ్య, ఈర్ల నాగమణి రాజు, ఇమ్మడిచెరువు గ్రామానికి చెందిన పరిశపోగు రాజు, కంద్రిక గ్రామానికి చెందిన ముక్కు ఏడుకొండలు, రాళ్లపల్లి గ్రామానికి చెందిన సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి, వెదుళ్లచెరువు గ్రామానికి చెందిన అన్నెబోయిన వెంకటేశ్వర్లు కుటుంబాల్లో జరిగిన వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీసీఎం వైస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, మండల పార్టీ మాజీ అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మార్కాపురం వార్త

## శక్తి యాప్ ద్వారా ఒక్క క్లిక్‌తోనే పోలీసుల సహాయం

ఎస్సై విశ్వనాథరెడ్డి

**మార్కాపురం టౌన్, మే 07, ప్రభాతవార్త :**

అత్యవసర పరిస్థితుల్లో శక్తి యాప్ ద్వారా ఒక్క క్లిక్‌తోనే పోలీసుల సహాయం పొందవచ్చని పట్టణ ఎస్సై విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక ఐడియల్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నేరాలపై విద్యార్థినులు ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. తమ భద్రత తమ చేతుల్లోనే ఉందన్నారు. ఎక్కడైనా మహిళలు ఒంటరిగా ఉండి ఇతరులతో ఇబ్బందులు పడే పరిస్థితులు తలెత్తినప్పుడు శక్తి టీమ్‌కు సమాచారం అందించాలన్నారు. తమ లోకేషన్ వెంటనే పోలీసులతో పంపుకోవచ్చని విద్యార్థులకు వివరించారు. ఎవరైనా మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా, అఘాయిత్యాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళల భద్రతకై ప్రభుత్వం చేపడుతున్న చర్యలను, శక్తి యాప్ గురించి, బాల్య వివాహాలు, రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాల నివారణపై అవగాహన కల్పించారు. మహిళలు గృహ హింసకు గురైనప్పుడు చేయవలసిన చర్యలను ఆయన వివరించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ శంకర్ బాబు మాట్లాడుతూ ప్రతి మహిళ తమ ఫోన్ లో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే ఆపదల సమయంలో పోలీసుల సాయం పొందవచ్చన్నారు. హింసాత్మక ఘటనల నుంచి మహిళలకు రక్షణ పొందవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, శక్తి టీమ్ సభ్యులు విద్యార్థులు పాల్గొన్నారు.

## దళితులు మీద దాడులు చేస్తే సహించం-జడ శ్రవణ్ కుమార్

**మార్కాపురం టౌన్, మే 07, ప్రభాతవార్త :**



దళితులు మీద దాడులు చేస్తే సహించేది లేదని జడ శ్రవణ్ కుమార్ పేర్కొన్నారు. గురువారం నిర్వహించిన మార్కాపురం జిల్లా మాల జేఏసీ నాయకుల, మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకుల ప్రత్యేక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దళితులకు ఏ సమస్య వచ్చినా న్యాయ పోరాటంలో ముందు ఉంటానని ఆయన భరోసా ఇచ్చారు. రాష్ట్ర మాల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తుళ్లిబిల్లి ఆశోక్ బాబు మాట్లాడుతూ రిజర్వేషన్ వర్గీకరణ పేరుతో దళితుల విభజించి, దళితుల రిజర్వేషన్ తీసేటటువంటి కుట్రలో భాగంగానే వర్గీకరణ చేశారన్నారు. ఎస్సీ రిజర్వేషన్ 20 శాతం పెంచాలన్నారు. ప్రైవేట్ రంగాల్లో రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. దళిత క్రైస్తవులకు రిజర్వేషన్ అమలు చేయాలని, లేకపోతే దళితులు అందరూ ఐక్యంగా పోరాడుతామని హెచ్చరించారు. అదేవిధంగా ఎస్సీలు చర్చికి పోయే క్రైస్తవులు వేరు చేయాలనుకునే దురుద్దేశంతో చర్చిలకు పోతే రిజర్వేషన్ రద్దు కావు అని అశోక్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం జిల్లా జేఏసీ అధ్యక్షులు శాంత కుమార్, మాల ఉద్యోగుల సంఘం అధ్యక్షులు శామ్యూల్, గొట్టిముక్కల యోహాన్, రాజశేఖర్, కొప్పోలు ఏడుకొండలు, శాంత రావు, లక్ష్మీ ౹నారాయణ, కె.వి.కృష్ణారావు మరియు యువకులు నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## టీఆర్ఆర్ కాలేజి లెక్చరర్ ఓరుగంటికి పీహెచ్‌డీ

## ప్రతిభకు పట్టం-అర్హుడికి అందలం

**కందుకూరు మే 7, ప్రభాతవార్త**



కందుకూరు టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజి రాజనీతిశాస్త్ర అద్యాపకులు ఓరుగంటి వెంకటేశ్వరరావుకు ఆచార్యనాగార్జున యూనివర్సిటీ,గుంటూరు గురువారం డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ అవార్డు ప్రకటించింది.ఈయన "ఆంధ్రప్రదేశ్‌లో ఎలెక్ట్రానిక్ పంచాయతీల పనితీరు -ప్రకాశం జిల్లా ప్రత్యేక అధ్యయనం" అనే అంశంపై యూనివర్సిటీ ప్రొఫెసర్ డా॥ఉదయప్రకాష్ పర్యవేక్షణలో పరిశోధనచేశారు. దీంతో ఆయన పీహెచ్‌డికి ఎంపికయ్యారు.ఈ మేరకు యూనివర్సిటీ తరపున రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం కోఆర్డినేటర్ పి.సుధాకర్ ఈ అవార్డును గురువారం ప్రకటించారు.దీంతో కాలేజి యాజమాన్యంతోపాటు పలువురు ఈయనను అభినందిస్తున్నారు.

ప్రతిభకు పట్టం-అర్హుడికి అందలం:

ఉన్నతవిలువలుగల సమర్ధులైన వెంకటేశ్వరరావు ప్రతిభకు ఆచార్య నాగార్జున యూనివర్సిటి పట్టంకట్టిందని పలువురు మేధావులు అభిప్రాయపడ్డారు. రాజనీతిశాస్త్రంలో ఈ అవార్డు అరుదుగా లభిస్తుంది.దీంతో అర్హుడికి అందలం దక్కిందని వ్యాఖ్యానించారు.రాజనీతిశాస్త్రంలో పోస్టుగ్రాడ్యుయేషన్ చేసిన వెంకటేశ్వరరావు ఒంగోలు ఆంధ్రకేసరి విద్యాలయంలో గత 2దశాబ్దాలుకి పైగా అద్యాపకులుగా పనిచేశారు.అనంతరం కందుకూరు ప్రభుత్వ కళాశాలకు బదిలీ అయ్యారు.పొలిటికల్ సైన్సులో ఈయన మంచి దిట్ట.విద్యాబోధనలో నేర్పరి.ఒక మంచి వక్త.ఈ నేపధ్యంలో ఉత్తమ అద్యాపకులుగా ప్రకాశం జిల్లా కలెక్టర్ నుంచి గతంలోనే ప్రశంసాపత్రం అందుకున్నారు.

సమాజసేవలో ఓరుగంటి కుటుంబం:

ఓరుగంటి వెంకటేశ్వరరావు పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో అందెవేసిన చేయిగా గుర్తింపు పొందారు.తాజా డాక్టరేట్ పురస్కారంతో ఈయన సామాజిక సేవాదృక్పథం మరింత మెరుగవనుంది..ఈయన సతీమణి జస్టిస్ చైతన్య నెల్లూరు జిల్లాలో సీనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహిస్తూ సమాజానికి ఇతోధికంగా సేవలు అందిస్తున్నట్లు .ప్రిన్సిపల్ దాసరి శిరీష, లెక్చరర్స్ కాశీరత్నం,చుండూరి బాబురావు, రాజశేఖర్, సుబ్బారావు, నరసింహరావు, హజరత్,మాధవరావు, మాధవి లక్ష్మి, సీతారావమ్మ,శివకుమారి,అక్రమ్,ఆసిఫ్,రాజు తదితరులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## సంప్రదాయాలకు ప్రతీక ఎడ్ల పందాలు

**చీరాల, మే 7, ప్రభాతవార్త**

శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం సందర్భంగా మద్దిపాడు మండలం దొడ్డవరం గ్రామంలో రాష్ట్ర స్థాయి ఒంగోలు జాతి వృషభరాజ్యములు బల ప్రదర్శన ప్రారంభోత్సవంలో చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంప్రదాయాలకు ప్రతీక ఎడ్ల పందాలు, ఒంగోలు జాతి ఎద్దుల శక్తి సామర్థ్యాలు నేడు దేశం గర్వించదగ్గ స్థాయిలో ఉన్నాయని అన్నారు. సంస్కృతి సంప్రదాయాలు అంతరించిపోకుండా ఇలాంటి పోటీలు నిర్వహించడం గొప్ప విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసిన దర్శి సీఐ రామారావు

**దొనకొండ, మే 7, ప్రభాతవార్త**

హత్య కేసులో నిందితుడిని దర్శి సీఐ వై.రామారావు గురువారం అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ వివరించారు. దొనకొండ మండలం రుద్రసముద్రం గ్రామానికి చెందిన కందుల చిన్న కాశయ్యను అతని సొంత అన్న అయిన కందుల పెద్ద కాశయ్య ఈనెల 5వ తేదీన కర్ర, రాయితో కొట్టి హత్య చేసి పరారయ్యాడు. ఈ ఘటనపై దొనకొండ పోలీసు స్టేషన్‌లో హత్య కేసు నమోదు అయింది. దర్యాప్తు చేపట్టిన దర్శి సీఐ రామారావు దర్యాప్తులో భాగంగా మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులను విచారించగా, అక్రమ సంబంధం గురించి అనుమానంతో కొంత కాలంగా మృతుడు చిన్న కాశయ్య మీద ముద్దాయి పెద్ద కాశయ్య పగ పెంచుకుని, ముందస్తు ప్రణాళికతోనే చిన్న కాశయ్యను కర్ర, రాయితో కొట్టి హత్య చేయడం జరిగింది. హత్య అనంతరం నిందితుడు పరారీలో ఉండగా, దర్శి సీఐ వై.రామారావు నిందితుడు పెద్ద కాశయ్యను పట్టుకుని అరెస్టు చేయడమైంది.

## ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత యుటీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు దాచూరి

**కనిగిరి, మే 7, ప్రభాతవార్త**

యూటీఎఫ్ కనిగిరి డివిజన్ కార్యాలయంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి టి.రమణారెడ్డి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ కాజా రహమతుల్లా ఉపాధ్యాయ సమస్యలపై, విద్యా రంగ పరిరక్షణకు కృషి చేసిన మహానుభావుడు దాచూరి రామిరెడ్డి అని ఆయన అన్నారు. ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన మహామేధావి రామిరెడ్డి అని యుటీఎఫ్ కుటుంబ సంక్షేమ డైరక్టర్ బి.రుసేంద్ర కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏడిట్ కమిటీ కన్వీనర్ షేక్ జిలాని, సాంస్కృతి కమిటీ కన్వీనర్ జెడ్ రమణయ్య, సీనియర్ నాయకులు వి.మాలకొండారెడ్డి, ఖాజా హుస్సేన్, రమేష్‌బాబు, కనిగిరి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.కోటిరెడ్డి, పి.నరసింహం, కోశాధికారి కేవీ బాలకృష్ణారావు, షేక్ ఖాశీం షరీఫ్, షేక్ ఖాజా నాయబ్ రసూల్, ఆర్.కాశయ్య, మురళీధర్‌రావు, డి.వెంకటేశ్వర్లు, ఎస్.వెంకటేశ్వర్‌రెడ్డి, పూజల తిరుపతయ్య, కేవీ రామారావు, సుబ్బారెడ్డి మండలాల కార్యకర్తలు పాల్గొన్నారు.

## వివాహ వేడుకలో పాల్గొన్న దామచర్ల సత్య

**టంగుటూరు, మే 7, ప్రభాతవార్త**

సంతనూతలపాడు నందు ముప్పరాజు వెంకట కృష్ణారావు- శకుంతల కుమారుడు శ్రీనివాసరావు- అనూషల వివాహ వేడుకలో రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్, జోనల్ కోఆర్డినేటర్ దామచర్ల సత్య పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## ఎడ్ల బలప్రదర్శనలో పాల్గొన్న దామచర్ల సత్య

**టంగుటూరు, మే 7, ప్రభాతవార్త**

మద్దిపాడు మండలం తెల్లబాడు, దొడ్డవరం గ్రామాల నందు శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆరాధన మహోత్సవం సందర్భంగా కి.శే మల్లిపెద్ది రామకృష్ణ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి ఒంగోలు జాతి వృషభరాజుల బలప్రదర్శన కార్యక్రమంలో రాష్ట్ర మారిటైంబోర్డు చైర్మన్, జోనల్ కోఆర్డినేటర్ దామచర్ల సత్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శిఅడకా స్వాములు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సొరంగంలోనే కార్మికులతో కలిసి భోజనం చేసిన మంత్రి నిమ్మల రామానాయుడు

**పెద్దదోర్నాల, మే 7, ప్రభాతవార్త**





వెలిగొండ ప్రాజెక్టు పర్యవేక్షణలో భాగంగా రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తన ప్రత్యేకతను చాటుకున్నారు. రాత్రి వేళలో సొరంగంలో జరుగుతున్న పనుల ప్రదేశానికి వెళ్లి అక్కడి పనులను ప్రత్యక్షంగా పరిశీలించిన ఆయన కార్మికులతో కలిసి సమయం గడిపారు. పనుల మధ్యలో విరామ సమయంలో సొరంగంలోనే ఇస్తరాకు చేత పట్టుకొని నిలబడి కార్మికులతో కలిసి భోజనం చేయడం అక్కడున్న వారిని ఆశ్చర్యానికి గురి చేసింది. మంత్రి సాధారణ వ్యక్తిలా కార్మికులతో మమేకమై, వారిసమస్యలను తెలుసుకుంటూ వారి కష్టాన్ని అభినందించారు. ప్రాజెక్టు పనులు పూర్తి చేయడమే లక్ష్యం అని, అందుకు అందరూ కలిసి పని చేయాలని సూచించారు. సొరంగంలోనే కార్మికులతో భోజనం చేయడం ద్వారా మంత్రి నిమ్మల రామానాయుడు తన సరళతను, కార్మికుల పట్ల ఉన్న అనుబంధాన్ని మరోసారి నిరూపించారని స్థానికులు ప్రశంసిస్తున్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన దద్దాల

**హనుమంతునిపాడు, మే 7, ప్రభాతవార్త**

మండల పరిధిలోని మోరావారిపల్లి గ్రామంలో యారవ రమణారెడ్డి- నాగేంద్రమ్మ దంపతుల కుమారుడు శ్రీనివాసరెడ్డి వెడ్స్ భార్గవిల వివాహానికి గురువారం కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ పాల్గొని మండల పార్టీ శ్రేణులతో కలిసి నూతన వధూవరులను ఆశీర్వదించి, వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలో యక్కంటి శ్రీనివాసులరెడ్డి, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, సానికొమ్ము మధుసూదన్‌రెడ్డి, శ్యామల సాంబిరెడ్డి, మోర ఆంజనేయులురెడ్డి, మోర సాంబశివారెడ్డి, మోరా లక్ష్మీరెడ్డి, యక్కంటి వరలక్ష్మీ, గంటా చెన్నారెడ్డి, కలికాయి నారాయణ, రుద్రపాటి సాల్మన్ రాజు, సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి, గొబ్బిళ్ళ శ్రీనివాస్ యాదవ్, మార్తాల శివారెడ్డి, ఉస్తెల చక్రవర్తి, ఉస్తెల పాపారావు, కంది నారాయణరెడ్డి, గంట జయరామిరెడ్డి, యర్రంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, గంటా నరసారెడ్డి, పోరెడ్డి కేసయ్య, కాటినేని సదాశివ, మోర రామిరెడ్డి, మోర మల్లిఖార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దేవుని రాజ్యం సమీపిస్తుంది.. మారు మనసుతో జీవించాలి

**పెద్దదోర్నాల, మే 7, ప్రభాతవార్త**

ప్రజలు ఆధ్యాత్మిక మార్గంలో నడుస్తూ దేవుని చిత్తానుసారం జీవించాలని పాస్టర్ వై.ఆశీర్వాదం పిలుపునిచ్చారు. దేవుని రాజ్యం సమీపిస్తుంది, మారు మనసు పొందుడి అనే వాక్యాన్ని ఆ ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో ఆచరించాలని ఆయన సూచించారు. పెద్దదోర్నాల మండల క్రిస్టియన్ పాస్టర్స్ అండ్ ఇవాంజెలిస్ట్ యూనియన్ సదస్సు గురువారం సున్నిపెంట ఏసుక్రీస్తు రాకడ ధ్వని ప్రార్థన మందిరంలో పాస్టర్ బొప్పూరి ప్రభుదాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సులో ముఖ్య అతిధులుగా హాజరైన పాస్టర్ బరిగల దేవయ్య, ఇవాంజెలిస్ట్ యోహాను మాట్లాడుతూ సమాజంలో కోల్పోతున్న భక్తి విశ్వాసాలు సువార్తికులపైన ఆధారపడి ఉందని, సత్య సువార్త సరిగా బోధించు ఉపదేశకులుగా ఉండాలని సూచించారు. దేవుని వాక్యము ద్వారా మనసులకు ప్రేమ, క్షమ, దయ, సేవాభావాలు పెంపొందినప్పుడే సమాజంలో నిజమైన శాంతి కలుగుతుందని తెలిపారు. పాస్టర్ ప్రభుదాసు మాట్లాడుతూ దేవుని వాక్యం వినడమే కాకుండా ఆచరణలో పెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రజల క్షేమం కొరకు పాస్టర్లు భక్తి శ్రద్ధలతో ప్రార్థించారు. ఈ సదస్సులో పాస్టర్ల యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## ఉర్దూ భాషతోనే ఉజ్వల భవిష్యత్తు - ఏఎంఓ జనాబ్ ఖాశీం

**చీరాల, మే 7, ప్రభాతవార్త**

విద్యార్థులు మాతృభాషతో పాటు అదనపు భాషలపై పట్టు సాధించడం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా అపారమైన విద్యా ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని బాపట్ల జిల్లా సమగ్ర శిక్షా అభియాన్ ఏఎంఓ జనాబ్ ఖాశీం పేర్కొన్నారు. గురువారం చీరాలలోని ఉర్దూ అకాడమీ లైబ్రరీ, సీటీసీ సెంటర్ నందు నిర్వహిస్తున్న ఆవో ఉర్దూ సీఖో( రండి ఉర్దూ నేర్చుకుందాం) వేసవిశిక్షణ తరగతులను ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉచిత శిక్షణకు సంబంధించి పుస్తకాలను పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉర్దూ భాషా వికాసానికి అనేక ప్రోత్సాహకాలు అందిస్తోందని, విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జీవో ప్రతినిధులు, సీటీసీ లైబ్రరీ సిబ్బంది, షమీమ్, నూర్జహాన్, పాల్గొన్నారు.

## రెవెన్యూ సమస్యలపై అర్జీలు స్వీకరణ

**చీరాల, మే 7, ప్రభాతవార్త**

ప్రతి నెలలో ఒక రెవెన్యూ గ్రామంలో 4 రోజులు అక్కడే ఉండి రెవెన్యూ సమస్యలు గురించి అర్జీలు తీసుకొని పరిష్కారం చేయాల్సిందిగా ప్రభుత్వం వారు ఉత్తర్వులు జారీ చేసినందున మే మాసంలో ఈ రోజు చిన్నగంజాం మండలం పరిధిలోని చింతగుంపల్లి గ్రామంలో మొదటి విజిట్ చేయడమైంది. సదరు కార్యక్రమంలో మొత్తం 11 అరీలను స్వీకరించారు. సబ్ డివిజన్ కొరకు 2, సర్వే కొరకు 4, పర్సనల్ ఇన్మఫరేషన్ కారకు 5 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జే.ప్రభాకరరావు, సర్వేయర్ లోకేష్, వీఆర్వో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఇంకొల్లులో మహిళా భద్రత, సామాజిక అంశాలపై అవగాహన సదస్సు

**చీరాల, మే 7, ప్రభాతవార్త**

ఇంకొల్లు పోలీసు స్టేషన్ పరిదిలో రోటరీ క్లబ్ చీరాల శక్తి బృందం ఆధ్వర్యంలో గురువారం భారీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇంకొల్లు సీఐ ఎం రామ్ నాయక్, ఎస్సై సురేష్ సిబ్బందితో పాటు ఐసీడీఎస్ ప్రతినిధులు, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం రూపొందించిన శక్తి యాప్ ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి మహిళా తమ మొబైల్‌లో ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని, ఆపద సమయంలో ఇది తక్షణ రక్షణ కవచంలా పని చేస్తుందని అవగాహన కల్పించారు. అత్యవసర సమయాల్లో 112,181, 1091, 1098 నంబర్ల గురించి వివరించారు. బాల్య వివాహాలు చట్టాల గురించి వివరించారు. శిరోరక్ష-ప్రాణరక్ష కార్యక్రమంలో భాగంగా వాహనదారులకు హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఏలూరి కృషితో అర్చకులకు ప్రభుత్వ భృతి

- ఆలయాలకు నెలకు రూ.10వేలు చొప్పున మంజూరు

**మార్టూరు, మే 7, ప్రభాతవార్త**

పర్చూరు ఎమ్మెల్యే ఏలూరిసాంబశివరావు కృషితో నియోజకవర్గంలోని పలు చిన్న దేవాలయాల్లో సేవలందిస్తున్న అర్చకులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న అర్చకులకు ప్రతి నెల భృతి అందించేలా దేవాదాయ ధర్మాదాయ శాఖ చర్యలు చేపట్టింది. ఎమ్మెల్యే ఏలూరిసాంబశివరావు ప్రత్యేక సిఫార్సుతో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామానారాయణరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. పర్చూరు నియోజకవర్గ పరిధిలోని ఇటీవల 3 ఆలయాలకు ధూపదీప నైవేద్యం పథకం కింద భృతి మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ప్రతి ఆలయానికి నెలకు రూ.10వేల చొప్పున ప్రభుత్వం అందించనుండగా, ఇందులో రూ.7వేలు గౌరవ వేతనం రూ.3వేల నైవేద్య ఖర్చుల కోసం కేటాయించినట్లు వెల్లడించారు. చిన్న ఆలయాల్లో సేవలందిస్తున్న అర్చకులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఎమ్మెల్యే ఏలూరి ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వినతికి స్పందించిన ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టి భృతి మంజూరు చేయడం పట్ల అర్చకులు , భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల 7 దేవాలయాలకు ఈ స్కీమ్ మంజూరు కాగా తాజాగా మరో మూడు దేవాలయాలకు చోటు లభించింది. వాటిలో బొబ్బేపల్లి శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం, మార్టూరు శ్రీ సీతా కోదండరామస్వామి దేవస్థానం, పోలూరు శ్రీ దత్తాత్రేయ స్వామి వారి దేవస్థానంలు ఉన్నాయి.

## శివరాంపురంలో రెవెన్యూ సదస్సు - 21 అర్జీలు స్వీకరణ

**మార్కాపురం, మే 7,ప్రభాతవార్త :**

మార్కాపురం మండలం శివరాంపురం గ్రామంలో గురువారం నిర్వహించిన ఒక గ్రామం - ఒక నెల - నాలుగు రెవెన్యూ సదస్సులు" కార్యక్రమంలో ప్రజల నుంచి మొత్తం 21 అర్జీలు స్వీకరించినట్లు తహశిల్దార్ కే చిరంజీవి తెలిపారు. సదస్సులో జాయింట్ పట్టాదారు పాస్‌బుక్ (జాయింట్ పట్టాదార్ పాసుబుక్) సంబంధిత 13 అర్జీలు, ఎంటైటిల్‌మెంట్ వేరియేషన్‌కు 2, ఆధార్ సీడింగ్‌కు 2, మ్యుటేషన్‌కు 2, రాస్తా సమస్యకు 1, ఎఫ్‌లైన్‌కు సంబంధించిన 1 అర్జీ అందినట్లు వెల్లడించారు. ప్రజల రెవెన్యూ సమస్యలను వేగంగా పరిష్కరించే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, వచ్చిన అర్జీలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తహశిల్దార్ చిరంజీవి తెలిపారు.

## 50% సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు

### రైతులు వినియోగించుకోవాలి- జిల్లా వ్యవసాయ అధికారి

**మార్కాపురం, మే 7, ప్రభాతవార్త :**

2025-26 సంవత్సరానికి గాను ఎస్‌ఎంఏఎం 2025-26 పథకం కింద మార్కాపురం జిల్లాకు వ్యవసాయ పనిముట్ల కొనుగోలుకు రూ.3 కోట్ల 15 లక్షలు మంజూరు చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు. ఈ పథకం ద్వారా రైతులకు 50శాతం వరకు సబ్సిడీపై వివిధ రకాల వ్యవసాయ యంత్రాలు అందించనున్నట్లు వెల్లడించారు. ఈ పథకం కింద మొత్తం 9రకాల వ్యవసాయ పనిముట్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. నేల బాగు చేసుకునే యంత్రాలు, విత్తనాలు వేసే యంత్రాలు, సస్యరక్షణ స్ప్రేయర్లు, మినీ ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు, మినీ దాల్ మిల్స్, మినీ రైస్ మిల్స్, పసుపు పాలిషింగ్ యంత్రాలు, కారం యంత్రాలు, ట్రాక్టర్ ట్రాలీలు రైతులకు రాయితీపై అందించబడతాయని పేర్కొన్నారు. సన్న, చిన్న, ఎస్సీ, ఎస్టీ మరియు మహిళా రైతులకు 50 శాతం సబ్సిడీ, పెద్ద రైతులకు 40 శాతం సబ్సిడీ వర్తిస్తుందని తెలిపారు. రైతులు నేరుగా మీ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు సమయంలో రైతు పాస్‌బుక్ జిరాక్స్, ఆధార్ జిరాక్స్, ఫోన్ నంబర్ తప్పనిసరిగా సమర్పించాలన్నారు. ట్రాక్టర్ సంబంధిత పనిముట్లకు ట్రాక్టర్ రిజిస్ట్రేషన్ పత్రాలు కూడా జత చేయాల్సి ఉంటుందని చెప్పారు. ఈ నెల 20వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించబడతాయని తెలిపారు. దరఖాస్తులు జిల్లా ఇన్‌చార్జి మంత్రి లాగిన్‌కు వెళ్లి ఆమోదం పొందిన అనంతరం జాయింట్ కలెక్టర్ లాగిన్‌కు చేరుతాయని, అనంతరం లాటరీ విధానంలో లబ్ధిదారులను ఎంపిక చేస్తారని వివరించారు. ఎంపికైన రైతులు 15 రోజులలోపు సబ్సిడీ మినహా రైతు వాటా మొత్తాన్ని ఆన్‌లైన్ ద్వారా చెల్లించాల్సి ఉంటుందని, లేనిపక్షంలో 16వ రోజున దరఖాస్తులు రద్దు చేయబడతాయని హెచ్చరించారు. అర్హులైన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి కోరారు.

## మార్కాపురంలో విషాదం..

### 11కెవి విద్యుత్ వైర్లకు తగిలి యువకుడి మృతి..

**మార్కాపురం, మే 7,ప్రభాతవార్త :**

మార్కాపురం పట్టణంలోని కంభం రోడ్డులో గురువారం విషాదకర ఘటన చోటుచేసుకుంది. విద్యుత్ షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందిన సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. శివాజీ నగర్‌కు చెందిన తంగిరాల శ్రీనివాసరెడ్డి (25) టెంట్ హౌస్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పెళ్లి కార్యక్రమాల కోసం లైటింగ్ పనులు నిర్వహించేందుకు కంభం రోడ్డులోని ఎస్‌ఐసి కార్యాలయం పక్క వీధిలో ఉన్న ఓ ఇంటికి వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు 11 కెవి హైటెన్షన్ విద్యుత్ వైర్లకు తగలడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే స్పందించి మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి (జీజీహెచ్)కు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## సబ్ కోటా కేటాయించకుంటే ఓబీసీ మహిళలకు ఉద్యమమే శరణ్యం

### బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాడి శ్వేత

**గిద్దలూరు, మే 7 ప్రభాతవార్త :**

చట్టసభలలో మహిళలకు ఉమ్మడిగా కేటాయిస్తున్న 33శాతం రిజర్వేషన్లలో, ఓబీసీ మహిళలకు సబ్ కోటా కేటాయించకుంటే జాతీయ రాష్ట్ర స్థాయిలలో సమరశీల పోరాటాలే శరణ్యమంటూ,ఆంధ్ర ప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాడి శ్వేత అన్నారు. అనాదిగా అన్ని రంగాలలోఅన్ని విధాల వెనుకకు నెటబడ్డ ఓబిసి మహిళలకు మహిళా రిజర్వేషన్లలో సబ్ కోటా లేకపోతే ప్రస్తుత మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల రక్తసంబంధీకులతోనే చట్టసభలు నిండిపోతాయన్నారు. మహిళల్లో సగానికి పైగా ఉన్న ఓబీసీ మహిళలకు సామాజిక న్యాయమందించకుండా నారీ శక్తి బలంగా ఐక్యం కాలేదని,దానితో వికసిత్ భారత్ సాధ్యపడదన్నారు. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చట్టసభలలో మహిళా రిజర్వేషన్ల" అంశాన్ని చర్చించేందుకు ప్రత్యేక శాసనసభ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు మీడియా ద్వారా ప్రకటించడం సంతోషదాయకమన్నారు. ఆ సమావేశాలలో బీసీ మహిళలకు సబ్ కోటా నిచ్చేలా కేంద్ర ప్రభుత్వ సహకారంతో పార్లమెంటుచే రాజ్యాంగ సవరణ చేయించి, మహిళా రిజర్వేషన్ చట్టాన్ని 2029 నుండే అమలు చేసేలా చర్యలు గైకొని చరిత్ర పుటలలో చిరస్థాయిగా నిలిచిపోవాలని ఆశిస్తున్నామన్నారు. రాష్ట్ర ఓబీసీల ఓట్లతో సీట్లు గెలిచి, గద్దె నెక్కే పాలకప్రతిపక్ష ఎంపీలు ఓబిసి మహిళలకు సబ్ కోటా ఇవ్వకుండా దగా చేసి, పార్లమెంటులో అడుగు పెట్టనీయకపోవడం ఉమ్మడి కుట్రగా ఓబీసీలు భావిస్తున్నారన్నారు. ఓబీసీలే మా పార్టీలకు వెన్నెముకలంటూ, తమది ఒబీసీల పార్టీ అంటే,కాదు తమదేనంటూ పోటీపడే నేటి రాజకీయ వ్యవస్థలోని అన్ని పార్టీలు ఓబీసీలకు సామాజిక అన్యాయం చేస్తూనే ఉన్నారన్నారు. అందుకే ఓబిసి మహిళలు తమ వాణిని బలంగా వినిపించేందుకు రాష్ట్రవ్యాప్త సమరశీల పోరాటాలకు శ్రీకారం చుట్టేందుకు నడుం బిగించాలని జాడి శ్వేత పిలుపునిచ్చారు.

## గిద్దలూరులో ఘనంగా జెడ్పీ బాలికల పాఠశాల విజయోత్సవ ర్యాలీ

**గిద్దలూరు, మే 07 ప్రభాతవార్త :**

గిద్దలూరు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు పదవ తరగతి ఫలితాలలో అద్భుత ప్రతిభ కనబరిచి కార్పొరేట్ స్థాయిలో విజయాలు సాధించడంతో పాఠశాల ఆధ్వర్యంలో ఘనంగా విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పాఠశాల నుంచి రాచర్ల గేట్ సెంటర్ వరకు విద్యార్థినులు, ప్రధానోపాధ్యాయులు పోలా నాగభూషణ్ రెడ్డి, ఉపాధ్యాయులు కలిసి ఉత్సాహభరితంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సబ్ కలెక్టర్ పులి శ్రీనివాసులు ప్రారంభించి విద్యార్థినులను అభినందించారు. ఈ విద్యాసంస్థలో మొత్తం 186 మంది పరీక్షలకు హాజరుకాగా 168 మంది ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థిని సి ఉమాదేవి 600 మార్కులకు గాను 582 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిందన్నారు. విద్యార్థినుల విజయానికి ఉపాధ్యాయుల కృషి, ప్రత్యేక తరగతులు, ప్రతిరోజూ పునశ్చరణ పరీక్షలు, సందేహ నివృత్తి వంటి అంశాలు కీలకంగా నిలిచాయి. అలాగే తల్లిదండ్రుల ప్రోత్సాహం, పాఠశాలలో పాటిస్తున్న క్రమశిక్షణ కూడా మంచి ఫలితాలకు దోహదపడ్డాయన్నారు. ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన మధ్యాహ్న భోజనం, ఉచిత సర్వేపల్లి రాధాకృష్ణన్ కిట్లు, పరిశుభ్రమైన తరగతి గదులు, అన్ని విద్యా సదుపాయాలు విద్యార్థుల అభివృద్ధికి తోడ్పడుతున్నాయని విద్యార్థినులు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లోనూ నాణ్యమైన విద్య అందుతోందని, కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోనని ఈ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయని స్థానికులు అభిప్రాయపడ్డారు. బాలికల విద్యాభివృద్ధికి గిద్దలూరు జెడ్పీహెచ్‌ఎస్ ఆదర్శంగా నిలుస్తోందని పలువురు ప్రశంసించారు.

## రైతులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలి

**గిద్దలూరు, మే 7 ప్రభాతవార్త :**

విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు డీలర్స్ రైతులకు విక్రయించిన వాటికి బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని మండల వ్యవసాయాధికారి కార్యాలయం మండలంలోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు డీలర్స్‌కి గురువారం ఏవో అధ్యక్షతన సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని, స్టాక్ రిజిస్టర్లు, ఇన్వాయిస్లు, వీ ఫార్మ్స్, ప్రిన్సిపుల్ సర్టిఫికెట్, లైసెన్స్‌లు విధిగా ఉంచుకోవాలని, రైతులకు అవసరమైన మేర మాత్రమే ఎరువులు ఇవ్వవలెనని, గోడౌన్లలో ఎరువులు ఉంచుకొని కృత్రిమ కొరత సృష్టించరాదని, ఎంఆర్‌పి ధరల కన్నా మించి అమ్మ రాదని తెలియజేశారు. ఎక్కడైనా చట్టానికి అతిక్రమించిన యెడల కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

## వలలు పంపిణీ

**చీరాల, మే 7, ప్రభాతవార్త**

మండలం వెలుగు డీఆర్‌డీ ఆధ్వర్యంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు శారదమ్మ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రాజెక్టు డైరక్టర్ బి.సింగయ్య ముఖ్య అతిధిగా హాజరవడం జరిగింది. ఆయన మాట్లాడుతూ 100 మందికి కోటి రూపాయలు విలువ చేసేటువంటి వలలు పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉంది. ఈ కోటి రూపాయలు సీఐఎఫ్ శ్రీనిధి సహకారంతో ఇవ్వడం జరిగిందని, దీని ద్వారా ఈ వంద మంది కుటుంబాలకు వారి యొక్క జీవనోపాధి మెరుగుపరుచుకోవడానికి ఇది ఎంతో ఉపయోగపడుతుందని, పీఎం అజయ్ అనే పథకం కింద ఐదు మందికి ఆటోలు కూడా ఇవ్వడం జరిగింది. ఈ పథకంలో యూనిట్‌కాస్ట్ 3 లక్షల ఎనిమిది వేల రూపాయలను అందులో 50 వేల రూపాయలు సబ్సిడీ బెనిఫిషియల్ కాంట్రిబ్యూషన్ ఫోన్ మిగిలిన రూ.2,20,000రూపాయలు వడ్డీ లేకుండా కట్టాలని అన్నారు. ఈ మండలంలో గవర్నమెంట్ ప్రవేశపెట్టిన పథకాలను సక్రమంగా ఉపయోగించుకున్నారు అని కొనియాడారు. పొద వీరయ్య మాట్లాడుతూ మా ఎమ్మెల్యే, మా ముఖ్యమంత్రి మహిళా పక్షపాతి కాబట్టి మహిళల కోసం ఎన్నో వరాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నర శ్రీను, సత్యం, సందు శ్రీను సుబ్బారావు పాల్గొన్నారు.

ong-12_ong-12.qxd 5/7/2026 11:59 PM Page 1



## రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ వారి ఆధ్వర్యంలో కుట్టు మిషన్లు పంపిణీ

**అద్దంకి, మే 7, ప్రభాతవార్త :** రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అద్దంకి వారి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ఐదు గంటలకు స్థానిక రోటరీ కార్యాలయంలో హైదరాబాద్ షార్ ప్రాజెక్ట్స్ వారి సహకారంతో రోటరీ క్లబ్ జుబ్లీహిల్స్, రోటరీ క్లబ్ పర్ఫ్యూర్ సెంట్రల్ , రోటరీ క్లబ్ ఇంకొల్లు సెంట్రల్ సహకారంతో 8 మంది పేద మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో రోటరీ అధ్యక్షులు బాచిన శివ ధర పూర్ణ చంద్రరావు, కార్యదర్శి అళహరి హరిప్రసాద్, పూర్వాధ్యక్షులు చప్పిడి వీరయ్య,అద్దంకి లేవీ ప్రసాద్, గూడా మహాలక్ష్మి రెడ్డి, అంజాద్బాషా, డాక్టర్ కాజావలి,జాగర్లమూడి శివకుమారి, కొల్లా భువనేశ్వరి, పసుపులేటి ఆంజనేయులు, ఊటుకూరు రామకోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోటరీ అధ్యక్షులు పూర్ణచంద్రరావు మాట్లాడుతూ మహిళలందరూ ఈ కుట్టు మిషన్ల సద్వినియోగం చేసుకొని వాళ్ళ కుటుంబ ఆర్థిక అభివృద్ధికి సహాయపడాలని కోరారు.



## మెరుగైన రెవెన్యూ సేవలు అందించడమే లక్ష్యం

**- జెసి కల్పనా కుమారి**

**కొరిసపాడు , మే 7, ప్రభాతవార్త :** ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని రెవెన్యూ అధికారులను జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి ఆదేశించారు. గురువారం ఆమె మండలంలో ని అనమనమూరు గ్రామం లో ఒక గ్రామం, ఒక నెల, నాలుగు సందర్శనలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ సేవలు అందించడంలో క్షేత్రస్థాయి సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని నిరక్ష్యం వహిస్తే సహించబోనని హెచ్చరించారు. గ్రామంలో రీ సర్వే జరిగినప్పుడు సిబ్బంది నిరక్ష్యం వల్ల తమ భూముల కొలతలలో కొన్నిలోపాలు జరిగాయని గ్రామస్తులు ఆమె కు విన్నవించుకున్నారు. ఆ భూ సమస్యలను సిబ్బంది దృష్టికి తీసుకొని వెళ్లి విస్తీర్ణాల లోపాలను సరిచేయాలని విన్నవించు కున్నా కాలయాపన జరుగుతుంది కానీ ఫలితం శూన్యం అని ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన జెసి కల్పనాకుమారి తక్షణమే వారి సమస్యలను పరిష్కరించాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. అలాగే పాస్ పుస్తకాలలో విస్తీర్ణానికి సంబంధించి ఏమైనా లోపాలు ఉంటే వాటిని సరిచేసి ఖచ్చితమైన వివరాలతో కొత్త పాసుపుస్తకాలు వచ్చేలా వాటిని ప్రభుత్వానికి సరెండర్ చేయాలని సూచించారు. ఈ సమస్యలను పరిష్కరించడానికి తహసిల్దార్లకు, విఆర్ఓలకు రెవెన్యూ సిబ్బందికి అవగాహన సమావేశాలు నిర్వహించాలని ఆర్డీవో జాన్సన్ కు ఆమె సూచించారు. ఈ రెవెన్యూ సభలలో వారితోపాటు కొరిసపాడు తాసిల్దార్ జీవి సుబ్బారెడ్డి ,ఎంపీడీవో రాజ్యలక్ష్మి,గ్రామ మాజీ సర్పంచ్ జంపు హరిబాబులతో పాటు రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



## మిషన్ ఎయిడ్స్ సురక్ష కార్యక్రమ లక్ష్యాన్ని డిసెంబర్1కి పూర్తి చేయాలి

**- మూడు జిల్లాల దిశ మేనేజర్ ఎస్ కె అమీన్**

**కొరిసపాడు, మే 7, ప్రభాతవార్త :** మిషన్ ఎయిడ్స్ సురక్ష కార్యక్రమం 95.95.99 లక్ష్యాన్ని డిసెంబర్ ఒకటో తారీకు కల్లా పూర్తి చేయాలని ప్రకాశం, నెల్లూరు ,మార్కాపురం జిల్లాల దిశ క్లస్టర్ ప్రివెన్షన్ మేనేజర్ ఎస్ కె అమీన్ పేర్కొన్నారు. గురువారం హెల్ప్ పి యు మేదరమెట్లప్రధాన కార్యాలయంలో అద్దంకి. నాగులపాడు, కొరిసపాడు, మార్టూరు మండలాల ఔట్రిచ్ వర్కర్లకు ,పిఈలకు ఎయిడ్స్ నియంత్రణ నిర్మూలనకై చేపడుతున్న కార్యక్రమాలపై బివి సాగర్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో పాల్గొన్న క్లస్టర్ ప్రీవినీస్ మేనేజర్ ఎస్ కే అమీన్ మాట్లాడుతూ హెచ్ఐవి వ్యాధిగ్రస్తులు జిల్లాలో రోజురోజుకు పెరుగుతున్నా రన్నారు.ప్రివెన్షన్ యూనిట్లలోట్లపనిచేసే సిబ్బంది హెచ్ఐవి వ్యాధిగ్రస్తులను సకాలంలో గుర్తించినట్లయితే వారికి అవసరమైన మందులు వాడటం ప్రారంభించి, తద్వారా వారి జీవితకాలం పెంచే అవకాశం ఉంటుందన్నారు. సిబ్బంది ఇది ఒక ఉద్యోగంలా కాకుండా సేవా భావంతో పని చేయాలని పిలుపునిచ్చారు. హెచ్ఐవి బారిన పడిన వారి వివరాలను గోప్యంగా ఉంచాలని, హెచ్ఐవి ఎయిడ్స్ జాతీయ టోల్ ఫ్రీ నెంబర్ 1097 పై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలంటూ ముగించారు. ఈ అవగాహన కార్యక్రమంలో వారితో పాటు సిబ్బంది బి దుర్గా సురేంద్ర ,మహేష్ ,మల్లీశ్వరి, కృష్ణవేణి ,దుర్గాభవాని పామిత, టి శ్రావణి తదితరులు పాల్గొన్నారు.



## ప్రసన్నాంజనేయస్వామికి రెండు ఎయిర్ కూలర్లు బహుకరణ

**అద్దంకి, మే 7, ప్రభాతవార్త :** సింగరకొండలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో గురువారం రెండు ఎయిర్ కూలర్లు బహుకరించారు. కోరిసపాడు మండలం పమిడిపాడు గ్రామ వాస్తవ్యులు బైసాని వెంకటేశ్వరావు జ్ఞాపకార్థం వారి ధర్మపత్ని సీతారామమ్మ, వారి కుమారుడు కోదండరామ ప్రసాద్, ధర్మపత్ని ప్రత్యూష వారి కుటుంబ సభ్యులు, అద్దంకి వాస్తవ్యులు పొట్టి శ్రీరాములు రోడ్డులో వ్యాపారం నిర్వహిస్తున్న నాగసూరి ఆంజనేయులు జ్ఞాపకార్థం వారి భార్య కుమారులు దేవస్థానానికి పాలక మండల అధ్యక్షుడు చుండూరు మురళీ సుధాకర్ రావుకి అందజేశారు. ఎయిర్ కూలర్లు టిటిడి కళ్యాణమండపంలో అవసరమని దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ మదమంచి తిమ్మనాయుడు, తెలుపగా దాతలు సహకరించి లక్ష రూపాయలు విలువ గల కూలర్స్ దేవస్థానానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు ఆకుల లక్ష్మికోటేశ్వరమ్మ కోటేశ్వరరావు, అత్తులూరి రమేష్ బాబు, అర్చకులు చినబాబు పాల్గొన్నారు.



## ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందించాలి

**- జెసి కల్పనా కుమారి అదేశం**

**అద్దంకి, మే 7, ప్రభాతవార్త** ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందించటమే లక్ష్యంగా క్షేత్రస్థాయి సిబ్బంది పనిచేయాలని జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి స్పష్టం చేశారు. ఈ విషయంలో నిరక్ష్యంగా ఉంటే సహించబోనని ఆమెహెచ్చరించారు. ఒక గ్రామం ఒక నెల నాలుగు సందర్శనలు కార్యక్రమంలో భాగంగా గురువారం ఆమె అద్దంకి మండలం ధర్మవరం గ్రామంలోనూ, కొరిశపాడు మండలం అనమనమూరు గ్రామంలోనూ ప్రత్యేక రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలపై ఆరా తీశారు. ధర్మవరం గ్రామంలో ఖాతా, సర్వే నంబర్ పై రెవిన్యూ అధికారులు స్పష్టత ఇవ్వకపోవడం, ఎల్.పి.ఎం. పెండింగ్ ఉండడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఉపయోగకరంగా పనిచేయాలని వారిని హెచ్చరించారు. ఆమె వెంట ఆర్డిఓ జాన్సన్, స్థానిక రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.



## దైవజనుల ఆత్మీయ సమావేశం

**యర్రగొండపాలెం, మే 7, ప్రభాతవార్త** దైవజనుల ఆత్మీయ సమావేశం యర్రగొండపాలెం నియోజకవర్గ స్థాయిలో జరిగిన ఈ సమావేశం యర్రగొండపాలెం పట్టణంలోని యువానియల్ ఫిలోషింగ్ చర్చి నందు మండల కమిటీ అధ్యక్షులు మాకం అబ్రహం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి నియోజకవర్గ స్థాయి పాస్టర్ల అధ్యక్షులు చేదూరి లక్ష్మయ్య ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పాస్టర్ల సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎం.ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.



## తీసుకున్న రుణాలు ద్వారా డ్వాక్రా మహిళలు ఆర్థికాభివృద్ధిని సాధించాలి

**- జిల్లా వెలుగు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరక్టర్ నారాయణ వెల్లడి**

**సంతనూతలపాడు(మద్దిపాడు), మే 7, ప్రభాతవార్త** 2026-27 ఆర్థిక సంవత్సరంలో ముఖ్యంగా డ్వాక్రా మహిళలు తీసుకున్న తమ తమ జీవనోపాధిని పెంపొందించుకోవాలని జిల్లా వెలుగు, డీఆర్‌డీఏ శాఖల ప్రాజెక్టు డైరక్టర్ టి.నారాయణ పేర్కొన్నారు. మద్దిపాడు మండలం లింగంగుంట గ్రామంలో గురువారం నాడు ఎస్‌హెచ్‌జీ సభ్యులకు వార్షిక జీవనోపాధుల ప్రణాళిక తయారి విధానంపై జరిగిన సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా విచ్చేసి అనంతరం ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి మద్దిపాడు మండల వెలుగు, డీఆర్‌డీఏ శాఖల ఏపీఎం కాకుమాను సుబ్బారావు అధ్యక్షత వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఒక కుటుంబంలోని ఒక సభ్యురాలు తప్పనిసరిగా ఎంటర్ప్రునూర్ స్థాపన చేయాలని దీని ద్వారా కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెంది సమాజంలో మహిళలకు సముచిత లభిస్తుందని జిల్లా పీడీ నారాయణ వెల్లడించారు. జీవనోపాధిలో ప్రణాళిక నమోదు చేయుటకు మొబైల్ యాప్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వడం జరిగిందని, ఈ యాప్ ద్వారా ప్రతి ఒక్క సభ్యురాలు రుణాలు అందిపుచ్చుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జిల్లా పీడీ నారాయణ వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రెరు జెస్ కార్యక్రమంలో అందరూ అభివృద్ధి చెందాలని ముఖ్యంగా ఈ జీవనోపాధుల ప్రణాళిక ద్వారా జరుపుటకు నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏసీఎల్పీ ద్వారా ప్రతి మహిళ రుణాలు అందిపుచ్చుకొని మంచి జీవనోపాధులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎస్‌సీఆర్‌పీ, డీఆర్‌డీఏ ద్వారా అమలు చేస్తున్న పథకాలు శ్రీనిధి, ఉన్నతి, సామాజిక పెట్టుబడి నిధి(సీఐఎఫ్), జీఎస్టీలకు అందిస్తున్న పీఎం అజయ్, పీఎం ట్రైకార్ వంటి రుణాలను స్వయం సహాయ సంఘంలో ఉన్న సభ్యులు విరివిగా ఉపయోగించుకొని ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను సద్వినియోగపర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీలు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదాలు నివారణపై గ్రామస్తులకు అవగాహన

**సంతనూతలపాడు,మే 7, ప్రభాతవార్త** జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు సంతనూతలపాడు మండలం మైనంపాడు గ్రామంలో ముఖ్యంగా వాహనదారులకు రోడ్డు ప్రమాదాలు నివారణకు సంతనూతలపాడు సబ్ ఇన్‌స్పెక్టర్ వేజెండ్ల అజయ్‌బాబు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్క వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తద్వారా ప్రమాదాలు నివారింపబడునని సబ్ ఇన్‌స్పెక్టర్ అజయ్‌బాబు పేర్కొన్నారు. 18 సంవత్సరాలు నిండకుండా ఉన్న పిల్లలు, విద్యార్థులు వాహనాలు నడపకూడదని ఇదే విధంగా తల్లిదండ్రులు ఆరికి వాహనాలు ఇవ్వకూడదని ఆయన తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని ఎస్సై హెచ్చరించారు. ప్రతి ఒక్క వాహనదారులు హెల్మెట్ కలిగి ఉండి లైసెన్స్‌లు ఉండాలని లేని పక్షంలో కేసులు నమోదు చేయనున్నట్లు ఎస్సై అజయ్‌బాబు వెల్లడించారు.



## సెన్సస్-2027 సర్వేను పరిశీలించిన ఎంపీడీవో సురేష్‌బాబు

**సంతనూతలపాడు, మే 7, ప్రభాతవార్త** జిల్లా కలెక్టర్ రాజాబాబు ఆదేశాల మేరకు సంతనూతలపాడు మండలం మైనంపాడు గ్రామ పంచాయతీలోని బీసీ కాలనీలో గురువారం నాడు సెన్సెస్ 2027 సర్వేను ఎంపీడీవో డి.సురేష్‌బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్యుమరేటర్లకు ఎంపీడీవో సురేష్‌బాబు పలు సూచనలు ఇచ్చారు. సెన్సస్ 2027కు సంబంధించి పక్కా సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అభివృద్ధి అధికారి ఆవులయ్య, ఎన్యుమరేటర్స్, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.



## చిత్తూరు ఎమ్మెల్యే జగన్‌మోహన్‌ను సత్కరించిన కమ్మ సేవా సంఘం జిల్లా అధ్యక్షులు మురళీకృష్ణ

**సంతనూతలపాడు, మే 7, ప్రభాతవార్త** ఒంగోలులోని కమ్మ సేవా సంఘం అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ ఇంటికి గురువారంనాడు చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ విచ్చేయగా ఆయనను ఘనంగా మురళీకృష్ణ సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమ్మ సేవా సంఘం నాయకులు పోతినేని శ్రీనివాసరావు అలియాస్ పీఎస్ఆర్ తదితరులు పాల్గొన్నారు.



## కిశోరి వికాసంపై మండల స్థాయిలో అధికారులతో ఎంపీడీవో ప్రసాద్ సమీక్ష

**సంతనూతలపాడు(మద్దిపాడు), మే 7, ప్రభాతవార్త** మద్దిపాడు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నాడు కిశోరి వికాసం శిక్షణ తరగతులపై మండల స్థాయిలో అధికారులతో ఎంపీడీవో డీఎస్పీ ప్రసాద్ సమీక్షించారు. జూన్ 9వ తేదీ వరకు సచివాలయాల పరిధిలో షెడ్యూల్ మేరకు కిశోరి వికాసం వేసవి శిక్షణ తరగతులు జరుగునని ఎంపీడీవో ప్రసాద్ పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో కమిటీ సభ్యులందరూ పాల్గొని బాలికలకు ముఖ్యంగా ప్రత్యేక అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మద్దిపాడు తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి, మద్దిపాడు మండల వెలుగు ఏపీఎం కాకుమాను సుబ్బారావు, పలు శాఖల అధికారులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.



## గురువారెడ్డిపాలెం గ్రామ సభలో రెండు అర్జీలు

**సంతనూతలపాడు, మే 7, ప్రభాతవార్త** సంతనూతలపాడు మండలం గురవారెడ్డి పాలెం గ్రామంలో గురువారం నాడు తహసీల్దార్ ఎస్ఎల్ నారాయణరెడ్డి అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామ సభకు రెండు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఒకటి పట్టాదారు పాస్ పుస్తకం, మరొకటి ల్యాండ్ డిస్పోట్‌కు సంబంధించి అర్జీ వచ్చినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో డి.సురేష్‌బాబు, గ్రామ టీడీపీ నాయకులు నలుమాల్పు సుబ్బారెడ్డి, వీఆర్వో రామాంజనేయులు, గ్రామ సర్వేయర్ శివ మోహన్ పాల్గొన్నారు.



## జీవనోపాధుల ప్రణాళికను పక్కాగా తయారు చేయాలి

**- జిల్లా వెలుగు, డీఆర్‌డీఏ పీడీ నారాయణ వెల్లడి**

**సంతనూతలపాడు, మే 7, ప్రభాతవార్త** సమగ్ర జీవనోపాధుల ప్రణాళికలను పక్కాగా తయారు చేయాలని జిల్లా వెలుగు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరక్టర్ టి.నారాయణ పేర్కొన్నారు. సంతనూతలపాడు మండల మహిళా సమాఖ్య కార్యాలయంను గురువారం నాడు జిల్లా పీడీ నారాయణ ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. మండల సమాఖ్య రికార్డులను పీడీ నారాయణ పరిశీలించారు. సిబ్బంది పనితీరును మండల వెలుగు ఏపీఎం టి.బాబురావును అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది గ్రూపు సభ్యులకు వార్షిక జీవనోపాధుల ప్రణాళికను తయారు చేయుటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వివరించారు. సభ్యుల అవసరమైన జీవనోపాధులకు కావాల్సిన నిధులు ఉన్నతి, సీఐఎఫ్, స్త్రీ నిధి, బ్యాంకు రుణం, పొదుపుల నుండి అంతర్గత రుణాలను అర్హతను బట్టి ఏ విధంగా పొందవచ్చు వారికి వివరంగా అవగాహన కల్పించారు.సమగ్ర జీవనోపాధుల సర్వే తయారు చేయుటలో ఎలాంటినిర్లక్ష్యం వహించరాదని అలా వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకొనబడతాయని ప్రాజెక్టు డైరక్టర్ నారాయణ హెచ్చరించారు. ప్రతి ఒక్క సిబ్బంది ఫీల్డ్‌లో ఉండి పని చేయాలని ఆయన ఆదేశించారు. సీసీలు, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.



## గంజిగుంట శ్రీనివాసులు ఇంట మంగళవాయిద్యాలు

**కనిగిరి, మే 7, ప్రభాతవార్త** కనిగిరి మండలం బుడ్డాయిపల్లి గ్రామంలో గురువారం కనిగిరి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు గంజిగుంట శ్రీనివాసులు కుమారుడి వివాహ వేడుక ఘనంగా నిర్వహించారు. మంగళ వాయిద్యాల నడుమ సంప్రదాయబద్ధంగా జరిగిన ఈ వేడుకకు రాజకీయ, సామాజిక ప్రముఖులు హాజరై సందడి చేశారు. ఈ కార్యక్రమానికి ఒంగోలు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కుటుంబ సభ్యులను అభినందించిన ఆయన.. వధూవరులు ఆనందంగా ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. అలాగే టీడీపీ నాయకులు కొండ కృష్ణారెడ్డి, బజాజ్ ఓబుల్‌రెడ్డి, ముచ్చుమారి చెంచురెడ్డి, గంగవరపు నాగిరెడ్డి తదితరులు పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామ ప్రజలు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై వివాహ వేడుకను ఉత్సాహభరితంగా మార్చారు.



## యాంత్రీకరణకు ప్రభుత్వం రైతులకు చేయూత

**- కనిగిరి నియోజకవర్గానికి రూ.76.99 లక్షల సబ్సిడీ మంజూరు**

**కనిగిరి, మే 7, ప్రభాతవార్త** వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతులను ప్రోత్సహిస్తూ రైతులకు ప్రభుత్వం యాంత్రీకరణ పథకం ద్వారా చేయూత అందిస్తోంది. కనిగిరి నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాల పంపిణీ కోసం ప్రభుత్వం రూ.76.99 లక్షలు కేటాయించినట్లు సహాయ వ్యవసాయ సంచాలకులు షేక్ జైనులాబ్దిన్ గురువారం తెలిపారు. మండలాల వారీగా కనిగిరికి రూ.20.80 లక్షలు, సీఎస్‌పురంకు రూ.5.61 లక్షలు, హనుమంతునిపాడుకు రూ.12.43 లక్షలు, పామూరుకు రూ.11.04లక్షలు, వెలిగండ్లకు రూ.14.47 లక్షలు, పెద్దచెర్లోపల్లికి రూ.12.64 లక్షలు కేటాయించినట్లు వివరించారు. పథకం కింద ట్రాక్టర్ పరికరాలు, సేద్యపు గొర్రులు, తైవాన్ స్ప్రేయర్లు, పవర్ వీడర్లు, బ్రష్ కట్టర్లు, 40 హెచ్‌పీ ట్రాక్టర్లు, ట్రక్కులు, మల్టీ క్రాప్ త్రెషర్లు రాయితీపై అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు, మహిళా రైతులకు 50శాతం సబ్సిడీ, ఐదు ఎకరాల కంటే ఎక్కువ భూమి ఉన్న రైతులకు 40శాతం సబ్సిడీ వర్తిస్తుందని చెప్పారు. సొంత భూమి కలిగి ఉండటంతో పాటు గత మూడు సంవత్సరాల్లో కనీసం మూడు సీజన్లలో సీసీఆర్‌సీ కార్డు ద్వారా పంట నమోదు చేసిన రైతులు ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు. రైతులు నేరుగా ఆన్‌లైన్ ద్వారా లేదా రైతు సేవా కేంద్రాల ద్వారా ఈనెల 19వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా నిర్వహించేందుకు జాయింట్ కలెక్టర్ సమక్షంలో ఈనెల 28 నుంచి 25వ తేదీ లమధ్య ఆన్‌లైన్ లాటరీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికైన రైతులు 15 రోజుల్లోగా రైతు వాటా నగదును ఆన్‌లైన్‌లో చెల్లించి పరికరాలను పొందవచ్చని తెలిపారు.



## సామాజిక దార్శనికుడు అమరజీవి దాచూరి రామిరెడ్డి

**పీసీపల్లి, మే 7, ప్రభాతవార్త** సామాజిక దార్శనికులు, అమరజీవి దాచూరి రామిరెడ్డిని యూటీఎఫ్ మార్కాపురం జిల్లా అధ్యక్షులు ఖాజా రహంతుల్లా అన్నారు. గురువారం పీసీపల్లిలో రామిరెడ్డి పదో వర్ధంతి వారోత్సవాలు సందర్భంగా ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు మజ్జిగ, బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. ఏసుబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చినవరిమడుగులో రామిరెడ్డి ఉపాధ్యాయుడుగా పని చేసిన రోజుల్లో రాత్రి వేళ పెద్దలకు చదువు నేర్పించారని అన్నారు. గ్రామంలో ఉన్న వారికి చదువుతో పాటు సామాజిక చైతన్యం కల్పించడం, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా సైన్స్ పట్ల ప్రచారం నిర్వహించడం చేశారన్నారు. ఆ రోజుల్లో చినవరిమడుగులో ఎక్కువ మందికి చదువుతో పాటు ధాన్యం అమ్మకం, కొనుగోలు లెక్కలు తెలుసుకోవడం, వడ్డీ లెక్క తెలుసుకోవడం, అంటు రోగాల పట్ల అవగాహన కల్పించడం, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా సైన్స్ ప్రచారం చేశారని తెలిపారు. ఉపాధ్యాయులు చదువు చెప్పడంతో పాటు తల్లిదండ్రులతో కూడా సంబంధాలు పెట్టుకుని చైతన్యపరుస్తూ సమాజాభివృద్ధిలో భాగస్వాములు అయ్యే విధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. రామిరెడ్డి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఏ.పోతులూరయ్య, ఆడిట్ కమిటీ సభ్యులు జిలాని, పీసీపల్లి మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.ఏసుబాబు, సీహెచ్ రమేష్, కే.సత్యనారాయణ, మాధవరావు, వై.తిరుపతయ్య, స్వర్ణ రమణయ్య, పీవీ రమణయ్య, మధుబాబు, సీఐటీయు నాయకులు మహేష్, స్టీఫెన్ పాల్గొన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ యషితతో కలిసి రోగులకు మజ్జిగ, బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు.



## ద్వారశిల వారి కళ్యాణ వేడుకలో దద్దాల

**పామూరు, మే 7, ప్రభాతవార్త** పామూరు టైన్‌లో ద్వారశిల నాగిరెడ్డి- నారాయణమ్మ కుమారుడు వినయ్ రెడ్డి వివాహ వేడుకలో గురువారం కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వరుడుని ఆశీర్వదించి, వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకలో గంగసాని హుస్సేన్‌రెడ్డి, కల్లూరి రామిరెడ్డి, గట్ల విజయభాస్కర్‌రెడ్డి, ఒకే రెడ్డి, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, అంబటి కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## పుట్టా వారి కళ్యాణ వేడుకలో పాల్గొన్న దద్దాల

**పామూరు, మే 7, ప్రభాతవార్త** పామూరు మండలం అయ్యవారిపల్లి పుట్టా మాలకొండయ్య- విజయమ్మ కుమార్తె హేమలత వివాహ వేడుకలో గురువారం పార్టీ శ్రేణులతో కలిసి వైఎస్సార్‌సీపీ కనిగిరి నియోజకవర్గం ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధువును ఆశీర్వదించి, వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గంగసాని హుస్సేన్‌రెడ్డి, కల్లూరి రామిరకెడ్డి, ఒకే రెడ్డి, గట్ల విజయభాస్కర్, అంబటి కొండారకెడ్డి, గాండ్లపర్తి ఆదినారాయణ రెడ్డి, సైకం సుబ్బారెడ్డి, తాతిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, తాతిరెడ్డి నర్సారెడ్డి, బోయల్ల మాధవరెడ్డి, తుమ్మ రవి, కందుల సుబ్బారెడ్డి, తిండి మహేంద్ర, ఉడుముల లక్ష్మీరెడ్డి, మహంకాళి విజయ్, కందుల నారాయణరెడ్డి, తాతిరెడ్డి మాల్యాద్రి, చింతలపూడి గురుస్వామి, కందుల మల్లిఖార్జునరెడ్డి, పుట్టా మాలకొండారెడ్డి, తాతిరెడ్డి రవి, పుట్ట చిన్న కొండారెడ్డి, యర్రంరెడ్డి మల్లిఖార్జునరెడ్డి, చింతలపూడి బ్రహ్మరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## చెరుకుపల్లి వారి కళ్యాణ వేడుకలో దద్దాల

**పామూరు, మే 7, ప్రభాతవార్త** పామూరు టౌన్ చెరుకుపల్లి రాజమోహన్‌రెడ్డి- విజయలక్ష్మి కుమారుడు సుధీర్‌రెడ్డి కళ్యాణ వేడుకలో పాల్గొని నూతన వరుడిని ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపిన వైఎస్సార్‌సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్. ఈ వేడుకలో గంగసాని హుస్సేన్‌రెడ్డి, కల్లూరి రామిరెడ్డి, గట్ల విజయభాస్కర్‌రెడ్డి, ఒకే రెడ్డి, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, అంబటి కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## బండారు వారి వివాహ వేడుకలో పాల్గొన్న బొల్లా

**పామూరు, మే 7, ప్రభాతవార్త** పామూరులోని అనిల్ గార్డెన్ నందు జరిగిన బండారు వారి వివాహ వేడుకలో పాల్గొని టీడీపీ మండల అధ్యక్షుడు బొల్లా నరసింహారావు, పోకా వినోద్ కుమార్‌లు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.





# సువేందు పిఏ హత్య కేసుపై సిఐడి దర్యాప్తు

**కోల్‌కత్తా, మే 7:** పశ్చిమ బెంగాల్ బీజేపీ నేత, ప్రతిపక్ష నాయకుడు సువేందు అధికారి వ్యక్తిగత సహాయకుడు (పీఏ) చంద్రనాథ్ రథ్ దారుణ హత్య కేసు దర్యాప్తును రాష్ట్ర సీఐడీ (క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్) చేపట్టింది. నార్త్ 24 పరగణాల జిల్లాలో జరిగిన ఈ ఘటనపై సీఐడీ అధికారులు విచారణను స్వీకరించారు. ఈ హత్య వెనుక పక్కా ప్రణాళిక ఉన్నట్లు ప్రాథమిక ఆధారాలు సూచిస్తున్నాయి. బుధవారం రాత్రి బీజేపీ కార్యక్రమం ముగించుకుని చంద్రనాథ్ రథ్ తన కారులో ఇంటికి బయలుదేరారు. మధ్యమ్‌గ్రామ్‌లోని దోహరియా క్రాసింగ్ వద్దకు రాగానే, ఆయన వాహనాన్ని మరో కారు అడ్డగించింది. అదే సమయంలో హెల్మెట్ ధరించిన ఓ వ్యక్తి బైక్‌పై వచ్చి రథ్ కారు పక్కన ఆపి, అతి సమీపం నుంచి విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో రథ్ అక్కడికక్కడే మృతి చెందగా, కారు డ్రైవర్ బుద్ధదేబ్ బేరా తీవ్రంగా గాయపడ్డారు. దాడికి ఉపయోగించిన కారు, బైక్‌లకు నకిలీ నంబర్ ప్లేట్లు ఉన్నాయని రాష్ట్ర డీజీపీ సిద్ధ్ నాథ్ గుప్తా ధ్రువీకరించారు. ఘటనా స్థలం నుంచి కొన్ని వాడిన తూటాలు, బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నామని, దర్యాప్తు దృష్ట్యా మరిన్ని వివరాలు వెల్లడించలేమని ఆయన తెలిపారు. గురువారం ఉదయం ఘటనా స్థలానికి చేరుకున్న సీఐడీ అధికారులు, ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. సమీపంలోని సీసీటీవీ కెమెరా ఫుటేజీలను, హౌసింగ్ కాంప్లెక్స్ బయట ఉన్న కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఈ హత్యకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్ ద్వారా కొన్ని కీలక ఆధారాలు లభించినట్లు పోలీసులు తనకు తెలిపారని సువేందు అధికారి పేర్కొన్నారు.

**433 మంది అరెస్టు..1100మందికిపైగా నిర్బంధం**

తన కొడుకును కోల్పోయిన చంద్రనాథ్ తల్లి హాసిరాణి రథ్ విలేకరుల ముందు కన్నీరుమున్నీరయ్యారు. మమతా బెనర్జీ ఓటమిని తట్టుకోలేక తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) నాయకులే పక్కా ప్లాన్‌తో తన కొడుకును హింసించి చంపారని ఆమె ఆరోపించారు. మే 4 తర్వాత మిమ్మల్ని ఢిల్లీ నాయకులు కూడా కాపాడలేరంటూ టీఎంసీ నేతలు ముందు నుంచే బెదిరింపులకు పాల్పడ్డారని ఆమె పేర్కొన్నారు. నిందితులకు ఉరిశిక్ష కాకుండా జీవిత ఖైదు పడాలని, అప్పుడే వారు చేసిన తప్పుకు రోజూ కుమిలిపోతారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ హత్య తర్వాత బెంగాల్ పోలీసులు రాష్ట్రవ్యాప్తంగా భారీగా తనిఖీలు చేపట్టారు. ఇప్పటివరకు 433 మందిని అరెస్టు చేయగా, 1,100 మందికి పైగా వ్యక్తులను నిర్బంధంలో ఉంచారు. ఈ ఘటనపై 200కు పైగా ఎఫ్ఐఆర్లు నమోదయ్యాయి. ఈ ఘటనపై సువేందు అధికారి స్పందిస్తూ.. ఇది పక్కా ప్లాన్ చేసి చేసిన రాజకీయ హత్య అని, తనకు ఇది వ్యక్తిగతంగా తీరని లోటని పేర్కొన్నారు. అయితే బీజేపీ శ్రేణులు సంయమనం పాటించాలని ఆయన కోరారు. మరోవైపు టీఎంసీ ఈ ఆరోపణలను ఖండిస్తూ, ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదని, కోర్టు పర్యవేక్షణలో విచారణ జరగాలని డిమాండ్ చేసింది.

## కేరళం సిఎం రేసులో త్రిముఖ పోరు

- మీరే తేల్చండి.. కాంగ్రెస్ ఎల్పీ ఏకగ్రీవ తీర్మానం
- సతీషన్, వేణుగోపాల్, రమేష్ చెన్నితాల మధ్య పోటీ



**తిరువనంతపురం, మే 7:** కేరళం తదుపరి ముఖ్యమంత్రి పదవి కోసం పోరు ఇప్పుడు పూర్తిగా న్యూఢిల్లీకి మారింది. నాయకత్వ సమస్యపై తుది నిర్ణయం తీసుకునే అధికారాన్ని పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు అప్పగిస్తూ కాంగ్రెస్ శాసనసభ పక్షం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. గురువారం తిరువనంతపురంలో నిర్వహించిన కీలక శాసనసభ పక్ష సమావేశంలో, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు సన్నీ జోసెఫ్ సంప్రదాయబద్ధంగా ఒకే వాక్యంతో కూడిన తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, వి.డి. సతీసన్ దానిని బలపరచడంతో అది ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. కానీ సీనియర్ నాయకుడు సతీసన్, ఏఐసిసి ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్, సీనియర్ నాయకుడు రమేష్ చెన్నితాల మధ్య తీవ్రమైన త్రిముఖ పోటీ నెలకొని ఉంది. పార్టీ పరిశీలకులైన అజయ్ మాకెన్, ముకుల్ వాస్నిక్, దీపా దాస్ మున్షీ, హైకమాండ్‌కు తమ నివేదికను సమర్పించే ముందు, మద్దతు సరళిని, రాజకీయ ప్రాధాన్యతలను అంచనా వేయడానికి కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలను వ్యక్తిగతంగా కలిశారు. గత ఐదేళ్లుగా ప్రతిపక్షానికి నాయకత్వం వహించిన సతీసన్ ప్రజల్లో అత్యంత ప్రముఖ అభ్యర్థిగా నిలిచినప్పటికీ, శాసనసభ పక్షంలో సంఖ్యాబలం వేణుగోపాల్‌కు అనుకూలంగా ఉందని భావిస్తున్నారు. సతీసన్‌ను ముఖ్యమంత్రిగా నియమించాలని డిమాండ్ చేస్తూ తిరువనంతపురం, ఎర్నాకులం, తదితర అనేక కేంద్రాలలో కాంగ్రెస్ కార్యకర్తలు కాగడా ప్రదర్శనలు నిర్వహించారు. ప్రభుత్వ వ్యతిరేకతను ఆయన విజయవంతంగా ఓట్లుగా మార్చారని ఆయన మద్దతుదారులు వాదిస్తున్నారు. అయితే, సంస్థాగత బలం, కేంద్ర నాయకత్వంతో ఉన్న సాన్నిహిత్యం వేణుగోపాల్‌కు అనుకూలంగా పనిచేస్తున్నట్లు కనిపిస్తోంది. ప్రభావవంతమైన రాష్ట్ర నాయకులతో పాటు, కొత్తగా ఎన్నికైన పలువురు ఎమ్మెల్యేలు ఆయన అభ్యర్థిత్వానికి మద్దతు తెలిపారని వర్గాలు సూచిస్తున్నాయి. ఢిల్లీలో అపారమైన పలుకుబడి కలిగిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎ.కె. ఆంటోనీ జోక్యం ఈ పోటీకి మరో మలుపును జోడిస్తోంది. ఢిల్లీలో ఆయన అభిప్రాయానికి అపారమైన ప్రాధాన్యత ఉంది. ఆంటోనీ, చెన్నితాల సీనియారిటీ, పరిపాలనా అనుభవాన్ని ఉటంకిస్తూ ఆయనకు అనుకూలంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. సీనియర్ నాయకుడు వి.ఎం. సుధీరన్ మద్దతు చెన్నితాల వాదనను మరింత బలోపేతం చేసింది. దశాబ్ద కాలం తర్వాత కాంగ్రెస్ భారీ మెజారిటీతో తిరిగి అధికారంలోకి రావడంతో, కేరళ తదుపరి ముఖ్యమంత్రిని ప్రకటించే ముందు ప్రజాభిప్రాయం, శాసనసభ మద్దతు, సీనియారిటీల మధ్య సమతుల్యం సాధించే సున్నితమైన సమస్యను ఇప్పుడు పార్టీ హైకమాండ్ ఎలా పరిష్కరిస్తుందో వేచిచూడాలి.

## ఆర్థికసంక్షోభంలోకి నెట్టిన 'ఆపరేషన్ సిందూర్'

**ఇస్లామాబాద్, మే 7:** పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థను ఆపరేషన్ సిందూర్ తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది. 2025 మే నెలలో చేపట్టిన ఈ చర్య కారణంగా పెట్టుబడులు, పర్యాటకం, విమానయానం, ఎగుమతుల రంగాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని గ్రీస్‌కు చెందిన గ్రీస్ సిటీ టైమ్స్ అనే మీడియా సంస్థ తన నివేదికలో వెల్లడించింది. ఈ ఆపరేషన్ కారణంగా పాకిస్థాన్‌లో ద్రవ్యోల్బణం పెరిగి, ఆర్థిక వృద్ధి మందగించి, ఇప్పటికే బలహీనంగా ఉన్న ఆర్థిక పునాదులు మరింత క్షీణించాయని నివేదిక విశ్లేషించింది. అధిక అప్పులు, విదేశీ మారకద్రవ్య నిల్వల కొరత, అంతర్జాతీయ సహాయంపై ఆధారపడటం వంటి సమస్యలతో ఇప్పటికే సతమతమవుతున్న పాక్ ఆర్థిక వ్యవస్థపై ఆపరేషన్ సిందూర్ మరింత భారాన్ని మోపింది. గత మూడేళ్లుగా ఆ దేశ జీడీపీ వృద్ధి సగటున 3 శాతం వద్దే స్తబ్దుగా ఉందని, పారిశ్రామిక ప్రగతి మందగించిందని నివేదిక గుర్తుచేసింది. ఈ సైనిక చర్యతో దేశంలో అనిశ్చితి పెరిగి, పెట్టుబడిదారులు వెనక్కి తగ్గారు. ఈ సైనిక చర్య ప్రత్యక్ష ప్రభావం పర్యాటక రంగంపై పడింది. అంతర్జాతీయ పర్యాటకులు తమ పర్యటనలను రద్దు చేసుకోవడంతో హోటళ్లు, రెస్టారెంట్లు, టూర్ ఆపరేటర్లు, పర్యాటకంపై ఆధారపడిన స్థానిక వర్గాలు తీవ్రంగా నష్టపోయాయి. మరోవైపు, విమానయాన రంగం కూడా తీవ్ర ఒడుదొడుకులను ఎదుర్కొంది.

## కేరళం సిపిఎంలో ముసలం

- విజయన్‌పై పెరుగుతున్న వ్యతిరేకత - ఎల్‌డిఎఫ్ ఘోరపరాజయంపై విమర్శలు
- పార్టీని కాపాడండంటూ పోస్టర్లు - రంగంలోకి సీనియర్ నేత జయరాజన్

**తిరువనంతపురం, మే 7:** కేరళం అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైన తర్వాత ఎల్‌డిఎఫ్‌లో లుకలుకలు బయటపడుతున్నాయి. ప్రధానంగా ఎల్‌డిఎఫ్‌కు నేతృత్వం వహిస్తున్న సిపిఎం నాయకత్వం, ముఖ్యంగా మాజీ సిఎం పినరయి విజయన్‌పై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇటీవల ఎన్నికల్లో ఎల్‌డిఎఫ్ కేవలం 35 సీట్లకే పరిమితమైంది. దీంతో పినరయి విజయన్‌పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సిపిఎం ప్రస్తుత రాష్ట్ర నాయకత్వంపైనా పార్టీలో ఆగ్రహం వ్యక్తమవుతోంది. విజయన్, రాష్ట్ర సిపిఎం కార్యదర్శి ఎం.వి. కేరళలో వామపక్షాలు తమ చరిత్రలోనే అత్యంత ఘోరమైన ఎన్నికల



పరాజయాన్ని చవిచూసిన తర్వాత, గోవిందన్ పార్టీలోనే అపూర్వమైన విమర్శలను ఎదుర్కొంటున్నారు. సిపిఎంకు సుదీర్ఘకాలంగా సైద్ధాంతిక కంచుకోటగా పరిగణించబడుతున్న కన్నూర్‌లో, జయరాజన్ తిరిగి నాయకత్వంలోకి రావాలని డిమాండ్ చేస్తూ పోస్టర్లు వెలిశాయి. ప్రముఖంగా ప్రదర్శించబడిన ఒక నినాదం, "పి. జయరాజన్‌ను పిలవండి, పార్టీని కాపాడండి" అని ఉంది. కన్నూర్ జిల్లా కార్యదర్శి కె.కె. రాగేష్‌పై కూడా కార్యకర్తలలో అసంతృప్తి పెరుగుతోంది.

# తమిళనాట రిసార్టు రాజకీయం

- ఎమ్మెల్యేలను రిసార్టుకు తరలించిన అన్నా డిఎంకె
- టివికెకు మద్దతు ప్రసక్తి లేదు : కెపి మునుసామి

**చెన్నై, మే 7:** తమిళనాడు రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. నూతనంగా ఎన్నికైన 12 మందికి పైగా అన్నాడీఎంకే ఎమ్మెల్యేలను పుదుచ్చేరిలోని ఒక రిసార్టుకు తరలించడంతో తీవ్ర గందరగోళం మొదలైంది. నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే)కు ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతు ఇచ్చే విషయంలో పార్టీలో విభేదాలు తలెత్తాయనే ఊహాగానాలకు ఈ పరిణామం బలం చేకూర్చింది. ఈ వార్తలను అన్నాడీఎంకే నాయకత్వం తీవ్రంగా ఖండించింది. ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) తొలుత మౌనంగా ఉండటంతోనే ఈ గందరగోళం తలెత్తిందని అన్నాడీఎంకే ర్గాలు తెలిపాయి. ఆయన మౌనం కారణంగా కొందరు ఎమ్మెల్యేలు విజయ్‌కు మద్దతు ఇవ్వాలని భావిస్తున్నారనే ప్రచారం జరిగిందని అంగీకరించాయి. ఇప్పుడు ఈపీఎస్ తన వైఖరిని స్పష్టం చేశారని, టీవీకేకు మద్దతు ఇచ్చే ప్రసక్తే లేదని



పార్టీలో ఎలాంటి విభేదాలు లేవని, అంతా సవ్యంగానే ఉందని స్పష్టం చేసింది. టీవీకే తమ ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టే అవకాశం ఉందని, వారిని కాపాడుకోవడానికే రిసార్టుకు తరలించామని వివరణ ఇచ్చింది. "టీవీకేకు అన్నాడీఎంకే ఎలాంటి మద్దతు ఇవ్వడం లేదు. పార్టీ చీఫ్ ఈపీఎస్ ఆమోదంతో ఈ విషయం ప్రకటిస్తున్నాను" అని సీనియర్ నేత కేపీ మునుసామి స్పష్టం చేశారు. ఎన్నికల ఫలితాల తర్వాత విజయ్ పార్టీకి మద్దతుపై పార్టీ అధినేత చెప్పడంతో ఎమ్మెల్యేలంతా ఆయన నిర్ణయానికి కట్టుబడి ఉన్నారని ఆ వర్గాలు వివరించాయి.

అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే 108 స్థానాలు గెలుచుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. అయితే, ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 118 మంది ఎమ్మెల్యేల మ్యాజిక్ ఫిగర్‌కు 10 స్థానాల దూరంలో నిలిచిపోయింది. దీంతో కాంగ్రెస్ (5), వామపక్షాలు (4), వీసీకే (2) పార్టీల మద్దతు కూడగట్టే ప్రయత్నాల్లో విజయ్ ఉన్నారు. బీజేపీతో గతంలో పొత్తు పెట్టుకున్న అన్నాడీఎంకే మద్దతు కోరడానికి విజయ్ సిద్ధంగా లేరని, దానివల్ల భవిష్యత్తులో బీజేపీ ప్రభావం తన ప్రభుత్వంపై పడుతుందని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 118 మంది ఎమ్మెల్యేల జాబితాను సమర్పిస్తేనే ఆహ్వానిస్తామని విజయ్‌కు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ సూచించినట్లు సమాచారం. దీంతో తమిళనాట ప్రభుత్వ ఏర్పాటుపై ఉత్కంఠ కొనసాగుతోంది.

### ప్రభుత్వ ఏర్పాటుకు టివికెను ఆహ్వానించాలి! డిఎంకె, సిపిఐ, విసికె పార్టీలు గవర్నర్‌కు విజ్ఞప్తి

అసెంబ్లీ ఎన్నికల లో సింగిల్ లార్జెస్ట్ పార్టీగా నిలిచిన టీవీకే పార్టీ కి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే అవకాశం ఇవ్వాలని, ఆ పార్టీ అధ్యక్షుడు విజయ్ ని ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడానికి ఆహ్వానించాలని డీఎంకే, సీపీఐ, వీసీకే పార్టీలు గవర్నర్ కు విజ్ఞప్తి చేశాయి. అసెంబ్లీలో తన మెజారిటీని నిరూపించుకోవడానికి అవకాశం ఇవ్వాలని సూచించాయి. తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటుపై గవర్నర్ మెజారిటీ మెలిక పెడుతుండటంతో ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో జాప్యం జరుగుతోంది. ఈ క్రమంలో వివిధ పార్టీలు స్పందించాయి. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి విజయ్‌కి అవకాశమివ్వాలని వీసీకే గవర్నర్‌ను కోరింది. ప్రభుత్వానికి సహకరించే అవకాశంపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి సింగిల్ లార్జెస్ట్ పార్టీగా టీవీకేకు తొలుత అవకాశమివ్వాలని డీఎంకే కూడా స్పష్టం చేసింది. గవర్నర్ రాజ్యాంగ పరిధిలో వ్యవహరించాలని సీపీఐ డిమాండ్ చేసింది. ప్రజలు ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ ఇవ్వలేదని, కానీ 108 స్థానాలు గెలుచుకున్న టీవీకేకు మొదట అవకాశమివ్వాలని పేర్కొన్నది. విజయ్ ఇప్పటికే రెండుసార్లు గవర్నర్‌ను కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ఆహ్వానించాలని కోరారని గుర్తుచేసింది. విజయ్ ప్రమాణ స్వీకారం చేయకముందే మెజారిటీ నిరూపించుకోవాలని గవర్నర్ ఒత్తిడి చేయడం సరికాదని అభిప్రాయపడింది. దీన్ని సీపీఐ వ్యతిరేకిస్తోందని పేర్కొన్నది. అత్యధిక స్థానాలు గెలిచిన విజయ్‌కి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే అవకాశమివ్వాలని, ఆ తర్వాత సభలో మెజారిటీ నిరూపించుకోవడానికి ఛాన్స్ ఇవ్వాలని కోరింది. తమిళనాడులో ఏకైక అతిపెద్ద పార్టీగా టీవీకేను ప్రజలు ఎన్నుకున్నారని, అందువల్ల విజయ్‌కి మొదట అవకాశం ఇవ్వాలని వీసీకే అధ్యక్షుడు తిరుమావళవన్ అన్నారు. గవర్నర్ ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం గందరగోళానికి తావిస్తోందని తిరుమావళన్ అన్నారు. విజయ్‌ని ఆహ్వానించకపోవడం ఆమోదయోగ్యం కాదని చెప్పారు. ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా రాజకీయ ఒత్తిడి తెస్తున్నారేమోనని ప్రజలకు అనుమానం కలుగుతోందని తమిళనాడు యూత్ కాంగ్రెస్ మరో ప్రకటనలో పేర్కొన్నది. గవర్నర్ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని, అత్యధిక మెజారిటీ ఉన్న పార్టీని ప్రభుత్వ ఏర్పాటు కోసం ఆహ్వానించాలని సూచించింది. ప్రభుత్వ ఏర్పాటుకు టీవీకేను ఆహ్వానించకపోతే యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన చేపడతామని, గవర్నర్ ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించింది.



## ఆపరేషన్ సిందూర్‌తో మన సైనిక సత్తాపై పాక్‌కు వణుకు

**యేడాది పూర్తయిన సందర్భంగా మీడియాతో త్రివిధ దళాధిపతులు**

**జైపూర్, మే 7:** ఆపరేషన్ సింధూర్ చేపట్టి నేటికి ఏడాది అయిన సందర్భం పురస్కరించుకుని త్రివిధ దళాధిపతులు గురువారం మీడియాతో మాట్లాడారు. ఎయిర్ మార్షల్ అవదేశ్ కుమార్ భార్తి మాట్లాడుతూ మే 7వ తేదీన ఇండియా 9 ఉగ్ర క్యాంపులను టార్గెట్ చేసిందన్నారు. పాకిస్థాన్ సైనిక చర్యకు దిగడంతో ఆ దాడుల్ని మరింత విస్తరించినట్లు చెప్పారు. 9 ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసిన ఆధారాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ ఆ ఆధారాలను పరిశీలించవచ్చు అని భార్తి అన్నారు. పాకిస్థాన్‌కు చెందిన 11 ఎయిర్‌ఫీల్డ్స్‌ను టార్గెట్ చేసినట్లు చెప్పారు. ఆ దేశానికి చెందిన 13 విమానాలను కూల్చినట్లు తెలిపారు. సుమారు 300 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఓ యుద్ధ విమానాన్ని కూడా కూల్చినట్లు ఆయన తెలిపారు. ఆ సంక్షోభ సమయంలో భారత్‌కు ఎటువంటి నష్టాన్ని పాక్ కలిగించలేకపోయిట్లు చెప్పారు. లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ మాట్లాడుతూ 9 ఉగ్ర క్యాంపుల్లో ఉన్న సుమారు 100 మంది ఉగ్రవాదులు హతమైనట్లు పేర్కొన్నారు. ఆపరేషన్ సింధూర్‌లో పాకిస్థాన్‌కు చెందిన వందకుపైగా ఉగ్రవాదులు హతమైనట్లు చెప్పారు. పాకిస్థాన్ మిలిటరీ చాలా పెద్ద సంఖ్యలో తమ దివంగత సైనికులకు అవార్డులు అందజేసిందని, దీని ద్వారా ఆ దేశ మిలిటరీ చావుదెబ్బ తిన్నట్లు అర్థమవుతోందన్నారు.



## గంగూలీవైపు బిజెపి చూపు! సౌరభ్ ఇంటికి పిఎన్ పాఠక్!

**కోల్‌కత్తా, మే 7:** పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో గత 15 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా అత్యంత కీలకమైన మార్పులు చోటుచేసుకుంటున్న తరుణంలో, బెంగాల్ టైగర్ సౌరవ్ గంగూలీ బీజేపీ నేత పీఎన్ పాఠక్‌తో భేటీ కావడం రాజకీయ వర్గాల్లో పెను సంచలనంగా మారింది. రాష్ట్రంలో మమతా బెనర్జీ ప్రభుత్వం ఓటమి చెంది, బీజేపీ ఘనవిజయం సాధించిన నేపథ్యంలో గంగూలీ నివాసంలో జరిగిన ఈ సుదీర్ఘ భేటీ ప్రాధాన్యతను సంతరించుకుంది. సౌరవ్ గంగూలీ నివాసంలో పీఎన్ పాఠక్ సుమారు రెండు గంటలకు పైగా గడపడం కేవలం మర్యాదపూర్వక భేటీ మాత్రమే కాదని, దీని వెనుక బలమైన రాజకీయ కారణాలు ఉండవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. బెంగాల్‌లో అత్యంత ప్రజాదరణ ఉన్న గంగూలీని పార్టీలోకి ఆహ్వానించడం ద్వారా తమ పట్టును మరింత బలపరుచుకోవాలని బీజేపీ భావిస్తున్నట్లు తెలుస్తోంది.

## హార్ముజ్ తెరిచేందుకు ఇరాన్ - అమెరికా ఒప్పందం

### త్వరలో తెరుచుకోనున్న జలసంధి

**రియాద్, మే 7:** ప్రపంచ దేశాలకు ఇదో శుభవార్త.. కొద్దిరోజులుగా మూసి ఉన్న హార్ముజ్ జలసంధి త్వరలోనే తెరుచుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ జలసంధి విషయంలో అమెరికా, ఇరాన్ మధ్య ఒప్పందం తుది దశకు చేరుకున్నట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ సంస్థల అంచనా ప్రకారం.. హార్ముజ్ జలసంధి విషయంలో అమెరికా, ఇరాన్ మధ్య చర్చలు కొనసాగుతున్నాయి. ఈ అంశంపై గురువారం రెండు దేశాలు ఒక ఒప్పందానికి వచ్చినట్లు తెలుస్తోంది. హార్ముజ్‌ను వీలైనంత త్వరగా, దశలవారీగా అందుబాటులోకి తేవాలని ఇరు దేశాలు నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఒకటి రెండు రోజుల్లోనే హార్ముజ్ విషయంలో పూర్తి ఒప్పందం కుదిరి, జలసంధి అందుబాటులోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది. అలాగే, ఇక్కడ చిక్కుకుపోయిన నౌకల్ని కూడా ప్రయాణించేందుకు అనుమతివ్వనున్నారు. ఇరాన్, అమెరికా మధ్య యుద్ధం ప్రారంభమైన ఫిబ్రవరి 28 నుంచి హార్ముజ్ మూసి ఉన్న సంగతి తెలిసిందే. మధ్యలో కొన్ని గంటలు మాత్రమే హార్ముజ్‌ను ఇరాన్ తెరిచింది. ఆ తర్వాత వెంటనే తిరిగి మూసేసింది. తర్వాత అమెరికా కూడా ఈ జలసంధిని దిగ్బంధించింది.



ఈ మధ్య కాలంలో కొన్ని నౌకలకు మాత్రం అనుమతి లభించింది. ఇక, ఇక్కడ చిక్కుకుపోయిన నౌకల్ని విడిపించేందుకు అమెరికా ప్రాజెక్టు ఫ్రీడమ్ ప్రారంభించిన సంగతి తెలిసిందే. వాణిజ్య నౌకలకు రక్షణగా, అమెరికా యుద్ధ విమానాల్ని మోహరించాలనుకుంది. కానీ, ఇరాన్‌తో చర్చల్లో ముందడుగు పడటంతో ప్రాజెక్టు ఫ్రీడమ్‌ను ఆపేస్తున్నట్లు అమెరికా తెలిపింది.

మరోవైపు ఇరాన్‌తో చర్చలు సానుకూలంగా సాగుతున్నాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు.

## నితీశ్ కుమారునికి మంత్రి పదవి

- కేబినెట్‌ను విస్తరించిన సిఎం సామ్రాట్ చౌదరి
- న- ముగ్గురు మాజీ సిఎంల తనయులు కొత్త కేబినెట్‌లోకి
- హాజరైన ప్రధాని మోడీ, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, అమిత్‌షా ప్రభృతులు



**పాట్నా, మే 7:** బీహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి మంత్రివర్గం గురువారం నాడు పూర్తిస్థాయిలో విస్తరించబడింది. ఈ విస్తరణలో ప్రధాన ఆకర్షణగా, మాజీ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ కుమారుడు నిశాంత్ కుమార్ మంత్రిగా చేరడం నిలిచింది. చౌదరి మంత్రివర్గంలో ఇప్పుడు ముగ్గురు మాజీ ముఖ్యమంత్రుల కుమారులు ఉన్నారు. నితీష్ కుమార్ కుమారుడు నిశాంత్, జగన్నాథ్ మిశ్రా కుమారుడు నితీష్ మిశ్రా, జితన్ రామ్ మాంఝీ కుమారుడు సంతోష్ కుమార్ సుమన్. ఈ ముగ్గురూ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హాజరయ్యారు. మాజీ ముఖ్యమంత్రి నితీష్ కుమార్, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, జె.పి. నడ్డా, జితన్ రామ్ మాంఝీ, చిరాగ్ పాశ్వాన్, బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, అలాగే ఆర్‌ఎల్ఎం అధినేత ఉపేంద్ర కుష్వాహ్ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరైన వారిలో ఉన్నారు. కార్యక్రమం ముగిసిన తర్వాత, ప్రధాని మోడీ, నితీష్ కుమార్, నిశాంత్‌లతో సంభాషించడం కనిపించింది. మొత్తంగా, 32 మంది మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. వీరిలో బిజెపి నుండి 15 మంది, జెడి(యు) నుండి 13 మంది, ఎల్‌జెపి(ఆర్‌వి) నుండి ఇద్దరు, హెచ్ఎఎం(ఎస్), ఆర్‌ఎల్ఎం నుండి ఒక్కొక్కరు చొప్పున ఉన్నారు. ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి, జెడి(యు)కి చెందిన ఇద్దరు డిప్యూటీలు బిజేంద్ర ప్రసాద్ యాదవ్, విజయ్ కుమార్ చౌదరిలతో కలిపి మొత్తం 35 మంది అయ్యారు. దీంతో మంత్రివర్గంలో గరిష్టంగా అనుమతించబడిన 36 మంది సభ్యుల సంఖ్య కంటే కేవలం ఒకరు తక్కువగా ఉన్నారు. సీనియర్ బిజెపి నాయకుడు, మాజీ ఆరోగ్య శాఖ మంత్రి మంగళ్ పాండేకు కొత్త మంత్రివర్గంలో చోటు దక్కలేదు. అయితే, జాతీయ స్థాయిలో ఆయనకు కీలకమైన సంస్థాగత పదవిని ఇవ్వవచ్చని అధికారులు తెలిపారు.

## ఓహియో రాష్ట్ర గవర్నర్ ప్రైమరీ ఎన్నికల్లో వివేక్ రామస్వామి విజయం



**వాషింగ్టన్, మే 7:** పారిశ్రామికవేత్త నుంచి రాజకీయ నాయకుడిగా మారిన ఇండో అమెరికన్ వివేక్ రామస్వామి మంగళవారం ఒహి యో రిపబ్లికన్ గవర్నర్ ప్రైమరీ ఎన్నికల్లో నిర్ణయాత్మక విజయాన్ని సాధించారు. ఒకప్పుడు ఆయన అమెరికా అధ్యక్ష స్థానానికి రిపబ్లికన్ అభ్యర్థిగా పోటీపడతారని అందరూ భావించారు. కాగా ప్రైమరీ ఎన్నికల్లో విజయం సాధించిన రామస్వామి నవంబర్‌లో జరిగే ఎన్నికల్లో కొవిడ్ సమయంలో తన వైద్య సేవలతో ప్రముఖ నేతగా గుర్తింపు పొందిన డెమోక్రాటిక్ అభ్యర్థి అమీఆక్టన్‌పై సులభంగా విజయం సాధిస్తారని అంచనాలు ఉన్నాయి. హెల్త్‌టెక్ పారిశ్రామికవేత్త అయిన వివేక్ రామస్వామి రిపబ్లికన్ నామినేషన్‌కోసం క్యాసీ పుష్‌ను ఓడించారు. 2024 అధ్యక్ష ఎన్నికల్లో వివేక్‌రామస్వామి ప్రాధాన్యతను పెంచుకున్నారు. డెమొక్రట్ అభ్యర్థి అమి ఆక్టన్ తన పార్టీ నామినేషన్‌ను సాధించగలిగారు. ఓహియో రాష్ట్రాన్ని మరింత అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషిచేస్తానని ఆమెప్రకటించారు.

ఓహియో మాజీ పబ్లిక్ హెల్త్ డైరెక్టర్‌గా కూడా ఆమె పనిచేసారు. ఇండియానాలో కూడా ట్రంప్ ప్రతిపాదించిన అభ్యర్థి నామినేట్ అయ్యారు. ఇదిలా ఉంటే ఓహియో రాష్ట్రంనుంచి ప్రస్తుత ఉపాధ్యక్షుడు జెడివాన్స్ ప్రాతినిధ్యం వహించారు. రామస్వామి విజయం కోసం సిన్‌సినాటికి వెళ్లి తన ఓ టును వేసారు. ప్రస్తుత ఓహియోగవర్నర్ రిపబ్లికన్ మైక్ డివైన్ మరోసారి ఎన్నికయ్యే అవకాశం లేదు. ట్రంప్ అధ్యక్షుడుగా ఎన్నికైన తర్వాత రామస్వామి ప్రభుత్వం స్థాపించిన డోజ్‌ను పర్యవేక్షించారు. ఆ తర్వాత ఈ ప్రాజెక్టును ఎలాన్‌మస్క్‌కు అప్పగించారు. వెనువెంటనే ఓహియో గవర్నర్‌పదవికి తాను రేసులో ఉన్నట్లుప్రకటించారు.

## టిఎంసి ప్రత్యేక సమావేశానికి పది మంది ఎమ్మెల్యేలు డుమ్మా

**కోల్‌కత్తా, మే 7:** అసెంబ్లీ ఎన్నికల లో ఓటమితో ఇప్పటికే తృణమూల్ కాంగ్రెస్ పార్టీ డీలాపడింది. ఈ క్రమంలో తాజాగా మమతాబెనర్జి నిర్వహించిన ఓ కీలక సమావేశానికి పది మంది టీఎంసీ ఎమ్మెల్యేలు గైర్హాజరు కావడం చర్చనీయాంశం అయ్యింది. తృణమూల్ కాంగ్రెస్ నుంచి మొత్తం 80 మంది ఎమ్మెల్యేలు విజయం సాధించగా.. వారిలో కేవలం 70 మంది మాత్రమే మమతాబెనర్జితో సమావేశానికి హాజరయ్యారు. రాష్ట్రంలో అధికారం కోల్పోయిన తర్వాత భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు, పార్టీ శ్రేణుల్లో నిరుత్సాహాన్ని తొలగించేందుకు ఈ సమావేశం నిర్వహించారు. కానీ ఈ సమావేశానికి ఏకంగా 10 మంది ఎమ్మెల్యేలు హాజరుకాకపోవడంతో పార్టీలో చీలిక ఏర్పడిందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే ఆ ఊహాగానాలను టీఎంసీ తోసిపుచ్చింది. గైర్హాజరుపై వారు ముందుగానే సమాచారం ఇచ్చారని వెల్లడించింది. ఇదిలా ఉంటే తాను సీఎంగా రాజీనామా చేయబోనని మమతా బెనర్జీ స్పష్టంచేసిన సంగతి తెలిసిందే. నన్ను డిస్మిస్‌చేసుకోమనండి, ఎన్నికల తీరుపై తానుసుప్రీంకోర్టుకు వెళతానని స్పష్టంచేసిన సంగతి తెలిసిందే.

### ఇడి అధికారుల భయంతో నోట్లకట్టలను 9వ అంతస్తునుంచి విసిరేసిన రియాల్టర్

**మొహాలిఖర్(పంజాబ్), మే 7:** పంజాబ్‌లోని రాజకీయ, వ్యాపార వర్గాల్లో గురువారం చోటు చేసుకున్న పరిణామాలు తీవ్ర కలకలం రేపాయి. మొహాలీఖరార్ ప్రాంతంలోని ఓ బహుళ అంతస్తుల భవనంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నిర్వహించిన సోదాల సందర్భంగా ఓ ఫ్లాట్ నుంచి నోట్ల కట్టల సంచులను కిందకు విసిరేయడంతో, రాష్ట్రంలో ఓ భారీ మనీలాండరింగ్, హవాలా నెట్‌వర్క్ నడుస్తోందన్నది బయటపడింది. ఈ కుంభకోణంలో పలుకుబడి కలిగిన బిల్డర్లు, రాజకీయ సంబంధాలున్న వ్యక్తుల ప్రమేయం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భూ కుంభకోణం కేసుకు సంబంధించిన దర్యాప్తులో భాగంగా ఈడీ అధికారులు ఖరార్‌లోని వెస్టన్ టవర్ భవనానికి చేరుకున్నారు. అధికారులు లోపలికి ప్రవేశించిన కొద్ది క్షణాల్లోనే 9వ అంతస్తులోని ఓ ఫ్లాట్ నుంచి నగదుతో నిండిన సంచిని కిందకు విసిరేసినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. గాల్లో రూ.500 నోట్ల కట్టలు ఎగరడం చూసి స్థానికులు దిగ్భ్రాంతికి గురయ్యారు.

8-5Pg6exHMNWJQE 10_8-5Pg6exHMNWJQE.qxd 08/May/26 12:19 AM Page 1



# కళల పరిరక్షణలో ప్రజానాట్యమండలిది కీలక పాత్ర

## సిపిఐ రాష్ట్ర నేత హరినాథ్ రెడ్డి



**తిరుపతి,మే 7ప్రభాతవార్తప్రతినిధి:** కళల పరిరక్షణలో ప్రజానాట్య మండలి కీలక పాత్ర పోషిస్తోందని, ఎన్నో ఉద్యమాల్లో కళాకారులే కీలక పాత్ర పోషించారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి. హరినాథరెడ్డి అన్నారు. డప్పు పాట ఎంతో మందిని ఆకట్టుకుంటుందని, నేడు పాలకులు ప్రశ్నిస్తే దేశ ద్రోహం కేసులు పెడుతున్నారని అన్నారు.. తమిళనాడులో సామాజిక రుగ్మతల్ని వెలుగులోకి తీసుకొస్తే రచయితపై కేసులు బనాయించారని ఆందోళన చెందారు. తిరుపతి నగరం బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్ లో గురువారం ప్రజా నాట్యమండలి రాయలసీమ స్థాయి విస్తృత స్థాయి సమావేశం ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య, నాగరాజు అధ్యక్షతన జరిగింది. కవులు, కళాకారులు, రచయితలపై నిర్బంధం విధిస్తున్నారుని, బీజేపీ పాలనతో సంస్కృతిపై విపరీతమైన దాడి జరుగుతోందని మండిపడ్డారు. ఈ దాడులను ఎదుర్కోవడానికి కళకారులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. అభ్యుదయ రచయితలు, కవులు, కళాకారులు బలమైన శక్తిగా ఏర్పడి సంస్కృతులను కాపాడుకోవలసిన బాధ్యత ఉందని హరినాథరెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రజానాట్య మండలి రాష్ట్ర బాధ్యుడు రామచంద్రయ్య కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై కళాకారులు వివిధ రూపాల్లో ప్రజల్లోకి తీసుకెళ్లాలి అని పేర్కొన్నారు. నేటి పిల్లలు సినిమాల్లో వచ్చే అర్థం లేని పాటలకు అలవాటు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ, ప్రజానాట్యమండలి నాయకులు పి మురళి, ఆర్ రామకృష్ణ, ఎస్ గుర్రప్ప, శివయ్య, చంద్ర శేఖర్, జె నాగరాజు, కడప జిల్లా కార్యదర్శి శ్రీనివాస వర్మ, సత్యసాయి జిల్లా కార్యదర్శి ప్రేమ్ కుమార్‌లు ఉన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు పక్కాగా ఏర్పాట్లు : కలెక్టర్ లక్ష్మీశా



ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షాసమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

**విజయవాడ, మే 7, ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈనెల 9వతేదీ తిరువూరు నియోజకవర్గం పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా అధికారులను ఆదేశించారు. ఈమేరకు గురువారం స్వర్ణగ్రామం కార్యాలయంలో అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈసందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఏ.కొండూరు మండలం, మాధవవరం గ్రామంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని కలెక్టర్ తెలిపారు. రీసర్వేపూర్తయిన భూములకు సంబందించిన రైతులకు రాజముద్రతో పట్టాదారు పాసు పుస్త కాలు ముఖ్యమంత్రి పంపిణీ చేస్తారని చెప్పారు. ముఖ్యమంత్రి పర్యటన సందర ్బం గా ట్రాఫిక్ ఇబ్బం దులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, కట్టుదిట్టమై భందోబస్తు ఏర్పాట్లు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. సభావేదిక, అతిధులు కూర్చు నేందుకు కుర్చీలు ఏర్పాటు చేయాలని, సభకు హాజరయ్యే ప్రజలకు సురక్షిత తాగునీరు, మజ్జిగ అందించాలని, మొబైల్ టాయ్‌లెట్‌లు ఏర్పాటు చేసి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, జనరేటర్లు సిద్దం చేయాలన్నారు. అత్యవసర వైద్యసేవలు అందించేందుకు ఆరోగ్యశిబిరం ఏర్పాటు చేయాలని, అగ్నిమాపక సిబ్బంది, విపత్తు దళం అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లా ప్రగతిని ప్రతిబింబించే అంశాలతో స్టాళ్ళు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, జేసి ఇలక్కియా, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేశ్, పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఇబ్రహీం పట్నంలోని కొండపల్లి బొమ్మల ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను గురువారం ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా సందర్శించారు.

కళాకారులతో కలెక్టర్ ముచ్చటించారు. సంప్రాదయ కళను ఆధుని కతతో మేళవించి కొత్తడిజైన్లు రూపొందించటం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. హస్తకళాకారుల ప్రగతికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వినియోగించుకోవాలని సూచించారు.

# ఇసుక అక్రమాలను నిరోధించాలి

## - సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య

**విజయవాడ,మే 7,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక విధానంలో పలు అక్రమాలు, దందాలు చోటుచేసుకుంటున్నాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ఆరోపించారు. ఉచిత ఇసుక ఉత్తిమాటగ్గా మిగిలిపోతోందని, ఇసుక అక్రమాలను నిరోధించి సక్రమంగా వినియోగదారులకు అందించాలని డిమాండ్ చేసారు. ఈ మేరకు ఈశ్వరయ్య నేడొక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన "ఉచిత ఇసుక్త విధానం ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా పెను చర్చకు దారితీస్తోంది. ఉచిత ఇసుక ఉత్తిమాటగా మిగిలిపోతోంది. భవన నిర్మాణ రంగానికి ఊతమివ్వాలని, పేదవాడి సొంతింటి కలను నిజం చేయాలనే లక్ష్యంతో తెచ్చిన ఈ పాలసీ, ఆచరణలో అనేక అడ్డంకులను ఎదుర్కొంటోంది. ప్రభుత్వం ఉచితం అని ప్రకటిస్తున్నా, వినియోగదారుడికి మాత్రం ఇసుక భారం తగ్గకపోగా, బ్లాక్ మార్కెట్ దందా, ఇసుక మాఫియా కారణంగా జేబులు ఖాళీకాక తప్పడంలేదు. ప్రస్తుతం ఇసుక రీచ్‌ల వద్ద "ఉచితం" అనే మాట కేవలం బోర్డులకే పరిమితమైంది. ఒక ట్రాక్టర్ లేదా ట్రక్కు ఇసుక కావాలంటే ప్రభుత్వం నిర్ణయించిన నామమాత్రపు ఛార్జీల కంటే 5 నుంచి 10 రెట్లు అదనంగా చెల్లించాల్సి వస్తోంది. ఇసుక ట్రక్కు ధర ఏకంగా రూ.5 వేల నుండి రూ.10 వేల వరకు పలుకుతుండటం విస్మయానికి గురిచేస్తోంది. సీనరేజ్ ఛార్జీలు, లోడింగ్ ఖర్చులు మరియు రవాణా ఛార్జీల పేరుతో మధ్యవర్తులు, లారీ యజమానులు ఇష్టానుసారంగా ధరలు వసూలు చేస్తున్నారు. మరోవైపు క్షేత్రస్థాయిలో బ్లాక్ మార్కెట్ దందా విచ్చలవిడిగా సాగుతోంది. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ, అనధికారిక మార్గాల్లో ఇసుక తరలిపోతోంది. చాలా ప్రాంతాల్లో "విచ్చలవిడిగా ఇసుక అమ్మబడును" అనే బోర్డులు బహిరంగంగానే కనిపిస్తున్నప్పటికీ సామాన్య ప్రజలు అధికారికంగా బుక్ చేసుకుందామని వెళ్తే మాత్రం "స్టాక్ లేదు" లేదా "సర్వర్ సమస్య" అనే సమాధానాలు ఎదురవుతున్నాయి. దీనివల్ల నిజమైన లబ్ధిదారులకు అందాల్సిన ప్రభుత్వ సాయం మధ్యలోనే ఆగిపోతోంది. ఇసుక కష్టాలు భవన నిర్మాణ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇసుక కొరత మరియు అధిక ధరల వల్ల సామాన్యులు తమ ఇళ్ల నిర్మాణాలను మధ్యలోనే నిలిపివేస్తున్నారు. మేస్త్రీలు, కూలీలు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఇసుకపై వచ్చే భారీ ఆదాయాన్ని వదులుకున్నప్పటికీ, ఆ ప్రయోజనం నేరుగా ప్రజలకు చేరకపోవడం విచారకరం. అధికారుల పర్యవేక్షణ లోపం, రాజకీయ జోక్యం వల్లనే ఇసుక అక్రమాలు జరుగుతున్నాయనేది బహిరంగ రహస్యం. ఉచిత ఇసుక విధానం సక్రమంగా అమలు కావాలంటే కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో కఠినమైన పర్యవేక్షణ ఉండాలి.

ఇసుక మాఫియాను, అక్రమ దందాను నివారించాలి. రవాణా ఖర్చులను క్రమబద్ధీకరించడంతోపాటు, దళారుల ప్రమేయం లేకుండా టెక్నాలజీని ఉపయోగించి పారదర్శకమైన బుకింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలి. పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలకు భారంకాకుండా ఇసుక అందించగలిగినప్పుడే "ఉచిత ఇసుక్త పథకం ఆశయం నెరవేరుతుందని, ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం నిర్దిష్ట చర్యలు చేపట్టాని సిపిఐ డిమాండ్ చేస్తున్నది.

# ఎమ్మెల్యే నాగమాధవి ఆధ్వర్యంలో జనసేనకు భారీ ఆదరణ



**విజయనగరం, మే 7 ప్రభాతవార్త :** జనసేన అధినేత పవన్ కళ్యాణ్ నాయకత్వానికి ఆకర్షితులై 250 మంది పార్టీలో చేరిజనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజా సంక్షేమ పాలన, యువతకు ప్రాధాన్యత, అవినీతి రహిత రాజకీయాలపై నిబద్ధత మరియు సామాన్య ప్రజల కోసం చేస్తున్న నిరంతర పోరాటాలకు ఆకర్షితులై భోగాపురం మండలం చేపల కంచేరు గ్రామానికి చెందిన 250 మంది జనసేన పార్టీలో ఘనంగా చేరారు. నెల్లిమర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే లోకం నాగ మాధవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. మైలపల్లి అమ్మాజీరావు, కారి గురువులు, మైలపల్లి రాము, మేడ సతీష్, బోయి శేఖర్ తదితర ప్రముఖులు తమ అనుచరులతో కలిసి జనసేన పార్టీలో చేరడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చేరిన వారందరికీ ఎమ్మెల్యే లోకం నాగ మాధవి పార్టీ కండువాలు కప్పి జనసేన కుటుంబంలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జనసేన పార్టీ ప్రజల ఆశయాలను నెరవేర్చే దిశగా అంకితభావంతో పని చేస్తోందని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ నాయకత్వం పట్ల ప్రజల్లో రోజు రోజుకు విశ్వాసం పెరుగుతోందని, అదే రాష్ట్రవ్యాప్తంగా జనసేన పార్టీకి లభిస్తున్న అపార ప్రజాదరణకు నిదర్శనమని ఆమె తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామాభివృద్ధి, యువత భవిష్యత్‌కు భరోసా కల్పించే రాజకీయాల వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారని, అందుకే పెద్ద ఎత్తున యువత మరియు కుటుంబాలు జనసేన వైపు ఆకర్షితులవుతున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో విజయనగరం జిల్లా జనసేన నాయకులు లోకం ప్రసాద్, భోగాపురం మండల జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# నెల్లిమర్లలో గంజాయి ముఠా గుట్టు రట్టు

**నెల్లిమర్ల (విజయనగరం జిల్లా), మే 7 ప్రభాతవార్త:** నెల్లిమర్ల పట్టణంలో డైట్ కాలనీకి చెందిన మనోహర్ అనే వ్యక్తి గంజాయిని రాయగడ రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలి యని వ్యక్తుల నుంచి కొనుగోలు చేసి నెల్లిమర్ల పట్టణంలో యువకులకు అమ్ముతున్నారని వచ్చిన సమాచారం మేరకు నెల్లిమర్ల ఎస్సై బి.గణేష్, సిబ్బంది చంపావతి నదీతీరంలో గ్యాస్ గోడౌన్ వెనక భాగంలో గల తుప్పల్లో దాడులు నిర్వహించారు. ఈ రైడ్‌లో భాగంగా నెల్లిమర్ల పట్టణం డైట్ కాలనీ కి చెందిన మనోహర్ అనే వ్యక్తి నుంచి నెల్లిమర్ల పట్టణానికి చెందిన ప్రవీణ్, సత్య దివాకర్, నవీను, లోకేష్ అనే నలుగురు వ్యక్తులు మనోహర్ నుంచి 100 గ్రాములు గంజాయి కొనుగోలు చేసి కాల్చడానికి వెళుతుండగా పోలీసులకు పట్టుబడ్డారు. అలాగే గంజాయిని అమ్మడానికి వచ్చిన మనోహర్ దగ్గర 1.2 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. నెల్లిమర్ల పట్టణం, పరిసర ప్రాంతాల్లో గంజాయిపై గట్టిగా నిఘా ఏర్పాటు చేశామని, ఎవరైనా గంజాయి సేవించినా, అమ్మినా, కొనుగోలు చేసినా వారిపై చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా ఎస్ ఐ గణేష్ హెచ్చరించారు.

# ప్రతి జిల్లాలో అరకు కాఫీ షాపులు.. మహిళల ఉపాధికి మెప్మా చర్యలు

**విజయవాడ మే 7 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో మహిళా సాధికారతకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, నేటివ్ అరకు కాఫీ సంస్థ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. మిషన్ డైరెక్టర్ వాకాటి కరుణ ఆధ్వర్యంలో కుదిరిన ఈ ఎంవోయూ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఫ్రాంచైజ్ విధానంలో అరకు కాఫీ దుకాణాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రతి జిల్లాలో రెండేళ్లలో రెండు అరకు కాఫీ షాపులు స్థాపించనున్నారు. మహిళలకు ఉద్యోగాలు, వ్యాపార అవకాశాలు కల్పించడం ఒప్పందం ప్రధాన లక్ష్యం. రూ.5.90 లక్షలతో ఓ దుకాణం, రూ.పది లక్షలతో మొబైల్ కాఫీ షాప్ వంటి రెండు మోడల్స్‌ను ఎంపిక చేశారు.

# క్షేత్ర పాలకునికి షోడశాభిషేకాలు

**శ్రీకాళహస్తి,మే 7 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన పరివారదేవతలకు ఒక్కొక్క రోజు ఒక్కొక్క దేవునికి పూజలు, విశేష అభిషేకాలు నిర్వహిస్తున్నారు. పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తున్న భోళాశంకరుని సన్నిధికి భక్తులు తండోపతండాలుగా కదలి వస్తున్నారు. నిత్యపూజలతో విరాలజిల్లుతున్న ఆలయంలో అడుగుపెట్టి పునీతులౌతున్నారు. కాశిలో మునక శ్రీకాళహస్తిలో అడుగుపెట్టడం ముక్తికి మార్గంగా భావిస్తున్నారు. ఈ నేపధ్యంలో శ్రీకాళహస్తి ప్రధాన ఆలయం కంచుగడప వద్దకు అడుగుపెట్టగానే గురువు దర్శనభాగ్యం లభిస్తుంది. శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన క్షేత్ర పాలకుడు గురుదక్షిణామూర్తికి గురువారం విశేష పూజలు, హోమాలు, అభిషేకాలు ఆలయ ఉప ప్రదానార్చకులు కరుణాకర్ గురుకుల్ పర్యవేక్షణలో భక్తి శ్రద్దలతో నిర్వహించారు. దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి చెందిన పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రంలో కాలుమోపిన వారికి తెలియని అనుభూతి కల్గిస్తుంది. ఆలయంలో ప్రవేశించిన వెంటనే బాహ్య ప్రపంచాన్ని మరచి పోతారు. శివయ్య సేవలో తరిస్తారు. అంతటి మహిమాన్విత దివ్యక్షేత్రంలో వెలసిన గురువు దక్షిణామూర్తికి గురువారం పండగలా పూజలు నిర్వహించటం ఈ దివ్యక్షేత్రంలో ఆచారంగా వస్తుంది. ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఇఓ బికె వెంకటేశులు ఉత్సవాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

# ఓటర్ లిస్టులు డిజిటల్ ఫార్మాట్లో అందించాలి

## ఎన్నికల అధికారికి లేఖ రాసిన వైసిపి నేత అప్పిరెడ్డి

**విజయవాడ,మే7,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ కోసం ఉపయోగించబోయే జాబితాను డిజిటల్ ఫార్మాట్‌లో అందించాలని వైసిపి ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని కోరారు. ఈ మేరకు ఎన్నికల అధికారికి లేళ్ళ అప్పిరెడ్డి గురువారం లేఖ రాశారు. ఓటర్ల అక్రమ తొలగింపులు, డూప్లికేట్ ఎంట్రీలు, ఓటర్ల మార్పిడి వంటి అంశాలపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ఓటర్ల చేర్పులు, తొలగింపులు, సవరణలు, వలసల ప్రక్రియలో అనుసరిస్తున్న విధానాలు, భద్రతా చర్యలను వెల్లడించాలని కోరారు. సరైన ప్రక్రియ లేకుండా ఏ ఒక్క నిజమైన ఓటరునూ ఓటు హక్కు నుండి దూరం కారాదన్నారు. అలాగే ఎస్ఐఆర్‌పై అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో అనుసరించే విధానాలు, టైమ్‌లైన్లు, భద్రతా చర్యలు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ, రాజకీయ పార్టీల బాధ్యతలపై పూర్తి వివరాలు తెలియజేయాలని కోరారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా బూత్ లెవల్ ఆఫీసర్ల జాబితాను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు అందించాలని కోరారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున బూత్ లెవల్ ఏజెంట్ల నియామకానికి సంబంధించిన దరఖాస్తులను స్వీకరించేలా అన్ని ఈఆర్వోలకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

# నియోజక వర్గాల పునర్విభజన అధ్యయనానికి జనసేన కమిటీ

## - పార్టీ కార్యదర్శి పిడుగు హరిప్రసాద్

**విజయవాడ,మే7,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు, నియోజక వర్గాల పునర్విభజన (డీ లిమిటేషన్)జరిగే అవకాశాలు ఉన్నందున ఈ రెండు ముఖ్యాంశాలపై క్షుణ్ణంగా అధ్యయనం చేపట్టి పార్టీకి నివేదిక ఇవ్వడానికి జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఒక కమిటీని నియమించారు ఈ మేరకు పవన్ కళ్యాణ్ రాజకీయ కార్యదర్శి, శాసనమండలిలో విప్ పిడుగు హరిప్రసాద్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ కమిటీలో సీనియర్ నాయకులు, శాసనసభ్యులు కొణ తాల రామకృష్ణ (అనకాపల్లి), పంచకర్ల రమేష్ (పెందుర్తి), ఆరణి శ్రీనివాసులు ( తిరుపతి), పంతం నానాజీ (కాకినాడ రూరల్), బొలిశెట్టి శ్రీనివాస్ (తాడేపల్లిగూడెం), సీహెచ్ వంశీకృష్ణ (విశాఖ సౌత్), మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎన్టీఆర్ జిల్లా జనసేన అధ్యక్షులు సామినేని ఉదయభాను, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు కోటికలపూడి గోవింద రావు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కమిటీ సభ్యులకు త్వరలో దిశానిర్దేశం చేయనున్నారు.

# కోనసీమలో అంతర్‌జిల్లా దొంగల అరెస్ట్

## రూ 97.5 లక్షల విలువైన సొత్తు స్వాధీనం..

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, మే7,ప్రభాతవార్త.** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పోలీసులు భారీ చోరీ కేసును ఛేదించి, ఇద్దరు అంతర జిల్లా దొంగలను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి సుమారు 97లక్షల 50 వేల రూపాయల విలువైన భారీ బంగారు ఆభరణాలు ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ రాహుల్ మీనా తెలిపారు. గత ఏడాది ఆగస్టు 30, 31 తేదీల్లో కొత్తపేటలోని ఓల్డ్ బ్యాంక్ స్ట్రీట్‌లో ఇంటి తాళాలు పగలగొట్టి భారీగా బంగారం, నగదు చోరీకి గురయ్యాయి. దీనిపై కేసు నమోదు చేసిన కొత్తపేట పోలీసులు లోతుగా దర్యాప్తు చేపట్టారన్నారు. కొత్తపేట, అనపర్తి ప్రాంతాల్లో ఉండే పొన్నాడ రవిశంకర్ (అలియాస్ రవి/వీరబాబు) కాకినాడ జిల్లా జగన్నాధపురానికి చెందిన పైరా చిరంజీవి లను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా పలు దొంగతనాలు బయట పడ్డాయాని ఎస్పీ తెలిపారు. పొన్నాడ రవి శంకర్ గతంలో సుమారు 120 ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడినట్లు రికార్డులు ఉన్నాయన్నారు. వైరా చిరంజీవి (అలియాస్ చిరు): తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం మార్కండేయ పురానికి చెందినవాడు. ఇతనిపై గతంలో ఒక హత్య కేసు కూడా నమోదైందన్నారు. నిందితుల నుంచి 646.361 గ్రాముల బంగారం ఒక రియల్‌మీ మొబైల్ ఫోన్ ఒక సుజుకి యాక్సెస్ మోటార్ సైకిల్, ఒక డెల్ ల్యాప్‌టాప్ రూ 2,100 నగదు స్వాదీనం చేసుకున్నామని ఎస్పీ రాహుల్ మీనా తెలిపారు. వీరిద్దరూ కలిసి మూడు జిల్లాల్లో (కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి) మొత్తం 14 ప్రధాన నేరాలకు పాల్పడ్డారని ప్రధానంగా కొత్తపేట, రావులపాలెం, పెరవలి, తాడేపల్లిగూడెం, ఇరగవరం, తణుకు ప్రాంతాల్లోని ఇళ్లను టార్గెట్ చేసేవారన్నారు . వీరు సాధారణంగా ఇంటి తలుపుల టవర్ బోల్ట్‌లను తొలగించడం లేదా ఐరన్ రాడ్‌తో తాళాలు పగలగొట్టి దొంగతనాలకు పాల్పడేవారని ఎస్పీ వెల్లడించారు. ఈ కేసును విజయవంతంగా ఛేదించిన కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీ మోహన్, రావులపాలెం రూరల్ ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్, అమలాపురం క్రైమ్ సీఐ ఎం. గజేంద్ర కుమార్, ఎస్ఐ సురేంద్ర కుమార్, సిసి ఏస్ ఎస్ ఐ లు పరదేశీ, ఏ బాలకృష్ణ, ఏ ఎస్ ఐ సుబ్బరాజు, హెచ్ సి వెంకట రమణ, కాన్స్టేబుల్స్ లంకాడి శ్రీను, డి అర్జునరావు, బి డి వి ప్రసాద్, జి కృష్ణ సాయి, ఏ సుభాకర్, వి ప్రసాద్, ఎం హరిబాబులను జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ప్రత్యేకంగా అభినందించారు.

# తాతయ్యగుంట గంగమ్మ బండవేషంలో దర్శనం



**తిరుపతి,మే 7ప్రభాతవార్తప్రతినిధి:** రాయలసీమ జిల్లాల్లోనే తిరుపతి గ్రామదేవతగా పూజలందుకుంటున్న తాతయ్యగుంట గంగమ్మ జాతర వేడుకల్లో గురువారం ఉదయం బండవేషంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఆలయం పరిసరాల్లో పటిష్ట ఏర్పాట్లుతో జాతరవేడుకలు సాగు తున్నాయి. గురువారం ఉదయం అమ్మవారిని చిన్నారులు, పెద్దలు మొక్కుబడుల్లో శరీరమంతా బొగ్గుపొడి పూసుకుని తెల్లని చుక్కలు ,కుంకుమ బొట్టులు పెట్టుకుని చేతిలో వేపాకుమండలు ధరించి గంగమ్మను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్ నైనార్ మహేశ్‌యాదవ్, ఆలయ ఇఒ ఎ.జయకుమార్, బోర్డు సభ్యులు ఆలయ సిబ్బంది భక్తులకు ప్రశాంత దర్శనం చేయిస్తున్నారు. అలాగే మరోగ్రామదేవత వేశాలమ్మ ఆలయంలోనూ భక్తులు బండవేషంలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఛైర్మన్ జగదీశ్‌రెడ్డి, ఆలయ సిబ్బంది భక్తులకు దర్శనాలు చేయించారు. కాగా ఈనెల 12వతేదీ ప్రధాన జాతర వేడుకలు జరగనున్నాయి. నిత్యం తిరుపతిజనం రాకపోకలు సాగించే ప్రధాన మార్గం నగరగ్రామదేవత తాతయ్యగుంట గంగమ్మ ఆలయం కొలువైన ప్రాంతం అష్టదిగ్భంధనంగా పోలీసులు మార్చేశారు. తిరుపతివాసులేగాక ఆలయంకు వెళ్ళాల్సిన భక్తులు చివరకు ఆలయ అర్చకులు కూడా ఎటు నుండి వెళ్ళాలో...ఎలా చేరుకోవాలో తెలియని ఇబ్బందులు పడుతున్నారు. ఇదంతా కొందరు తిరుపతి పోలీసు అధికారుల అత్యుత్సాహంతోనే ఇలా గంగమ్మ జాతరకు ఐదురోజుల ముందే కష్టాలు చవిచూడాల్సి వస్తోందని వాపోతున్నారు. గతంలో 2023,2024,2025లో గంగమ్మజాతర జరిగిన సందర్బాల్లోనూ ఏకంగా స్వయంగా అప్పటి రాష్ట్రమంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు భారీ సంఖ్యలో ఆలయానికి చేరుకుని గంగమ్మకు సారే సమర్పించినపుడు కూడా ఇంతటి కష్టాలు కలగలేదని తిరుపతి జనం తిట్టుకుంటున్నారు.

# సంజీవని ప్రాజెక్టులపై ప్రత్యేక సమీక్ష

## కుప్పంలో అద్భుత ఫలితాలు ఇస్తున్న డిజిటల్ హెల్త్

**విజయవాడ మే 7 ప్రభాతవార్త ప్రతినిధి:** పిల్లలే సంపద, మరియు సంజీవని కార్యక్రమాలపై అత్యంత కీలకమైన ప్రెజెంటేషన్‌ను 7వ కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో భాగంగా వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ఇచ్చారు. రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు బాగా పడిపోతుండటం , ప్రైవేటు ఆసుపత్రులలో సీ-సెక్షన్లు పెరిగిపోతుండటం, తక్కువ వయసులోనే గర్భం దాల్చడం లాంటివి భవిష్యత్తులో మన జనాభా సమతుల్యతను తీవ్రంగా దెబ్బతీస్తాయని ఆయన విశ్లేషించారు. భవిష్యత్తులో పనిచేసే యువత సంఖ్య తగ్గిపోయి వృద్ధుల సంఖ్య పెరిగే ప్రమాదం ఉండటంతో దీనికి చెక్ పెట్టేలా పెద్ద కుటుంబం-సంపద పెంచే కుటుంబం అనే నినాదంతో పిల్లలే సందప అనే అద్భుతమైన పథకాన్ని ఆయన వివరించారు. మూడో, నాలుగో బిడ్డకు అంగన్‌వాడీలో చేరేదాకా అంటే రెండేళ్ల పాటు ప్రతి నెలా 3 నుంచి 6 కిలోల చిరుధాన్యాలు ఉచితంగా ఇస్తామని , పిల్లలు ఎంతమంది ఉన్నా సరే తల్లికి వందనం పథకాన్ని వర్తింపచేస్తామని స్పష్టం చేశారు. ఈ పథకం గురించి ప్రజల్లో విస్తృతంగా అవగాహన తీసుకురావడానికి దశలవారీగా గ్రామ స్థాయి మైక్రో ప్లాన్ సిద్ధం చేయబోతున్నట్లు ఆయన పంచుకున్నారు. ఆ తర్వాత ఆయన సంజీవని డిజిటల్ హెల్త్ ప్లాట్‌ఫామ్ గురించి వివరిస్తూ, ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యాన్ని చేరువ చేయడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమన్నారు.

# దుర్గమ్మ ఆలయాభివృద్ధిపై ఎంపితో చైర్మన్ చర్చలు



దాతలకు అమ్మవారి చిత్రపటం ఇస్తున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి, మే 7, ప్రభాతవార్త :** విజయవాడ పార్లమెంట్ సభ్యుల కార్యాలయంలో ఎంపీతో గురువారం శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థాన చైర్మన్ ప్రత్యేకంగా భేటీ అయ్యి దుర్గమ్మ ఆలయ అభివృద్ధి, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు మరియు రాబోయే ప్రాజెక్టులపై విస్తృతంగా చర్చించారు. ఆలయ సమగ్ర అభివృద్ధిలో భాగంగా ప్రతిపాదించిన మాస్టర్ ప్లాన్ పనుల ప్రస్తుత స్థితిగతులను సమీక్షించారు. కొండపైకి వచ్చే సామాన్య భక్తులకు క్యూలైన్లు, మంచినీరు, మరియు వసతి సౌకర్యాలను మరింత మెరుగుపరచడంపై దృష్టి సారించారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానానికి దుర్గమ్మవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ. 1,01,116ల విరాళాన్ని గొల్లపూడికి చెందిన బుర్లే శ్రీనివాసరావు భ్రమరాంబ దంపతులు గురువారం అందజేశారు. దాతలకు ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి, అనంతరం వేదపండితులతో ఆశీర్వచనం చేయించారు. వారికి అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం మరియు చిత్రపటాన్ని బహూకరించారు. ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ట్రస్ట్‌బోర్డు మెంబర్ స్పెషల్ ఇన్వైటి మరియు దాత వెలగపూడి శంకర్ బాబు, శ్రీదేవి దంపతులు తమ మనవడు సుహాస్ కృష్ణ పేరు మీద సుమారు రూ. 1 లక్ష విలువైన 300 లీటర్ల సామర్థం గల వాటర్ ప్లాంట్‌ను విరాళంగా అందజేశారు. ఓం టర్నింగ్ వద్ద ఈ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు.

# పరిశ్రమలకు, ఇళ్లకు తక్కువ ధరకు విద్యుత్ సరఫరా చేయడం ప్రభుత్వఉద్దేశం

## - సిఎం ఎక్స్ అఫిషియోస్పెషల్ సిఎస్ కె.విజయానంద్

విజయవాడ మే 7 ప్రభాతవార్త ప్రతినిధి: రైతులకు పరిశ్రమలకు ఇళ్లకు తక్కువ ధరకు నమ్మకంగా విద్యుత్ సరఫరా చేయడం ప్రభుత్వఉద్దేశం అని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ,సీఎం ఎక్స్ అఫిషియోస్పెషల్ సిఎస్ కె.విజయానంద్ తెలిపారు. జిల్లా కలెక్టర్ల సమావేశంలో కాస్ట్ ఆప్టిమైజేషన్ ఫ్యూయల్ అండ్ ఎనర్జిపై ప్రజెంటేషన్ ఇస్తూ గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తూ నెట్ జీరో ఎమిషన్స్ వైపు అడుగులు వేస్తున్నామని తెలిపారు. రైతులకు పరిశ్రమలకు ఇళ్లకు తక్కువ ధరకు నమ్మకంగా విద్యుత్ సరఫరా చేయడం మా ఉద్దేశం అని తెలిపారు. స్మార్ట్ గ్రిడ్లు, మైక్రో గ్రిడ్లు, సోలార్ రూఫ్‌టాప్ కార్యక్రమాల ద్వారా స్థానిక స్థాయిలోనే శక్తి స్వయం సమృద్ధి సాధించాలని ఎఐ మరియు స్మార్ట్ టెక్నాలజీలను ఉపయోగించి సమర్థవంతంగా శక్తి నిర్వహణ జరగాలని చెప్పారు. పిఎం సూర్య ఘర్ యోజన కింద రాష్ట్రంలో ఇప్పటివరకు 7.25 లక్షల మంది దరఖాస్తులు చేసుకోగా వాటిలో 1.31 లక్షల ఇళ్లలో సోలార్ ఫ్యానెల్స అమర్చడం పూర్తయిందని వెల్లడించారు. ఇది 441 మెగావాట్ల సామర్థ్యానికి సమానం. యుఎల్‌ఎ మోడల్ కింద ఎస్సీ/ఎస్టీ వర్గాలకు 6 లక్షల మంది వినియోగదారులకు ఉచితంగా సోలార్ పవర్ అందించే లక్ష్యంతో 50 వేల మందికి ఇప్పటికే అమర్చడం పూర్తయిందని చెప్పారు. రోజూ దాదాపు 2600 మంది వరకు కొత్త ఆన్‌స్టాలేషన్లు జరుగుతున్నాయని గణాంకాలతో వివరించారు. పిఎం కుసుమ్ స్కీమ్ కింద రైతులకు ఫీడర్ లెవెల్ పోలరైజేషన్ కోసం రాష్ట్రవ్యాప్తంగా 227 ప్లాంట్లు ఏర్పాటు చేయడానికి ప్రణాళిక రూపొందించామని వీటిలో 217 ప్లాంట్లకు భూమి సేకరణ పూర్తయిందని, 97 చోట్ల నిర్మాణ పనులు మొదలయ్యాయని విజయానంద్ తెలిపారు. ఇది మొత్తం 1168.8 మెగావాట్ల సామర్థ్యానికి సంబంధించనది. ప్రభుత్వ భవనాలపై సోలార్ ప్యానెల్స్ అమర్చడానికి చిత్తూరు జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్ ఆర్ఇఎస్‌సిఒ మోడల్‌లో ప్రారంభించామని 78 ప్రభుత్వ స్కూళ్లు, హాస్టళ్లలో 826కెడబ్ల్యూ సామర్థ్యంతో సోలార్ సిస్టమ్స్ అమర్చనున్నామని వెల్లడించారు. దీని వల్ల ఏటా 34.5 లక్షల రూపాయలు ఆదా అవుతాయని రాష్ట్రవ్యాప్తంగా 1775 ప్రభుత్వ భవనాలు గుర్తించామని వీటిలో 201 మెగావాట్ల సామర్థ్యం ఉందని చెప్పారు. 2025-226 ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ కొనుగోలు ఖర్చు యూనిట్‌కు సగటున రూ.4.90 గా ఉందని, ముఖ్యంగా గ్రీన్ ఎనర్జీ వాడకం పెరగడంతో కొన్ని నెలల్లో యూనిట్ ధర రూ.4.56 వరకు తగ్గిందని వివరించారు. జిల్లా కలెక్టర్లు తమ తమ ప్రాంతాల్లో అసెంబ్లీ నియోజకవర్గం వారీగా రూఫ్‌టాప్ సోలార్ సమీక్షించాలని ఎస్సీ / ఎస్టీ వర్గాలకు చెందిన వినియోగదారులకు సకాలంలో సోలార్ ప్యానెల్స్ అందేలా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వ భవనాల సోలరైజేషన్ కోసం జిల్లా కలెక్టర్లు సర్వేలు చేపట్టి ఎన్ఆర్ఇడిసిఎపి కి వివరాలు అందించాలని సూచించారు. పిఎం కుసుమ్ పథకం అమలులో ఏమైనా సమస్యలు ఎదురైతే వెంటనే డిస్కమ్స్, ఎన్ఆర్ఇడిసిఎపి అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కరించాలని, ఫిర్యాదులను త్వరితంగా పరిష్కరించాలన్నారు.

8-5Pg7exHMNWJQE 11_8-5Pg7exHMNWJQE.qxd 08/May/26 12:17 AM Page 1



# ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రజల నమ్మకాన్ని పొందడం ముఖ్యం

## - సింగపూర్ పర్యటన అనుభవాలు పంచుకున్న హోంమంత్రి అనిత

**విజయవాడ మే7 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రజల భాగస్వామ్యంతో పాటు వారి నమ్మకాన్ని పొందడం ముఖ్యమని హోంమంత్రి వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన 7వ కలెక్టర్ల సదస్సులో గురువారం నాడు హోం మంత్రి వంగలపూడి అనిత ఎస్ఎజిఇ కార్యక్రమం కింద చేసిన సింగపూర్ పర్యటన అనుభవాలను సభతో పంచుకున్నారు. ఆ పర్యటనను కొందరు ఎంజాయిమెంట్ ట్రిప్ అని పిలిచారని, కానీ అది వాస్తవానికి దూరమైన మాటని ఆమె స్పష్టం చేశారు. విమానం 4 గంటలకు ఉంటే తాము 2 గంగలకే క్లాస్‌రూమ్‌లో కూర్చున్నామని, ఒక్క రోజు కూడా విశ్రాంతిగా గడపలేదని ఆమె చెప్పారు. ప్రతి క్షణం నేర్చుకోవడానికే వినియోగించామని ఆమె స్పష్టం చేశారు. సింగపూర్ అంతటా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికత కనిపించిందని మంత్రి అన్నారు. ఎక్కడికి వెళ్ళినా సీఎం గారి నీడ కనపడుతూనే ఉందని, సింగపూర్ అనుసరిస్తున్న విధానాలను ఆయన ఎప్పటి నుంచో మాట్లాడుతున్నారని ఆమె పేర్కొన్నారు. 1996లోనే ముఖ్యమంత్రి జన్మభూమి కమిటీల ద్వారా పబ్లిక్ పార్టిసిపేషన్ గురించి మాట్లాడారని, ప్రజలు ప్రభుత్వంతో కలిసి పని చేయాలనే ఆలోచన అప్పటి నుంచే ఆయనకు ఉందని ఆమె గుర్తు చేశారు. అయితే సింగపూర్ పబ్లిక్ పార్టిసిపేషన్‌కు మించి పబ్లిక్ ట్రస్ట్ మీద దృష్టి పెట్టిందని మంత్రి వివరించారు. అక్కడ కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ చాటా బలంగా ఉందని, ఏదైనా పథకం తీసుకొచ్చే ముందే ప్రజలకు చెప్పి సిద్ధం చేస్తారని ఆమె తెలిపారు. జరగబోయే మార్పులను ముందే అర్థమయ్యేలా చేయడం వల్ల ప్రజలు వ్యతిరేకించకుండా సహకరిస్తారని ఆమె అన్నారు. ప్రభుత్వం ఏదైనా చేయాలంటే ముందు ప్రజల నమ్మకం సంపాదించాలని, అది రాత్రికి రాత్రి సాధ్యం కాదని ఆమె స్పష్టం చేశారు. సహజ వనరులు లేకుండా కూడా అన్నీ సొంతంగా సృష్టించుకుని సింగపూర్ ఎదిగిన తీరు అత్యంత స్ఫూర్తిదాయకంగా ఉందని మంత్రి అన్నారు. నీళ్ళు కూడా శుద్ధి చేసుకుని తాగే దేశం ఇంత ఎత్తుకు ఎదిగిందంటే వనరులు ఉన్న మన రాష్ట్రం ఎందుకు వెనకబడాలని ఆమె ప్రశ్నించారు. యువత క్రమశిక్షణ విషయంలో సింగపూర్ అనుసరిస్తున్న పద్ధతి గురించి మాట్లాడుతూ అక్కడ +2 తర్వాత యువతకు డిఫెన్స్ కోచింగ్ ఇస్తున్నారని మంత్రి తెలిపారు. ఇది కేవలం దేశ రక్షణకు కాదని, క్రమశిక్షణ, బాధ్యత, దేశంపై ప్రేమ అలవడేలా చేయడానికని ఆమె చెప్పారు. ఈ దశ దాటిన యువత జీవితంలో ఏ పని చేసినా బాధ్యతగా చేస్తారని అన్నారు. మన రాష్ట్రంలో ఇలాంటి మెకానిజమ్ ఎలా తీసుకురావాలో కలెక్టర్లు ఆలోచించాలని ఆమె పిలుపు ఇచ్చారు. హోం మంత్రిగా తనను అత్యంత ఆకర్షించింది అక్కడి శాంతిభద్రతల వ్యవస్థ అని ఆమె చెప్పారు. సింగపూర్‌లో క్రైమ్ రేట్ చాలా తక్కువని, దానికి కారణం పోలీసుల సంఖ్య కాదని వివరించారు. అక్కడి అధికారులు చెప్పిన మాట తనను ఎంతగానో ప్రభావితం చేసిందని 20 వేల మంది పోలీసులు ఉన్నా 20 లక్షల మంది పోలిసింగ్ చేస్తారని వారు అన్నారని మంత్రి తెలిపారు. అంటే ప్రజలనే పోలీసులుగా తీర్చిదిద్దారని, శాంతిభద్రతలు తమ బాధ్యత అని ప్రజలకు అనిపించేలా చేయగలిగారని ఆమె అన్నారు. ఆ వ్యవస్థను మరింత వివరిస్తూ అక్కడ ఏదైనా తప్పు జరిగితే 100కు డయల్ చేయాల్సిన అవసరం లేదని గూగుల్ లింక్ ద్వారా కంప్లయింట్ పెట్టవచ్చని మంత్రి తెలిపారు. అందులో ప్రత్యేకత ఏమిటంటే బాధితులు మాత్రమే కాదు. సంఘటన చూసిన ఏ పౌరుడైనా కంప్లయింట్ నమోదు చేయవచ్చని, వారి సమాచారం గోప్యంగా ఉంచడం వల్ల ప్రజలు భయపడకుండా ముందుకు వస్తున్నారని ఆమె వివరించారు. న్యాయ వ్యవస్థలో సింగపూర్ అనుసరిస్తున్న అప్పీళ్ళ విధానం కూడా చాలా ఆదర్శంగా ఉందని మంత్రి పేర్కొన్నారు. మన దగ్గర అప్పీల్ చేయడం చాలా సులభంగా ఉండటం వల్ల అదే కేసులు పదేళ్లు పదిహేనేళ్ళు నడుస్తున్నాయని ఆమె అన్నారు. సింగపూర్‌లో అప్పీల్ చేయాలంటే తప్పనిసరి.



# నిరంతర అధ్యయనం ప్రజా ప్రతినిధులకు అత్యవసరం : సిఎం చంద్రబాబు

## - నేను కాదు మనం అనే విధానంలో ముందుకు వెళ్దాం

**విజయవాడ,మే7,ప్రభాతవార్తప్రతినిధి:** నిరంతర అధ్యయనం ప్రజా ప్రతినిధులు అత్యవసరమని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. పరిపాలన సమర్థత పెంచుకోవడానికి నూతన విధానాల గురించి తెలుసుకోవాలన్నారు. మంత్రుల సింగపూర్ పర్యటనపై జిల్లా కలెక్టర్ల సమావేశంలో ఇచ్చిన ప్రజెంటేషన్ తదితర అంశాలపై సీఎం చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు. నేర్చుకోవటం అనేది నిరంతర ప్రక్రియ అని తెలిపారు. అత్యుత్తమ విధానాలు ఎక్కడున్నా అమలు చేస్తే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. సింగపూర్‌లో అనుసరిస్తున్న పాలనా విధానాలు అక్కడి ప్రజల విశ్వాసాన్ని దక్కించుకున్నాయని చెప్పారు. సింగపూర్‌లోని అత్యుత్తమ విధానాలను తీసుకుని ఓ జిల్లాను మోడల్‌గా అభివృద్ధి చేద్దామని అన్నారు. సింగపూర్ విధానాల అమలుకు 90 రోజుల యాక్షన్ ప్లాన్ తయారు చేసి పర్యవేక్షణ చేయాలని సూచించారు. నేను కాదు మనం అనే విధానంలో ముందుకు వెళ్దాం.. ఈ విధానం నేటి నుంచి నాతో మొదలవుతుంద్ది అని సీఎం పేర్కొన్నారు. జీఎస్డీపీ విషయంలో తీసుకునే నిర్ణయాలు భవిష్యత్తులో ప్రజలపై ప్రభావం చూపిస్తాయి జీఎస్డీపీ విషయంలో తీసుకునే నిర్ణయాలు భవిష్యత్తులో ప్రజలపై ప్రభావం చూపిస్తాయని జిల్లా కలెక్టర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు అన్నారు. గిరిజన ప్రాంతంలో ఉంటూనే పార్వతీపురం, అల్లూరి జిల్లాల్లో అభివృద్ధి వేర్వేరుగా ఉంది. అల్లూరి జిల్లాలో కాఫీ పంటకు విలువ జోడింపుతో జీఎస్డీపీ ఎక్కువగా ఉంది. అభివృద్ధిపై దృష్టి సారించి ప్రగతి సాధనకు కీలకం కావాలి. సర్వీస్ సెక్టార్ పెరగాలి. దేశ జీడీపీలో ఏపీ 10 శాతం మేర వ్యవసాయ ఉత్పత్తుల వాటాను కలిగి ఉంది. కొన్ని జిల్లాల్లో రేర్ ఎర్త్ మినరల్స్ ఉన్నాయి. వాటికి సంబంధించిన ప్లాంట్లు వస్తే మరింత అభివృద్ధికి ఆస్కారం ఉంది. జీఎస్డీపీ గ్రోత్ విషయంలో కలెక్టర్లు ఎలా పని చేస్తున్నారనే అంశంపై ఫైళ్ళు కాదు.. ఫలితాలు కదలాలి పాలనలో వేగం, జవాబుదారీతనం అత్యంత కీలకమని సీఎం ఉద్ఘాటించారు. "స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ అనేది కేవలం నినాదానికే పరిమితం కారాదు. ఫైల్స్ షుడ్ నాట్ మూవ్... రిజల్ట్స్ షుడ్ మూవ్‌ (ఫైళ్ల కాదు, ఫలితాలు కదలాలి) అనేదే మన విధానం కావాలి. ప్రజల నుంచి వచ్చిన ఆర్థికేతర ఫిర్యాదులను 100 శాతం పరిష్కరించాల్సిందే" అని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో బాగా పనిచేసిన చోట ప్రజల నుంచి సానుకూల స్పందన వస్తోందని, ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా పనిచేయాలని సూచించారు. "ఆఫీస్ చెప్పేది డేటా మాత్రమే, క్షేత్రస్థాయికి వెళ్తేనే అసలు నిజం తెలుస్తుంది (ఆఫీస్ టెల్స్ యూ డేటా... ఫీల్డ్ టెల్స్ యూ ట్రూత్). అందుకే కార్యదర్శులు 3 రోజులు, విభాగాధిపతులు 6 రోజులు, కలెక్టర్లు 8 రోజులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించాలి" అని ఆయన స్పష్టం చేశారు. జిల్లాల మధ్య అభివృద్ధిలో ఆరోగ్యకరమైన పోటీ ఉండాలని, ఒక జిల్లాలో అమలు చేసిన ఉత్తమ పద్ధతులను మిగతా జిల్లాల్లోనూ అమలు చేయాలని, ఆయా కలెక్టర్లను నోడల్ ఆఫీసర్లుగా నియమిస్తామని ప్రకటించారు. పబ్లిక్ రిలేషన్స్ ఎంత ముఖ్యమో, పబ్లిక్ డెలివరీ కూడా అంతే ముఖ్యమని గుర్తుచేశారు. ఈ సమావేశంలో మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు. నూతన ఆవిష్కరణలతో అభివృద్ధి ఎలా సాధించాలన్నదానిపై కలెక్టర్లు ఆలోచన చేయాలి నూతన ఆవిష్కరణలతో అభివృద్ధి ఎలా సాధించాలన్నదానిపై జిల్లా కలెక్టర్లు ఆలోచనలు చేయండి.. రాష్ట్ర స్థాయిలో కలెక్టర్లకు పోటీ పెట్టినట్టే... జిల్లా స్థాయిలో నియోజకవర్గాల మధ్య పోటీ పెట్టండి. ఫీల్డ్ లెవల్ ఆఫీసర్లకు చాలా అనుభవం ఉంటుంది.. వాళ్ల దగ్గర చాలా సమాచారం ఉంటుంది. క్షేత్ర స్థాయి అధికారులను సమర్థంగా వినియోగించుకుంటే అభివృద్ధి వేగంగా జరుగుతుంది. సంక్షేమం చక్కగా అందుతుంది. వినూత్నమైన ఆలోచనలను అమలు చేసేందుకు అవకాశం దక్కుతుంది. సూర్యలంక, మంగినపూడి, విశాఖ, శ్రీకాకుళం, మైపాడు తదితర ప్రాంతాల్లో బీచ్ ఫ్రంట్లను అభివృద్ధి చేస్తే స్థానికులకు అవకాశాలు పెరుగుతాయి. కొత్త జాతీయ రహదారులు కొత్త అవకాశాల్ని సృష్టిస్తాయి. లాజిస్టిక్స్ హబ్ లను ఏర్పాటు చేసుకోవచ్చుటౌన్ షిప్ లను అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుంది. విజన్ యూనిట్లను జిల్లా కలెక్టర్లు సమర్థంగా వినియోగించుకోవాలి. గతంలో పెద్ద జిల్లాల్లో 21 నియోజకవర్గాలను పర్యవేక్షించాల్సి వచ్చేది అన్నారు. కలెక్టర్లు జిల్లా పర్యటనకు వెళ్తే ప్రయాణానికే ఓ పూట పట్టేంది. ఇప్పుడు ప్రతీ జిల్లా కలెక్టర్ పరిధిలో కేవలం 7 అసెంబ్లీ నియోజకవర్గాలు మాత్రమే ఉన్నాయి. అన్నారు గతంతో పోల్చుకుంటే టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. జ. గతానికంటే మెరుగైన పనితీరు కనబర్చడానికి... అభివృద్ధి చేయడానికి, సంక్షేమం అందించడానికి ఇప్పుడు కలెక్టర్లకు అవకాశాలు ఎక్కువ అని సీఎం అన్నారు.



## పుదుచ్చేరి సిఎం రంగస్వామి రాజీనామా

### లెఫ్టినెంట్ గవర్నర్‌కు లేఖ అందజేత.. అసెంబ్లీ రద్దుకు సిఫారసు

**చెన్నై, మే 7:** కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి ముఖ్యమంత్రి పదవికి ఎన్. రంగస్వామి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను లెఫ్టినెంట్ గవర్నర్ కె.కైలాసనాథన్‌ను కలిసి స్వయంగా కలిసి సమర్పించారు. రాజీనామాతో పాటు ప్రస్తుత అసెంబ్లీని రద్దు చేయాలని ఆయన లెఫ్టినెంట్ గవర్నర్‌ను కోరారు. అయితే, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రంగస్వామి నేతృత్వంలోని ఎన్‌డియే కూటమి 18 స్థానాల్లో ఘనవిజయం సాధించింది. ఇండియా కూటమి 6 స్థానాలు, ఇతరులు 6 స్థానాలు కైవసం చేసుకున్నారు. ఎన్‌డియే కూటమికి స్పష్టమైన మెజారిటీ రావడంతో మరో రెండు మూడు రోజుల్లో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని లెఫ్టినెంట్ గవర్నర్ నుంచి కూటమికి అధికారిక ఆహ్వానం అందనుంది. ప్రస్తుతానికి ఎన్.రంగస్వామి ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగే అవకాశముంది. త్వరలోనే ఎన్‌డియే కూటమి తమ కొత్త ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించనుంది.

# ఆపరేషన్ సిందూర్ భారత్ శౌర్యానికి నిదర్శనం

## ఉగ్రవాదానికి ఆశ్రయం ఇచ్చే శక్తులకు గట్టి హెచ్చరిక

### బిజెపి రాష్ట్ర ఛీఫ్ ఎన్. రాంచందర్‌రావు

**హైదరాబాద్, మే 7. ప్రభాతవార్త:** పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేస్తూ భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా సంబురాలు నిర్వహించారు. బిజెపి రిటైర్డ్ ఆర్మీ సెల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని, తొలుత ఉగ్రవాదుల చేతిలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులకు ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన కేక్ కట్ చేసి కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలుపుతూ, పహల్గామ్ దాడికి ప్రతీకారంగా లష్కర్, జైష్ వంటి ఉగ్రవాద శిబిరాలపై భారత సైన్యం విరుచుకుపడి ఉగ్రవాదులను మట్టుబెట్టడం భారత శౌర్యానికి నిదర్శనమని కొనియాడారు. ఈ విజయం దేశ భద్రత పట్ల నరేంద్ర మోడీ ప్రభుత్వ కఠిన వైఖరిని చాటిచెబుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో రాంచందర్ రావు మాట్లాడుతూ పహల్గాంలో సెలవుల కోసం వెళ్లిన అమాయక భారతీయ పర్యాటకులను మతం అడిగి కాల్చిచంపిన ఉగ్రవాదుల దారుణాన్ని దేశం ఎన్నటికీ మరువదని అన్నారు. 26 మంది భారతీయులను అత్యంత క్రూరంగా చంపిన పాక్ ప్రేరిత ఉగ్రవాదులకు, ఇది పాత భారతదేశం కాదని, ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోని నూతన భారతదేశమని గుర్తు చేశారు. పహల్గామ్ ఘటన జరిగిన కొద్ది రోజుల వ్యవధిలోనే మహిళా అధికారుల పర్యవేక్షణలో భారత సైన్యం అత్యంత ఖచ్చితత్వంతో కేవలం 22 నిమిషాల్లో ఈ ఆపరేషన్‌ను పూర్తి చేసిందని, ఉగ్రవాద స్థావరాలను నేలమట్టం చేయడమే కాకుండా భారత వైపు నుంచి ఒక్క ప్రాణనష్టం కూడా జరగకుండా ఆపరేషన్ విజయవంతంగా పూర్తయ్యిందని ఆయన వివరించారు. అయితే, దేశం గర్వించదగ్గ ఇటువంటి చారిత్రాత్మక విజయం పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రవర్తించిన తీరు అత్యంత దురదృష్టకరమని రాంచందర్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీతో సహ కాంగ్రెస్ నేతలు పాకిస్తాన్, చైనా ప్రతినిధుల్లా వ్యవహరిస్తు న్నారని, గతంలో బాలాకోట్ సర్జికల్ స్ట్రైక్స్ సమయంలో ఆధారాలు అడిగిన వారు, ఇప్పుడు కూడా సైన్యంపై అనుచిత ప్రశ్నలు లేవనెత్తడం దేశభక్తికి విరుద్ధమని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ భారత సైన్యం వెంటే నిలబడలేదని, పార్లమెంట్‌లోనూ, వెలుపల కూడా మన సైనికులను అవమానించేలా మాట్లాడటం ఆ పార్టీకి అలవాటుగా మారిందని ఆయన తీవ్రంగా విమర్శించారు. కార్గిల్ విజయ్ దివస్‌ను ఎలాగైతే జరుపుకుంటామో, అదే విధంగా ఆపరేషన్ సిందూర్‌ను కూడా దేశ ప్రజలు గర్వంగా గుర్తుంచుకుంటారని ఆయన అన్నారు. చివరగా, తెలంగాణ రాజకీయ పరిణామాలపై స్పందిస్తూ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌పై బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన వ్యక్తిగత దూషణలను బిజెపి తీవ్రంగా ఖండిస్తోందని రాంచందర్ రావు తెలిపారు. వ్యక్తిగత పరువు నష్టం కలిగించేలా ప్రవర్తిస్తే బిజెపి కార్యకర్తలు స్వతహాగా తగిన విధంగా స్పందించాల్సిన పరిస్థితులు వస్తుంటాయని, హింసను పార్టీ ఎప్పుడూ ప్రోత్సహించదన్నారు.





పెరేడ్‌గ్రౌండ్ పరిశీలిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపి ఈటల రాజేందర్ తదితరులు

## పెరేడ్‌గ్రౌండ్ సభావేదికను పరిశీలించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ (కంటోన్మెంట్), మే 7, ప్రభాతవార్త:** సికిందరాబాద్ పెరేడ్‌గ్రౌండ్ లో ఈ నెల 10న ప్రధానమంత్రి నరేంద్రమోడీ బహిరంగసభను విజయ వంతం చేసేం దుకు బిజెపి కార్యకర్తలు, నాయకులు పెద్దసంఖ్యలో తరలి రావాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం పెరేడ్ గ్రౌండ్‌లో బహిరంగ సభ ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. సభా ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లు, సభకు తరలివచ్చే ప్రజలకు కల్పిస్తున్న సౌకర్యాలు భద్రతా ఏర్పాట్లపై నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి పార్లమెంట్‌సభ్యుడు ఈటల రాజేందర్, బిజెపి జాతీయ బిసి మోర్చా అధ్యక్షుడు, ఎంపి డాక్టర్ లక్ష్మణ్, సిఎల్‌పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, మండలి పక్ష నేత ఎవిఎన్.రెడ్డి, అంజిరెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జె.రామకృష్ణ, బానుక నర్మద మల్లికార్జున్, మోండా డివిజన్ మాజీకార్పొరేటర్ కొంతం దీపిక తదితరులు పాల్గొన్నారు.

## నిర్వహణే మాది.. మరమ్మతుల బాధ్యత మీదే

### నాగార్జునసాగర్ గేట్ల మరమ్మతులపై ఎపి కొత్త పేచీ

### 14 నుంచి 26 గేట్ల మరమ్మతులను తెలంగాణే చేపట్టాలని లేఖ.. మండిపడుతున్న నీటిపారుదలనశాఖ

**హైదరాబాద్, మే 7, ప్రభాతవార్త:** నాగార్జునసాగర్ ప్రాజెక్టు విషయంలో తెలుగు రాష్ట్రాల మధ్య మరో వివాదం రాజుకుంది. ఏటా వేసవిలో ప్రాజెక్టు నిర్వహణలో భాగంగా గేట్ల మరమ్మతు, ఆయిలింగ్ చేస్తారు. అయితే రెండేళ్లుగా తమ భూభాగం పరిధిలో ఉన్న 13 గేట్లను స్వాధీనం చేసుకుని వాటి నిర్వహణను ఏపి అధికారులే నిర్వహిస్తున్నారని, తీరా ఆ గేట్ల మరమ్మతుకు వచ్చే సరికి తెలంగాణ మీదనే భారం మోపుతున్నారని రాష్ట్ర నీటిపారుదలశాఖవర్గాలు మండిపడుతున్నాయి. ఆ 13 గేట్ల మరమ్మతును తెలంగాణనే చేపట్టాలంటూ ఏకంగా కెఆర్ఎంబితోపాటు తెలంగాణ నీటిపారుదలశాఖకు తాజాగా ఏపి లేఖ రాయడం వివాదాన్ని రాజేసింది. ప్రతి వేసవిలో సాగర్ గేట్లకు మరమ్మతులు, ఆయిలింగ్ నిర్వహించాల్సి ఉంటుంది. వర్షాకాలంలో వరద పొటెత్తితే గేట్లను ఎత్తే సమయంలో ఎలాంటి సాంకేతిక సమస్య రాకుండా ఉండేందుకు, ప్రాజెక్టుకు ప్రమాదం రాకుండా ఉండేందుకు ప్రతి వేసవిలో తప్పనిసరిగా మరమ్మతులు నిర్వహిస్తుంటారు. అయితే 1 నుండి 13 గేట్ల వరకు తెలంగాణ నిర్వహిస్తుండగా 14 నుంచి26 వరకు ఏపి ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఈ గేట్లను ఎత్తేందుకు, ఆ గేట్ల ప్రాంతంలోకి ఎపి అధికారులు తెలంగాణ అధికారులను అనుమతించడం లేదు. దీంతో సాగర్ ప్రాజెక్టు విషయంలో ఎప్పటి నుంచో ఇరు రాష్ట్రాల మధ్య ఘర్షణ పూరిత వాతావరణం నెలకొంటోంది. అయితే తాజాగా 14 నుంచి 26 గేట్ల వద్దకు తెలంగాణ అధికారులను అనుమతించనపుడు వాటి నిర్వహణ, మరమ్మతుల వ్యయాన్ని కూడా ఎపినే భరించాలని తెలంగాణ నీటిపారుదలశాఖ స్పష్టం చేస్తోంది. ఈ వివాదాన్ని పరిష్కరించాల్సిన బాధ్యత కెఆర్ఎంబిపైన ఉందని, నిర్లక్ష్యం చేస్తే ప్రాజెక్టుకు నష్టం జరిగితే అది రైతులపాలిట శాపంగా మారుతుందన్నారు.

## సాధారణ ట్రాఫిక్‌లోనే సిఎం రేవంత్‌రెడ్డి కాన్వాయ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 7:** ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తన కాన్వాయ్‌తో సాధారణ ట్రాఫిక్‌లోనే ప్రయాణించడం ప్రత్యేకంగా నిలిచింది. తన ప్రయాణం వల్ల ప్రజలకు రహదారులపై ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. గురువారం మధ్యాహ్నం ఢిల్లీ నుంచి వచ్చిన సిఎం రేవంత్‌రెడ్డి శంషాబాద్ విమానాశ్రయం నుంచి తన నివాసం వరకు సాధారణ ట్రాఫిక్ లోనే పయనించారు. తన కాన్వాయ్ కోసం సిటీలో వాహనాలను నిలిపివేయడంపై పోలీస్ ఉన్నతాధికారులకు బుధవారం ఉదయం ఢిల్లీకి వెళ్లే ముందు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ప్రజలకు రోడ్లపై ఇబ్బందులు కలిగించే చర్యలను పూర్తిగా నివారించాలని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో కాన్వాయ్ వెళ్లే సమయంలో ట్రాఫిక్‌ను పూర్తిగా నిలిపి వేయకుండా సింగిల్ లైన్‌లో వాహనాలను ట్రాఫిక్ పోలీసులు అనుమతించారు.

## విజయ్‌కు జడ్‌ప్లస్ కేటగిరీ భద్రత ఉపసంహారణ



**చెన్నై, మే 7:** తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత, నటుడు సి.జోసెఫ్ విజయ్‌కు తమిళ నాడు ప్రభుత్వం కల్పించిన ముఖ్యమంత్రి స్థాయి భద్రతను ఉపసంహరించారు. బుధవారం రాత్రి ఈ మేరకు రాష్ట్ర పోలీసు యంత్రాంగం ఆయన కాన్వాయ్‌తో పాటు ఇతర భద్రతా ఏర్పాట్లను వెనక్కి తీసుకుంది. టీవీకే పార్టీ నేతల విజ్ఞప్తి మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఓ సీనియర్ పోలీస్ అధికారి వెల్లడించారు. 2025 అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపులో టీవీకే భారీ విజయం దిశగా దూసుకెళ్లిన వెంటనే, మే 4వ తేదీన విజయ్ నివాసం, పార్టీ కార్యాలయం వద్ద పోలీ సులు భద్రతను భారీగా పెంచారు. ముఖ్యమంత్రికి కల్పించే జెడ్‌ప్లస్ స్థాయికి సమానంగా ఈ భద్రత కొనసాగింది. ఒక డీఐజీ స్థాయి అధికారి పర్యవేక్షణలో, పదుల సంఖ్యలో కమాండోలతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఇద్దరు ఎస్పీ స్థాయి అధికారులను కూడా ప్రత్యేక డ్యూటీలో నియమించారు. అయితే, కాన్వాయ్ లేదా ప్రత్యేక భద్రతా ప్రోటోకాల్ తమకు వద్దని టీవీకే సీనియర్ నేతలు కోరినట్టు ఓ అధికారి తెలిపారు. వారి అభ్యర్థన మేరకు భద్రతను తగ్గించి, ప్రత్యేక డ్యూటీలో ఉన్న అధికారులను తిరిగి వారి పాత పోస్టింగులకు పంపినట్టు వివరించారు. అదే సమయంలో, విజయ్‌కు కేంద్ర ప్రభుత్వం కల్పించిన వైఖి కేటగిరీ భద్రత యథాతథంగా కొనసాగుతుందని పోలీసు వర్గాలు స్పష్టం చేశాయి. సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ సిబ్బంది ఆయన ప్రయాణాల్లో, నివాసం వద్ద భద్రత కల్పిస్తారు. దీనికితోడు పార్టీ నియమించుకున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు కూడా ఉంటారు.

## దూసుకొస్తున్న ద్రోణి

### రాష్ట్రానికి మూడు రోజులపాటు భారీ వర్ష సూచన

**హైదరాబాద్, మే 7, ప్రభాతవార్త:** భానుడి భగభగలతో అల్లాడుతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ శాఖ శుభవార్త చెప్పింది. కర్ణాటక నుంచి రాయలసీమ, తెలంగాణ మీదుగా ఏర్పడిన ద్రోణి ప్రభావంతో రానున్న మూడు రోజులపాటు తెలంగాణతోపాటు ఏపిలోనూ వర్షాలు కురుస్తాయని తెలిపింది. తాజా వాతావరణ మార్పులతో గత కొన్ని రోజులుగా నమోదవుతున్న గరిష్ఠ ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గి వాతావరణం చల్లబడే అవకాశం ఉందని తెలిపింది. ద్రోణి ప్రభావంతో తెలంగాణలోని ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ, మెదక్, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఎక్కువగా ఉందని వెల్లడించింది. ఈ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతోపాటు బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. అకాలవర్షాల నేపథ్యంలో ఉరుములు సంభవించే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బయట తిరగొద్దని అధికారులు సూచించారు. ఇక ఆంధ్రప్రదేశ్‌లోనూ ద్రోణి ప్రభావంతో ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. తీర ప్రాంతాల్లో ఉరుములతో కూడిన జల్లులు పడవచ్చని వాతావరణ కేంద్రం అంచనా వేసింది. వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ముఖ్యంగా రైతులు కోతకు వచ్చిన పంటలను కాపాడు కోవడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ధాన్యం తడవకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులు సూచించారు.

## ఎసిబి వలలో ఎఫ్‌డిఓ, డిఆర్ఓ

### రూ. 3.5 లక్షలు లంచం తీసుకుంటూ దొరికిపోయిన అధికారులు

**భద్రాచలం, ప్రభాతవార్త:** భద్రాచలం అటవీశాఖ కార్యాలయంలో గురువారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సమయంలో రూ.3.50 లక్షలు లంచం తీసుకుంటూ భద్రాచలం డివిజనల్ ఫారెస్టు అధికారిణి సుజాత, చర్ల ఇన్‌చార్జి డీఆర్‌వో కృష్ణయ్యలు పట్టుబడ్డారు. చర్ల మండలం పూసగుప్ప ప్రాంతంలో నూతన రోడ్డు వేస్తున్న సమయంలో అటవీ శాఖకు చెందిన కొన్ని చెట్లను తొలగించాల్సి వచ్చింది. ఈ నిబంధనల ఉల్లంఘనను సాకుగా చూపి, సదరు కాంట్రాక్టరుపై చర్యలు తీసుకోకుండా ఉండేందుకు భద్రాచలం ఫారెస్ట్!! డివిజనల్ ఆఫీసర్ సుజాత, చర్ల ఇన్‌చార్జి డీఆర్‌వో కృష్ణయ్య రూ. 10 లక్షలు డిమాండ్ చేశారు. దీంతో సదరు కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఈ క్రమంలో గురువారం ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ ఆధ్వర్యంలో అధికారులు అటవీశాఖ కార్యాలయంకు చేరుకున్నారు. ఈ సమయంలో రూ.3.5 లక్షల లంచం తీసుకుంటుండగా ఇరువురు అధికారులను పట్టుకున్నారు. అనంతరం ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ విలేకర్లతో మాట్లాడుతూ ఇద్దరు అటవీశాఖ అధికారులకు మాకు వచ్చిన సమాచారం ఆధారంగా గురువారం పట్టుకున్నామని తెలిపారు.



## బిఆర్ఎస్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై దాడికి కెటిఆర్, హరీశ్‌రావు ఖండన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 7:** కరీంనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై బండి సంజయ్ అనుచరుల దాడిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రంగా ఖండించారు. కరీంనగర్ పట్టణంలో బీజేపీ కార్యకర్తలు ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ ఆఫీస్‌పై కర్రలు, రాడ్లతో దాడి చేసి కిటికీల అద్దాలు పగులగొట్టడం పెద్ద దుమారం రేపింది. హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ప్రెస్ మీట్ ముగిసిన 10 నిమిషాలకే బీజేపీ నాయకులు, కార్యకర్తలు దాడికి పాల్పడి కౌశిక్ రెడ్డి వాహనం ధ్వంసం చేశారు. కౌశిక్ రెడ్డిపై సైతం దాడికి యత్నించారు. ఈ నేపథ్యంలో కేటీఆర్ ఎమ్మెల్యే పార్టీ కౌశిక్ రెడ్డితో ఫోన్లో మాట్లాడి నాయకులు, కార్యకర్తల యోగక్షేమాల అడిగి తెలుసుకున్నారు. ఏకంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే, ఆయన అనుచరులు దాడి చేయడం అత్యంత దురదృ ష్టకరమని కేటీఆర్ అన్నారు. దాడులకు పాల్పడిన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని హరీశ్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## 25, 26 తేదీల్లో ఎస్‌బిఐ సమ్మె

**హైదరాబాద్, మే 7, ప్రభాతవార్త:** దేశంలోనే పభుత్వ రంగ సంస్థలోని అతిపెద్ద బ్యాంక్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఖాతాదారులకు ముఖ్యమైన అలర్ట్ ఇచ్చింది. ఈ నెలలో వరుసగా నాలుగు రోజుల పాటు బ్యాంక్ సేవలు నిలిచిపోయే అవకాశం ఉందని పేర్కొంది. ఈ నేపథ్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు వరుసగా నాలుగు రోజులు సెలవులు రాను న్నాయి. ఎస్‌బిఐ అధికారుల వివరాల ప్రకారం ఈ నెల 25, 26 తేదీల్లో ఎస్‌బీఐ ఉద్యోగులు దేశవ్యాప్తంగా సమ్మెకు వెళ్లనున్నారు. ఈ సమ్మెకు ఆల్ ఇండియా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ ఫెడరేషన్ (ఏఐఎస్‌బీఐఎస్ఎఫ్) పిలుపునిచ్చింది. సిబ్బంది కొరత, పెన్షన్ సమస్యలు, పాత ఒప్పందాల అమలు వంటి మొత్తం 16 ప్రధాన డిమాండ్ల సాధన కోసం ఈ సమ్మె నిర్వ హిస్తున్నారు. సమ్మెకు ముందు వచ్చే నాలుగో శనివారం, తర్వాత రోజు ఆది వారం ఇప్పటికే బ్యాంకులకు సెలవులు ఉంటాయి. అంటే మే 24 (నాలుగో శనివారం), మే 25 (ఆదివారం), మే 26, 27 (సమ్మెరోజులు) ఇలా వరు సగా 4 రోజులు స్టేట్ బ్యాంక్ సేవలు ప్రభావితమయ్యే అవకాశం ఉంది.

08-05pg12 ONG_08-05pg10.qxd 07/May/26 11:09 PM Page 1



# ఐపిఎల్‌లో సెంచరీల మోత

## లక్నో తరపున మార్ష్ తొలి సెంచరీ నమోదు



**లక్నో:** ఐపీఎల్‌లో సెంచరీల మోత మోగుతోంది. గురువారం 12వ సెంచరీ నమోదైంది. ఆర్సీబీతో జరిగిన ఈ మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ ఓపెనర్ ఈ ఫీట్ సాధించాడు. ఈ సీజన్‌లో తేలి పోతూ నిరాశపరిచిన మిచెల్ మార్ష్ తొలిసారి తన స్థాయికి తగ్గ బ్యాటింగ్ చేశాడు. భువనేశ్వర్ బంతికి సింగిల్‌తో ఖాతా తెరిచిన మిచెల్ మార్ష్..ఆ తర్వాత ప్రతి బౌలర్‌ను దంచేశాడు. ఈ సీజన్‌లో వికెట్ల వేటతో రెచ్చిపోతున్న భువనేశ్వర్, హేజిల్‌వుడ్‌ను సైతం మార్ష్ బాదుడుకు బలయ్యారు. కుర్రాడు రసిక్ దార్ సలాంతో పాటు స్పిన్నర్ కృనాల్ పాండ్యాను సైతం మిచెల్ మార్ష్ ఉతికేశాడు.

హాజిల్‌వుడ్ బంతికి సిక్స్‌తో మొదలుపెట్టిన మిచెల్ మార్ష్... ఆ తర్వాత ఫోర్లు, సిక్స్‌లు కురి పించాడు. భువనేశ్వర్ ఓవర్లో ఓ సిక్స్, క్రూనాల్ బంతులకు ఫోర్, సిక్స్, రసిఖ్ ఓవర్లో రెండు సిక్స్‌లు, ఓ ఫోర్‌తో 17 పరుగులు సాధించాడు. హాజిల్‌వుడ్ వేసిన ఏడో ఓవర్లో బ్యాక్ టు బ్యాక్ బౌండరీలతో కేవలం 20 బంతుల్లోనే ఫాసెస్ట్ హాఫ్ సెంచరీ సాధించాడు. ఐపీఎల్‌లో మార్ష్‌కు ఇదే వేగ వంతమైన హాఫ్ సెంచరీ. లక్నో తరపున అతడు ఏడో ఫాస్టెస్ట్ ఫిఫ్టీ నమోదు చేశాడు. హాఫ్ సెంచరీ దాటినా మిచెల్ మార్ష్ దూకుడు తగ్గలేదు. అదే దూకుడుతో బంతులను స్టాండ్స్‌లోకి పంపాడు. 14వ ఓవర్లో షెఫర్డ్ వేసిన బంతులను వరుసగా రెండు బౌండరీ, ఓ సిక్స్‌తో సెంచరీ పూర్తి చేశాడు. 49 బంతుల్లో ఈ సెంచరీ వచ్చింది. ఇందులో 9 ఫోర్లు, 8 సిక్స్‌లు ఉన్నాయి. ఈ ఐపీఎల్ సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్ తరపున సెంచరీ చేసిన తొలి బ్యాట్స్‌మెన్‌గా మిచెల్ మార్ష్ నిలిచాడు.

## 200 మ్యాచ్‌ల క్లబ్‌లో భువనేశ్వర్

**లక్నో:** ఐపీఎల్ 2026 సీజన్‌లో సూపర్ ఫామ్ కనబరుస్తున్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు స్టార్ బౌలర్ భువనేశ్వర్ కుమార్.. లక్నో సూపర్ జెయింట్స్‌తో మ్యాచ్‌లో అరుదైన రికార్డు సాధించాడు. ఇది భువనేశ్వర్‌కు 200వ మ్యాచ్. ఐపీఎల్లో ఈ ఘనత సాధించిన తొలి పేసర్‌గా భువనేశ్వర్ ఘనత అందుకున్నాడు. ఓవరాల్‌గా ఐపీఎల్‌లో 200 మ్యాచ్‌లు ఆడిన ఆటగాళ్ల జాబితాలో భువనేశ్వర్ 12వ స్థానంలో ఉన్నాడు. భువీ 200 మ్యాచ్‌ల్లో 215 వికెట్లు పడగొట్టాడు. ఈ సీజన్‌లో ఆర్సీబీ తరఫున 10 మ్యాచ్‌ల్లో 17 వికెట్లు తీసి పర్పుల్ క్యాప్ రేసులో ముందున్నాడు. 2011లో ఐపీఎల్‌లో అరంగేట్రం చేసిన భువనేశ్వర్ తొలుత పుణే వారియర్స్ తరపున 26 మ్యాచ్‌లు, ఎస్ఆర్‌హెచ్ తరపున 129 మ్యాచ్‌లు, ఆర్సీబీ తరపున 44 మ్యాచ్‌లు ఆడాడు. అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాళ్ల జాబితాలో ధోనీ(278 మ్యాచ్‌లు), రోహిత్ శర్మ(277), విరాట్ కోహ్లీ(276) టాప్ త్రీలో ఉన్నారు.

## తెలంగాణ టీ20 క్రికెట్ లీగ్‌కు బిసిసిఐ గ్రీన్ సిగ్నల్

**హైదరాబాద్, మే 7:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఎ) ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న తెలంగాణ టీ20 క్రికెట్ లీగ్‌కు బిసిసిఐ అధికారికంగా ఆమోదం ఇచ్చింది. టీజీ20 లీగ్‌కు బీసీసీఐ ఆమోదం లభించడంతో హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. బీసీసీఐ ప్రధాన కార్యదర్శి దేవజిత్ సైకియాకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ లీగ్‌ను అత్యంత పారదర్శకంగా, అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహిస్తామని హెచ్‌సీఏ కార్యదర్శి జీవన్ రెడ్డి అన్నారు. గతంలో ఇతర రాష్ట్రాల్లో విజయవంతమైన టీఎన్‌పీఎల్, కేపీఎల్ తరహాలోనే తెలంగాణ లీగ్ కూడా విజయవంతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ టోర్నీ ద్వారా రాష్ట్రం నుంచి మరికొంత మంది స్టార్ ఆటగాళ్లు తయారయ్యే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం ఫ్రాంచైజీల ఎంపిక, ఆటగాళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియపై కసరత్తు జరుగుతోంది. త్వరలోనే టోర్నీ షెడ్యూల్, వేదికలు, ప్రైజ్ మనీ వివరాలను త్వరలో వెల్లడిస్తారు. టీజీ లీగ్‌లో ప్రతిభ కనబరిచే ప్లేయర్లకు ఐపీఎల్ వంటి మెగా లీగ్‌లలో చోటు దక్కించుకునే సువర్ణావకాశం ఉంటుందని, ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌సీఏ పేర్కొంది.










# హైదరాబాద్ టాప్ గేర్

(వార్త క్రీడా విభాగం)

ఇండియన్ ప్రీమియర్ లీగ్ కీలక దశకు చేరుకుంది. ప్లేఆఫ్‌లోని నాలుగు బెర్త్‌ల కోసం మ్యూజికల్ చెయిర్ ప్రారంభమైంది. ఆట ఆగిందో సీటు గోవిందా అన్నట్లుగా తయారైంది. రోజు రోజుకు ప్లే ఆఫ్ సమీకరణాలు మారిపోతూ ఉత్కంఠ రేపుతోంది. టాప్ ప్లేస్ పక్కా అనుకున్న పంజాబ్ హ్యాట్రిక్ పరాజయాలతో వెనకబడగా...మొన్నటివరకు గెలుపు రుచి చూడని జట్లు వరుస విజయాలతో దూసుకువచ్చాయి. దీంతో ప్లే ఆఫ్ చేరే జట్ల మధ్య ఆసక్తికర పోరు నెలకొంది.

ఉప్పల్‌లో ఉప్పెనలా విరుచుకుపడుతున్న సన్ రైజర్స్ టేబుల్ టాపర్‌గా నిలిచింది. నిజానికి ఈ స్థానానికి చేరుకుంటుందని ఈ సీజన్ ఆరంభంలో సన్‌రైజర్స్ ఆటతీరు చూసిన ఎవ్వరూ ఊహించలేదు. తొలి మ్యాచ్‌లోనే ఆర్సీబీ చేతిలో ఓటమి. ఆపై కోల్‌కతాపై నెగ్గినా ఆ వెంటనే రెండు పరాజయాల వెక్కిరింత. సొంత గ్రౌండ్‌లోనే ఓటమి. ఈ స్థితిలో సన్ రైజర్స్ ఆటతీరు ఒక్కసారిగా టాప్ గేర్‌లోకి వెళ్లింది. ఉప్పల్‌లోనే రాజస్థాన్ రాయల్స్‌పై బిగ్ విక్టరీ అందుకున్న ఆరేంజ్ ఆర్మీ ఆ తర్వాత అదరగొట్టింది. వరుసగా అయిదు విజయాలతో రేసులోకి వచ్చింది. మధ్యలో కేకేఆర్ మ్యాచ్‌లో తలబడ్డా వెంటనే పుంజుకుని టాప్ ప్లేస్‌కు చేరుకుంది. దీనికంతటికీ ఫియర్ లెస్ ఫైటింగే కారణం. సన్‌రైజర్స్ టాప్ ప్లేస్ అందుకుం దంటే ప్రతి ప్లేయర్‌ది కీలక రోల్.

### విధ్వంసక ఓపెనింగ్ జోడీ

అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్‌లదే ఐపీఎల్‌లో అత్యంత ప్రమాదకరమైన ఓపెనింగ్ జోడీ. మొదట్లో హెడ్ ఇబ్బంది పడినా.. ఆ లోటు తెలియనీయకుండా అభిషేక్ కవర్ చేసేవాడు. ఇప్పుడు ఆసీస్‌స్టార్ బ్యాటర్ కూడా శివాలెత్తడం మొదలుపెట్టాడు. కీలక సమయంలో ఫామ్ అందుకోవడం సన్‌రైజర్స్‌కు కలిసొస్తోంది. అభి 11ఇన్నింగ్స్‌లో 47.50 సగటుతో 475 రన్స్ సాధించి మోస్ట్‌రన్స్‌లో రెండో స్థానంలో ఉన్నాడు. ఓ సెంచరీ, మూడు హాఫ్ సెంచరీలతో సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. ట్రావిస్ కూడా 11మ్యాచ్‌ల్లో 45.40 సగటుతో 361 రన్స్ సాధించాడు. 2 హాఫ్ సెంచరీలు ఉన్నాయి.



### మూలస్థంభాల్లా ఇషాన్, క్లాసెన్

ఓపెనర్లు ఏడెనిమిది ఓవర్‌కల్లా స్కోరును సెంచరీ దాటించేస్తుంటే ఆ తర్వాత బాధ్యతను ఇషాన్ కిషన్ మోస్తున్నాడు. మెరుపు ఇనింగ్స్‌లతో అదరగొడుతున్నాడు. క్రీజ్‌లోకి వచ్చింది మొదలు భారీ షాట్లతో విరుచుకుపడుతూ పటిష్ట స్కోర్లు అందిస్తున్నాడు. 11ఇన్నింగ్స్‌లో నాలుగు అర్థసెంచరీతో 409 రన్స్ చేసి టాప్-4లో ఉన్నాడు. ఇక మిడిల్ ఓవర్లలో హెన్రిచ్ క్లాసెన్ ఇన్నింగ్స్ సన్‌రైజర్స్‌కు ప్లస్ అవుతోంది. చివరి వరకూ క్రీజ్‌లో నిలబడి భారీ స్కోరు అందించే బాధ్యత తీసుకుంటున్నాడు. 11 మ్యాచ్‌ల్లో 54.88 బ్యాటింగ్ సగటుతో 494 రన్స్ చేసి టాప్ ప్లేస్‌లో ఉన్నాడు. ఆ మాటకొస్తే టాప్-4 లో ముగ్గురు సన్‌రైజర్స్ ప్లేయర్లే.

### నితీష్ ఆల్‌రౌండర్ షో

ఈ సీజన్‌లో అత్యంత నిలకడైన ఆటతీరుకు క్లాసెన్ మారుపేరుగా నిలిస్తే, అతనికి చక్కని తోడ్పాటు ఇస్తూ సూపర్ ఆల్‌రౌండర్‌గా నితీష్ కుమార్ రెడ్డి నిలుస్తున్నాడు. మిడిల్ ఓవర్ నుంచి చివరివరకూ హెన్రిచ్ క్లాసెన్ నితీశ్ కుమార్ రెడ్డి జోడీ మ్యాచ్‌ను తీసుకెళ్తున్న తీరు అద్భుతం. పది మ్యాచ్‌ల్లో 31,71 బ్యాటింగ్‌సగటుతో 222 రన్స్ సాధించాడు. అలాగే కీలక దశలో వికెట్లూ పడగొడుతూ సన్ రైజర్స్ విజయాల్లో కీ రోల్ పోషిస్తున్నాడు. గత సీజన్‌లో 13 మ్యాచులు ఆడిన నితీష్ కుమార్ కేవలం 182 పరుగులు, 2 వికెట్లు మాత్రమే తీశాడు. ప్రస్తుతం సీజన్‌లో 10 మ్యాచుల్లోనే 222 పరుగులు, ఏడు వికెట్లు తీసి సత్తా చాటాడు.

### అప్పుడప్పుడు ఆ ఇద్దరు

సన్‌రైజర్స్ బ్యాటింగ్ ఆర్డర్‌లో సలీల్ అరోరాతోపాటు అనికేత్ వర్మ సత్తా చాటుతున్నాడు. ఎప్పుడు ఛాన్స్ వచ్చినా నిరూపించుకొనేందుకు సిద్ధంగా ఉండటం ఎస్ఆర్‌హెచ్‌కు సానుకూలాంశం. ఇద్దరూ స్లాగ్ ఓవర్లలో ధాటిగా ఆడుతూ పరుగులు అందిస్తున్నారు.

### సన్‌రైజర్స్ బౌలింగ్ జోరు

ఆరేంజ్ ఆర్మీ బౌలింగ్ ఈ సీజన్‌లో వైవిధ్యంగా ఉంది. పర్పుల్ క్యాప్ రేసులో పోటీపడుతోన్న మలింగ...ఆరంభంలోనే బ్రేక్ అందిస్తూ ఇప్పటి వరకు 16 వికెట్లు పడగొట్టాడు. ఇక ఆలస్యంగా వచ్చినాతనఇంపాక్ట్ ఏంటో కెప్టెన్ ప్యాట్‌కమిన్స్ చూపిస్తున్నాడు. వీరితో పాటు సకిబ్ హుస్సేన్ (10 వికెట్లు) ప్రతి మ్యాచ్‌లోనూ వికెట్ తీస్తూ సత్తా చాటాడు. ప్రఫుల్ హింగే (8), శివాంగ్ (8), హర్ష్ దూబే (8) అదరగొట్టేస్తున్నారు.

టాస్ ప్లేస్‌కు చేరుకున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ ఈ స్థానాన్ని నిలబెట్టుకోవాలంటే ఇదే స్థాయి విజయాలు అవసరం. ఇంకా మూడు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఈనెల 12న అహ్మదాబాద్‌లో గుజరాత్ టైటాన్స్‌తో... 18న చెన్నైలో చెన్నై సూపర్ కింగ్స్‌తో, 22న సొంతగడ్డ ఉప్పల్ స్టేడియంలో ఆర్సీబీతో తలపడనుంది. ఈ మూడు మ్యాచ్‌లు నెగ్గితేనే టాప్-2 ఛాన్స్ ఉంటుంది. కనీసం రెండు నెగ్గినా ప్లే ఆఫ్ చేరుకుంటుంది. ఇది జరగాలంటే సన్‌రైజర్స్ టాప్ గేర్‌లోనే వెళ్లాల్సి ఉంటుంది.




## చివరి నిమిషంలో లాభాల స్వీకరణ

# స్వల్ప నష్టాల్లో సెన్సెక్స్,నిఫ్టీ

**ముంబయి, మే 7:** ఎగువస్థాయిలో లాభాల స్వీకరణ పెరగడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు స్వల్ప నష్టాలతో గురువారం ట్రేడింగ్ ముగించాయి. అమెరికా ఇరాన్ శాంతి ఒప్పందం కొలిక్కి వస్తుందన్న ఆశలు, భౌగోళిక ఉద్రిక్తతలు సర్దుబాటవుతాయన్న అంచనాలతో స్టాక్ మార్కెట్లు ప్రారంభంలో పెరిగినప్పటికీ ఇంట్రాడే తర్వాత ఎగువస్థాయిలో లాభాలు స్వీకరణ జరిగింది. ముడిచమురు కూడా బ్యారెల్‌కు 100 డాలర్ల దిగువకు రావడం, రూపాయి మారకం విలువల్లో 23 పైసలు రికవరీ వంటివి కొన్ని రంగాలకు కలిసొచ్చాయి. అలాగే నాలుగోత్రైమాసిక ఫలితాలు కూడా కొన్ని సూచీలకు ఊతం ఇచ్చాయి. ఐటి, ఎఫ్ఎంసిజి, కన్స్యూమర్ రంగాల షేర్లు క్షీణించాయి. ఆటో, ప్రైవేటు బ్యాంకింగ్ రంగ షేర్లు మాత్రం లాభాల్లో ముగిసాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 114 పాయింట్లు క్షీణించి 77,844.52 పాయింట్లకు చేరితే నిఫ్టీ 50 సూచీ 4.30 పాయింట్లు క్షీణించి 24,326.65 పాయింట్ల వద్ద నమోదయింది. హిందూస్థాన్ యూనిలీవర్ 1.95శాతం, టిసిఎస్ 1.38శాతం, ఐటిసి 0.95 శాతం చొప్పున క్షీణించాయి. బిఎస్ఇలో మిడ్‌క్యాప్ సూచీ 0.99శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 1.07శాతం పెరిగాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ రికార్డుగరిష్టానికి అంటే 22,808.45 పాయింట్లకు పెరిగింది. ఇక గురువారం ట్రేడింగ్‌లో బిఎస్ఇ 2735 షేర్లుపెరిగితే 1521షేర్లు క్షీణించాయి. 174కంపెనీలు స్థిరంగా కొనసాగాయి. పదేళ్ల బాండ్లు 0.03శాతంపెరిగి 6.928 శాతంగా నడిచింది.

విదేశీ కరెన్సీ మార్కెట్‌లో రూపాయి మారకం విలువలు ముందురోజు 94.49 నుంచి 94.24కి పటిష్టపడింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు 0.50శాతం పెరిగి రూ.1,52,896చొప్పున కొనసాగింది. అమెరికా పదేళ్లబాండ్లు 0.57శాతం క్షీణించి 4.330శాతంగా కొనసాగితే కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్ ముడిచమురు బ్యారెల్ ఒక్కంటికి ఫ్యూచర్స్‌లో 2.212డాలర్లు క్షీణించి 99.15 డాలర్లుగా కొనసాగింది. యూరోపియన్ మార్కెట్లు గురువారం క్షీణించాయి.

ఆసియా మార్కెట్లపరంగాచూస్తే జపాన్ ఈక్విటీలు రికార్డుస్థాయికి పెరిగాయి. అమెరికా ఇరాన్ శాతం డీల్ ఎక్కువ ప్రభావం చూపించింది. అమెరికా స్టాక్స్ రాత్రికిరాత్రే ర్యాలీ తీసాయి. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు తగ్గుతున్నాయన్న అంచనాలే ఇందుకు కీలకం. ఎస్‌అండ్‌పి 500 1.46శాతం పెరిగితే నాస్‌డాక్ కాంపోజిట్ 2.20 శాతం ర్యాలీ తీసింది. రెండు సూచీలు కూడా రికార్డు గరిష్టాలను తాకాయి. డౌజోన్స్ పారిశ్రామిక సగటు 612.34 పాయింట్లుపెరిగింది. ఎల్‌అండ్‌టి 0.35శాతం పెరిగితే కార్‌ట్రేడ్ టెక్ కూడా 6,.52శాతం, బజాజ్ ఆటో 2.83శాతం, సిజి పవర్ ఇండస్ట్రియల్ సొల్యూషన్స్ 3.54 శాతం, ఐఐఎఫ్ఎల్ క్యాపిటల్ సర్వీసెస్ 5.99 శాతం పెరిగాయి. భారత్ ఫోర్జ్ 6.23శాతం క్రాఫ్ట్స్‌మాన్ ఆటోమేషన్ 10.96శాతం బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్ 4.62శాతం చొప్పున పెరిగాయి. మీషో కూడా 1.07శాతం పెరిగింది. టిడి పవర్ సిస్టమ్స్ 7.23శాతం, యాప్టస్ వాల్యూ హౌసింగ్ ఫైనాన్స్ 3.09శాతం చొప్పున పెరిగితే బిఎం డబ్ల్యు ఇండస్ట్రీస్ 5.11శాతం ర్యాలీ తీసాయి. కాన్సాయ్ నెరొలాక్ పెయింట్స్ 4.94శాతం, అప్కోటెక్స్ ఇండస్ట్రీస్ 20శాతం ఆర్ సిస్టమ్స్ ఇంటర్నేషనల్ 4.80శాతం, స్వాలా వైన్‌యార్డ్స్ 1.47శాతం చొప్పున పెరిగాయి.




## బిఎస్ఇ నికరలాభం రూ.797 కోట్లు

**ముంబయి, మే 7:** బాంబే స్టాక్ ఎక్స్ఛేంజి నాలుగో త్రైమాసికంలో 32.5శాతం లాభాలను పెచుకోగలిగింది. ఈత్రైమాసికంలో రూ.602 కోట్లనుంచి రూ.797 కోట్లకు లాభం పెరిగింది. ఎక్స్ఛేంజి రాబడులు కూడా 25.7శాతం పెరిగాయి. రూ.1244కోట్లనుంచి రూ.1564 కోట్లకు చేరాయి. ఇక ఎబిడిటా ప్రకారం చూస్తే 43.9శాతంపెరిగి రూ.738 కోట్లనుంచి రూ.1061 కోట్లకు పెరిగింది. పన్నుల వ్యయాలు రూ.199 కోట్లనుంచి రూ.268 కోట్లకు పెరిగాయి. బిఎస్ఇ వాటాదారులకు ప్రతి షేరుకు రూ.10 చొప్పున డివిడెండ్‌ను కూడాప్రకటించింది. అయితే 2018 తర్వాత అతితక్కువ మొత్తం డివిడెండ్ ప్రకటించడం ఇదే మొదటిసారి. కంపెనీ డివిడెండ్ పంపిణీ సుమారు 407.88 కోట్లు వాటాదారులకు అందచేస్తామని చెప్పింది. రికార్డుతేదీ జులై 10గా చెప్పింది. సంస్థ సర్వసభ్యసమావేశంలో వాటాదారుల ఆమోదం తర్వాత డివిడెండ్‌పంపిణీజరుగుతుందని చెప్పింది. ఆమోదం పొందినతర్వాత డివిడెండ్‌ను ఈ ఏడాది సెప్టెంబరు 17వ తేదీలోపు చెల్లిస్తుంది. కంపెనీ ఈనెల 14వ తేదీనే ప్రతి వాటాకు రూ.23 డివిడెండ్‌ప్రకటించింది. 2024లో అయితే కంపెనీ రూ.15 ప్రతిషేరుకు డివిడెండ్ ఇస్తామన్నది. అలాగే 2023లో కూడా ప్రతి వాటాకు రూ.12 డివిడెండ్‌ను ప్రకటించింది.

## డాలర్ వర్సెస్ రూపాయి 94.26

**న్యూఢిల్లీ, మే 7:** డాలరుతో రూపాయి విలువలు కొంతమేర పటిష్టం అయ్యాయి. మారకం విలువల్లో గురువారం 23 పైసలవరకూ రూపాయి రికవరీ కనిపించింది. గురువారం ట్రేడింగ్‌ముగిసేనాటికి ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజి కౌంటర్లలో డాలరుకు రూపాయి 94.26వద్ద ముగిసింది. ముడిచమురు ధరలు కొంతమే బ్యారెల్‌కు 100 డాలర్లకు లోబడి నమోదయ్యాయి. దీనికి తోడు అమెరికా ఇరాన్‌మధ్య 14 అంశాలతో కూడిన డిమాండ్లపై చర్చించి సానుకూల ఒప్పందం రెడీ అవుతుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడం కూడా రూపాయి పటిష్టతకు దారితీసింది. ముడిచమురు దిగమతుల బిల్లులు ఇపుడు తగ్గుతుండటంతో రూపాయి మారకం విలువలు పటిష్టం అయ్యాయి. ఉదయం 94.77వద ప్రారంభం అయిన ట్రేడింగ్ అంతకుముందురోజు 28 పైసలు క్షీణించింది. గురువారం ఇంట్రాడేలో రూపాయి విలువలు 94.90వద్దకు కూడా చేరాయి. ఒకదశలో 94.08వరకూ దిగివచ్చింది. చివరకు 94.26వద్ద ట్రేడింగ్‌ముగిసింది. ముందురోజు ముగింపుకంటే 23 పైసలు బలపడిందని ట్రేడర్లు వెల్లడించారు. బుధవారం రూపాయి 69 పైసలు పెరిగి డాలరుకు 94.49గా ట్రేడ్ అయింది. అయితే దిగుమతిదారులకు డాలర్ చెల్లింపులు, విదేశీ ఇన్వెస్టర్ల ఈక్విటీ విత్‌డ్రాలు వంటి డిమాండ్లు లాభాలను కట్టడిచేస్తాయి. రానున్న రోజుల్లో రూపాయి మారకం డాలరుకు 93.80 నుంచి 94.40వరకూ ఉండవచ్చుని మిరాయ్ అసెట్ షేర్‌ఖాన్ విశ్లేషకులు అనూజ్ చౌదరి అన్నారు. ముడిచమురు గ్లోబల్ బెంచ్‌మార్క్‌లో 2.23శాతం తగ్గి బ్యారెల్‌కు 99.01 డాలర్లుగా ఉంది. ముందురోజు విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.5,834.90 కోట్ల పెట్టుబడులను విత్‌డ్రాచేసుకున్నారు.






## ఎన్ఎస్ఇలో ప్రభుత్వ రంగ సంస్థల వాటాదారులు

# 15 వేల కోట్ల ఆఫర్ ఫర్ సేల్

**ముంబయి, మే 7:** నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజిలోని ప్రభుత్వరంగ సంస్థల వాటాదారులు సుమారు రూ.15,500 కోట్లమేర విక్రయించేందుకు నిర్ణయించారు. ఎన్ఎస్ఇ ఇందుకోసం ఆఫర్ ఫర్ సేల్ ప్రకటించింది. ఎన్ఎస్ఇలో 4-5 శాతం వాటాలు ఈ ఒఎఫ్ఎస్‌లో అమ్ముడుపోతాయి. ప్రభుత్వరంగ సంస్థలు ఎన్ఎస్ఇలో 31శాతం వాటాతో ఉన్నాయి. ఇపుడు సమారు 10శాతం వాటాలను విక్రయించాలని నిర్ణయించాయి. ఎన్ఎస్ఇ ఈక్విటీ మొత్తంలో 3.1శాతంగా ఉంటుందని అంచనా. ఎల్ఐసి అతిపెద్ద వాటాదారుగా ఉంది. ఒఎఫ్ఎస్‌కు కూడా ఎక్కువ మొత్తం ప్రకటించింది. సుమారు రూ.5,300 కోట్లు మేర ఒఎఫ్ఎస్‌లో సమీకరిస్తుందని అంచనా. ఎక్స్ఛేంజిస్థాయిలో ఒకటిశాతం ఈక్విటీ వాటాను విక్రయిస్తోంది. స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ తన వాటాల్లో రూ.2200 కోట్లు షేర్ల విక్రయం ద్వారా ఆర్జిస్తోంది. సుమారు 0.44శాతంగా ఉంటుంది. ఎస్‌బిఐ గ్రూప్ అనుబంధ ంస్థలు కూడా రూ.3700కోట్లు మేర షేర్లు విక్రయిస్తాయి. 0.7శాతం ఈక్విటీ విక్రయిస్తారని అంచనా. ప్రభుత్వ రంగ బీమా సంస్థలు సమిష్టిగా రూ.4వేల కోట్లు విత్‌డ్రాచేస్తాయి. ఎక్స్ఛేంజి విలువల్లో 0.8శాతం వాటాతో ఉంటాయి. ఎన్ఎస్ఇ కూడా సంస్థాగత వాటాదారులను పెట్టుబడులకు ప్రోత్సహిస్తోంది. సంస్థాగతంగా విక్రయాలు కూడా రూ.5 వేలనుంచి రూ.7500 కోట్లుగా ఉంటాయి. మొత్తంగా ఒఎఫ్ఎస్ రూ.20 వేల కోట్లనుంచి రూ.23 వేల కోట్లవరకూ ఉంటుందని అంచనా. ఈ మొత్తంతో ఎన్ఎస్ఇలో ఈక్విటా వాటాల విక్రయం అనేది 4నుంచి 5శాతంగా ఉంటుంది. న్యూ ఇండియా అస్యూరెన్స్, జిఐసి రె, టీమ్‌సెక్, క్రిస్ క్యాపిటల్ వంటిసంస్థలు ఈ ఒఎఫ్ఎస్‌లో పాల్గొనబోతున్నాయి.

## వేదిక్స్,స్కిన్‌క్రాఫ్ట్‌లో ఇమామి వాటా కొనుగోలు

**కోల్‌కత్తా, మే 7:** సౌందర్య ఉత్పత్తుల సంస్థ ఇమామి ఇంక్‌నట్ డిజిటల్‌లో 60శాతం వాటా కొనుగోలుకు ఒప్పందం చేసుకుంది. వినియోగ రంగ బ్రాండ్లు వేదిక్స్, స్కిన్‌క్రాఫ్ట్ సంస్థల్లో రూ. 321 కోట్లతో ఈ వాటాల కొనుగోలు చేస్తోంది. పనితీరు ఆధారంగా సర్దుబాట్లు ఉంటాయిన రెండేళ్ల వ్యవధిలో పూర్తవుతుందని వివరించింది వచ్చే నాలగున్నరేళ్లలో ఇక్‌నట్ డిజిటల్‌లో ఉన్న మిగిలిన వాటాను కూడా కొనేస్తుందని కంపెనీ వర్గాలు వెల్లడించారు. అయితే ఈకొనుగోలు రెండువిడతలుగా ఉంటుంది. ఇందుకు సంస్థ ప్రస్తుత, భవిష్యత్తు పనితీరును కూడా అంచనావేస్తారు. వేదిక్స్, స్కిన్‌క్రాఫ్ట్ రెండు సంస్థలు కూడా నేరు వినియోగరంగ విక్రయాలు అంటే డి2సి ప్లాట్‌ఫామ్‌లో కకేశ సంరక్షణ, చర్మసంరక్షణ ఉత్పత్తులను అందిస్తోంది. వేదిక్స అయితే ఆయుర్వేదిక్ ఫరిష్కారాలు అందిస్తుంది. స్కిన్‌క్రాఫ్ట్ సంస్థ అయితే చర్మసంరక్షణ సంబంధిత పరిష్కారాలు అందిస్తుంది ఇమామి వైస్‌ఛైర్మన్ ఎండి హర్షవర్ధన్ అగర్వాల్‌మాట్లాడుతూ కంపెనీ బ్యూటీ, పర్సనల్‌కేర్ విభాగంలో మరింత ఉనికిని విస్తరించేందుకు ఈ కొనుగోలు తోడ్పడుతుందని చెప్పారు. ఇంక్‌నట్ డిజిటల్ సిఇఒ చైదన్య నల్లాన్‌మాట్లాడుతూ ఇమామి భాగస్వామ్యంతో వేదిక్స్, స్కిన్‌క్రాఫ్ట్ మరింత విస్తరణదిశగా వెళతాయన్నారు. ఇప్పటికే ఇమామి దిమాన్ కంపెనీ, బ్రిల్లెయిర్‌సంస్థలనుకొనుగోలుచేసిన సంగతి తెలిసిందే. ఎఫ్ఎంసిజి రంగంలో అగ్రగామిగా ఉన్న ఈ సంస్థ యాక్సియామ్ ఆయుర్వేద లో మిగిలి ఉన్న 73.5శాతం వాటాను కూడా కొనుగోలు చేసేందుకు నిర్ణయించింది. ఆలోఫ్రూట్ అనే ఉత్పత్తి యాక్సిమోమ్‌నుంచి వస్తున్నది.

## నాలుగుశాతం పెరిగిన వెండిధరలు



**ముంబయి, మే 7:** వెండిధరలు అంతర్జాతీయ మార్కెట్లలో నాలుగుశాతం మేర పెరిగాయి. ఔన్స్ ఒక్కంటికి 80 డాలర్లుగా ఉన్నాయి. దేశీయ ఫ్యూచర్ల పరంగాచూస్తే ఎంసిఎక్స్‌లో కిలో ఒక్కంటికి 2.6 లక్షల వరకూ ఎగబాకింది. స్పాట్ మార్కెట్‌లో వెండి 4.56శాతం పెరిగి ఔన్స్‌కు80.87డాలర్లుగా అమ్మకాలున్నాయి. ఎంసిఎక్స్‌లో జులై 26 సెటిల్‌మెంట్లు 3.54శాతంపెరిగి కిలో ఒక్కంటికిరూ.2,62,238గా ట్రేడ్ అయింది. ఇంట్రాడేలో ఒకదశలో 2లక్షల 62వేల443 గా కూడా నమోదయింది. బంగారం ధరలు కూడా గ్లోబల్ మార్కెట్లలో పెరిగాయి. ముడిచమురు ధరలు కొంతమేర తగ్గడంతో ఇపుడు బులియన్ రంగానికి డిమాండ్‌పెరిగింది. స్పాట్ పసిడి ధరలు 0.94శాతంపెరిగి ఔన్స్ ఒక్కంటికి 5735.27 డాలర్లుగా నడిచింది. ఎంసిఎక్స్ పసిడి ఫ్యూచర్లు 0.6శాతం పెరిగి రూ.1.53 లక్షలుగా పదిగ్రాముల ధరలు కొనసాగాయి. ట్రేడర్లు ఇపుడు రానున్న అమెరికా ఆర్థిక గణాంకాలు, వివిధ దేశాల సెంట్రల్ బ్యాంకుల వడ్డీరేట్ల సవరణలపైనా దృష్టిపెట్టారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps